శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥180/-
పేజీలు:180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

వరుసగా మూడో సంవత్సరం ఇపిఎఫ్ వడ్డీ 8.25 శాతం
విద్యా సంస్కరణలకు సంతకాల ఉద్యమం
నీట్ విద్యార్థి ఆత్మహత్య 07

సంపుటి 28, సంచిక: 355 | శుక్రవారం | 19-06-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

# 30 నుంచి రైతు భరోసా

## ఖమ్మం జిల్లా మధిరలో పెద్ద ఎత్తున రైతు సమ్మేళనం అదే వేదిక నుంచి రైతు ఖాతాల్లోకి నగదు జమ



- ఉపాధి హామీ మార్పులపై అధ్యయనానికి మంత్రివర్గ ఉప సంఘం
- రామగుండం ఎరువులను తెలంగాణకే ఎక్కువ ఇవ్వాలి
- కేంద్ర కొనుగోలు విధానం ఆందోళనకరం
- మొత్తం ధాన్యాన్ని కేంద్ర సర్కారే కొనుగోలు చేయాలి
- మంత్రుల సమావేశం నిర్ణయం
- రైతు సంక్షేమ, ఎరువుల సరఫరా, పంటల కొనుగోలు, మెట్రో రైల్ విస్తరణపై మంత్రివర్గ సమావేశంలో చర్చ
- వివరాలు మీడియాకు వెల్లడించిన మంత్రులు ఉత్తమ్, తుమ్మల, సీతక్క

### ఇక డిజిటల్ కేబినెట్ వ్యవస్థ

**పరిపాలనా సంస్కరణల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ కేబినెట్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఐటి శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులకు ప్రత్యేక ట్యాబ్‌ను అందించారు. కాగిత రహిత పరిపాలనను ప్రోత్సహించడం, పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడం ఈ నిర్ణయ లక్ష్యం. ఇకపై కేబినెట్ నోట్లు, ఎజెండాలు, ఇతర అధికారిక పత్రాలు ఎక్కువగా డిజిటల్ రూపంలోనే నిర్వహించబడతాయి. దీంతో కాగిత వినియోగం తగ్గడంతో పాటు నిర్ణయ ప్రక్రియ మరింత వేగం కానుంది.**

ప్రజాపక్షం/హైదరాబాద్

వానాకాలం పంటలకు రైతులకు పెట్టుబడి సాయం రైతు భరోసా ఈ నెల 30వ తేదీన నుంచి పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఖమ్మం జిల్లా మధిరలో అదేరోజు భారీ ఎత్తున రైతుల సమ్మేళనం ఏర్పాటు చేయాలని, అదే వేదిక నుంచి రాష్ట్రంలోని రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా రైతు భరోసా నిధులు జమ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రైతులు పండించే సన్న ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే బోనస్ ఏడు రకాల సన్నాలకు మాత్రమే కొనసాగించాలని మంత్రుల సమావేశం నిర్ణయం తీసుకుంది. మార్కెట్లో ఈ ఏడు రకాలకు ఉన్న డిమాండ్, ప్రజల అవసరాల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం బిపిటి–5204, ఆర్ఎన్ఆర్–15048, హెచ్ఎంటి సోనా, జై శ్రీరామ్, కెఎన్ఎం–1638, డబ్ల్యూజిఎల్–44, కెఎన్ఎం–7715 ఈ ఏడు



రకాల సన్నాలకు మాత్రమే బోనస్ వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ వంగడాలు రాష్ట్రంలో సాగవుతున్న సన్నబియ్యం పంటలో దాదాపు 83 శాతం వాటాను కలిగి ఉండటమే కాకుండా ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థ వెలుపల కూడా మంచి మార్కెట్ డిమాండ్ కలిగి ఉన్నాయని తెలియజేసింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రుల సమావేశంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గురువారం జరిగింది. వ్యవసాయ, రైతు సంక్షేమం, ఎరువుల సరఫరా, పంటల కొనుగోలు, హైదరాబాద్ మెట్రో విస్తరణ, పరిపాలనా సంస్కరణలకు సంబంధించిన పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. సమావేశం నిర్ణయాలను అనంతరం రాష్ట్ర సాగునీరు, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క మీడియాకు వెల్లడించారు. తెలంగాణకు ఎరువుల కేటాయింపుల విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై మంత్రులు ఆందోళన వ్యక్తం చేశారు. నెలకు సుమారు రెండు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయిస్తామని కేంద్రం హామీ ఇచ్చినా, గత కొన్ని నెలలుగా ఆ మేరకు సరఫరా జరగలేదని వారు తెలిపారు.

**రామగుండం ఎరువులను తెలంగాణకే ఎక్కువ ఇవ్వాలి**

తెలంగాణకు ఇప్పటివరకు మరింత అధిక స్థాయిలో ఎరువుల నిల్వలు అందాల్సి ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. రామగుండం తరువాయి 8లో

## నేడు జెనీవాలో అమెరికా–ఇరాన్

# ఎంఓయు సందడి

- ఎలక్ట్రానిక్ పద్ధతిలో సంతకాలు చేసిన ట్రంప్– పెజిష్కియన్
- తెరచుకోవడానికి సిద్ధంగా ఉన్న హోర్ముజ్ జలసంధి
- అంతర్జాతీయ సంబంధాల్లో సరికొత్త అధ్యాయం : అబ్బాస్ అరాఘ్చీ
- ఒప్పందంలో ఇజ్రాయెల్ చేరుతుంది : జె.డి.వాన్స్ ఆశాభావం
- ఇక ఇజ్రాయెల్‌పై అణుదాడి జరగదని నెతన్యాహూకి చెప్పా : ట్రంప్
- దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడి : ముగ్గురు మృతి





### ఒప్పందంలో కీలక అంశాలు బహిర్గతం

అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన 14 అంశాల ప్రాథమిక ఒప్పందాన్ని వైట్‌హౌస్‌లో పేరుచెప్పడానికి ఇష్టపడని ట్రంప్ సహాయకులు బుధవారం రాత్రి విడుదల చేశారు. ఒప్పందంలో వదిలేసిన, పరిష్కారంకాకుండా మిగిలిపోయిన ప్రశ్నలకు సమాధానాలను 60 రోజుల పాటు చర్చల్లో రెండు దేశాలు వెతుక్కుంటాయి. ఈ ఒప్పందంలో అన్నింటికంటే ముఖ్యంగా మూడు కీలక అంశాలు ఉన్నాయి. తాత్కాలిక ప్రాథమిక ఒప్పందం, తుది ఒప్పందం తర్వాత కూడా ఇరాన్ ప్రవర్తన బాగుంటే, ఒప్పందానికి కట్టుబడితే 300 బిలియన్ డాలర్లు నిధిని సమకూర్చేందుకు ట్రంప్ అనుమతిస్తారు. అమెరికా దృక్కోణం నుండి చూసినప్పుడు లెబనాన్‌లో దాడులు ఒప్పందాన్ని దెబ్బతీస్తాయని ఆందోళన చెందుతుండగా, లెబనాన్‌లో శాశ్వతంగా దాడులు ఆగిపోవాలని ఇరాన్‌గట్టిగా ఆశిస్తోంది. ఈ ఒప్పందంలో అన్నింటికంటే ఇరాన్‌కు లెబనాన్‌లో దాడులు ఆగిపోవడమే ముఖ్యమైన అంశం.

**వాషింగ్టన్ :** స్విట్జర్లాండ్ రాజధాని జెనీవాలో అమెరికా–ఇరాన్ మధ్య తాత్కాలిక అవగాహన ఒప్పంద (ఎంఓయు) సమావేశానికి రంగం సిద్ధం కావడంతో అనేక సందేహాలు, ప్రశ్నార్థకాలమధ్య అంతర్జాతీయ రాజకీయ వర్గాలలో,ప్రపంచమార్కెట్లలో పెద్ద సందడి నెలకొంది. జెనీవాలో ప్రతిష్ఠాత్మకమైన ఈ రాజకీయ ఘట్టానికి తగినవిధంగా ఏర్పాట్లు చేశామని స్విట్జర్లాండ్ ప్రభుత్వం గురువారం ప్రకటించింది. ఈ సమావేశానికి ఒకరోజు ముందుగానే అమెరికా–ఇరాన్ మధ్య ఎంఓయుపై సంతకాలు జరిగాయి. ఈ విషయాన్ని వైట్‌హౌస్ అధికారులు కూడా ధృవీకరించారు. ఒప్పంద ప్రక్రియ పూర్తయిన వెంటనే ఇరాన్–ఒమన్ మధ్య 55 కి.మీ వెడల్పునగల కీలకమైన హోర్ముజ్ జలసంధి శుక్రవారం తెరచుకుంటుంది. అదేవిధంగా లెబనాన్ సహా అన్ని రంగాలలో యుద్ధ దాడులు తక్షణం నిలిచిపోతాయి. రాబోయే 30 రోజులలో అమెరికాసెంట్‌కామ్ అధికారులు దశలవారీగా సైన్యాలను ఉపసంహరించడం ద్వారా ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం పూర్తిగా తొలగిపోయి పూర్వస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే హోర్ముజ్‌లో 52 నౌకలు, 200 చమురు ట్యాంకర్లు స్వేచ్ఛారవాణాకోసం ఎదురుచూపులు చూస్తున్నాయి. కాగా ఈ ఒప్పందం అంతర్జాతీయ సంబంధాలలో ఒక సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తుందని ఇరాన్ విదేశీ వ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చీ సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టారు. సైప్రస్ విదేశాంగ మంత్రి కాన్‌స్టాంటినోస్ కోంబోస్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ, ఈ ఒప్పందం ఆర్థిక సహకారాన్ని విస్తరిస్తుందని చెప్పారు. జెనీవాలో సమావేశంలో అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ తో పాటు పాకిస్థాన్ ప్రధానమంత్రి షరీఫ్, ఇతర మంత్రులు, ఇరాన్ నాయకులు అరాఘ్చీ తదితరులు పాల్గొంటున్నారు. వీలైతే ట్రంప్–పెజిష్కియన్ కూడా కూడా హాజరవుతారు. ఇదిలా ఉండగా షెహబాజ్ షరీఫ్ గతంలో చేసిన తన సోషల్ మీడియా పోస్టింగ్‌లో మార్పులు చేశారు. చరిత్రాత్మకమైన తరువాయి 8లో

## దక్షిణ మహారాష్ట్రలో

# నిలిచిన 'నైరుతి'



- ఈనెల 4-18 వరకు 41 శాతం లోటు వర్షపాతం
- 72.2కు బదులు 42.6 మిల్లీమీటర్ల వర్షపాతం
- నమోదు : ఐఎండి

**న్యూఢిల్లీ :** దేశంలో నైరుతి రుతుపవనాలు ఊరించి ఉసూరుమనిపించాయి. దక్షిణ మహారాష్ట్రలోనే నిలిచిపోయాయి. దీంతో ఈ నెల4 నుంచి 18వ తేదీ మధ్య భారతదేశం 41 శాతం వర్షపాత లోటును ఎదుర్కొంటోందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇదే కాలంలో దేశంలో సాధారణంగా కురవాల్సిన 72.2 మిల్లీమీటర్లకు బదులుగా కేవలం 42.6 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఐఎండి తరువాయి 8లో

# వడగాడ్పులు.. వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రాబోయే ఏడు రోజుల పాటు వాతావరణం భిన్నంగా ఉండబోతోంది. ఒకవైపు వర్షాలు కురుస్తూనే, మరోవైపు పలు జిల్లాల్లో వడగాల్పుల తీవ్రత కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు గురువారం మధ్యాహ్నం విడుదల చేసిన బులెటిన్‌లో వెల్లడించారు. రాబోయే రెండు రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెద్దగా తరువాయి 8లో

## ఎవరేమన్నా... ఎవరు అడ్డుపడినా..

# మూసీ ప్రక్షాళన.. భారత్ ఫ్యూచర్ సిటీ ఆగదు

- మూసీలో కాలుష్యం కంటే కల్వకుంట్ల వారి కడుపులోనే కాలుష్యం ఎక్కువ
- ఫ్యూచర్ లేని నేతలు.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటున్నారు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపాటు
- వనమహోత్సవంలో భాగంగా గుర్రంగూడ రిజర్వు ఫారెస్టులో రూ.17.84 కోట్ల వ్యయంతో పనులకు శ్రీకారం



ప్రజాపక్షం/రంగారెడ్డి/ఎల్.బి.నగర్

ఎవరేమన్నా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని, ఎవరు అడ్డుపడినా అంతర్జాతీయ స్థాయిలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గండిపేట నుండి గౌరారం వరకు 55 కిలోమీటర్లు అంతర్జాతీయ స్థాయిలో మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ చేసే బాధ్యత తమ ప్రభుత్వానిదన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా గుర్రంగూడ ఎకో పార్క్ లో 2026 వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా 17.84 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించ తలపెట్టిన అర్బన్ ఫారెస్ట్ పార్కుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ పార్కులకు సిఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనమండలి చీఫ్ పట్నం మహేందర్ రెడ్డి, ఎం ఎల్ సి లు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, అటవీ శాఖ ఉన్నత అధికారులతో కలిసి శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఎవరేమన్నా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. సబర్మతి, యమునా కంటే గొప్పగా మూసీ ప్రక్షాళన చేస్తామన్నారు. గుర్రం గూడా లోని ఫారెస్ట్ స్థలాన్ని కొంతమంది ప్రైవేటుగా మలుచుకునే ప్రయత్నం చేశారని, ఆ భూమిని కాపాడి 424 ఎకరాల నేషనల్ ఫారెస్ట్ కు కేటాయించి అంతర్జాతీయ ప్రమాణాలతో పార్కు ఏర్పాటుకు ఆదేశించామన్నారు. చెరువులు కుంటలు ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు హైడ్రాను తీసుకొస్తే దానిని భూతంగా చూపించేందుకు కొంత మంది ప్రయత్నిస్తున్నారని తరువాయి 12లో

## పార్లమెంటరీ పార్టీ సమావేశానికి

# ఆరుగురు ఎంపిల డుమ్మా



### శివసేన (యుబిటి)లో చీలిక

- శివసైనికుల ఆగ్రహం నుంచి ఆ ద్రోహులు తప్పించుకోలేరని సంజయ్ రౌత్ మండిపాటు

**న్యూఢిల్లీ :** మహారాష్ట్రలో శివయవసేన (యుబిటి)లో మరోసారి చీలిక వచ్చింది. పార్టీకి చెందిన తొమ్మిది మంది లోక్‌సభ ఎంపిలలో ఆరుగురు గురువారం ఢిల్లీలో జరిగిన కీలక పార్లమెంటరీ పార్టీ సమావేశానికి గైర్హాజరయ్యారు. ఈ చర్య వల్ల మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన వర్గంలోకి వారు అధికారికంగా చేరబోతున్నారనే విషయం స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో శివసేన (యుబిటి) ఏకైక రాజ్యసభ ఎంపి అయిన సంజయ్ రౌత్ తీవ్ర అసహనంతో ఊగిపోతూ, సమావేశానికి రాని వారిపై విరుచుకుపడ్డారు. శివసైనికుల ఆగ్రహం నుండి తమను తాము కాపాడుకోవడానికి తరువాయి 12లో

## ఎన్‌డిఎ అంటే...

# 'నేషనల్ డిఫెక్టర్స్ అలయన్స్'

- మూడింట రెండొంతుల మెజారిటీ రాదని కాంగ్రెస్ విమర్శ
- అమిత్ షా వ్యూహాన్ని అడ్డుకునేందుకు మిత్రపక్షాలతో సంప్రదింపులు జరుపుతున్నామని ప్రకటన

**న్యూఢిల్లీ :** దేశంలోని పలు రాష్ట్రాల్లో రాజకీయనేతలు పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్నారు. అయితే ప్రతిపక్షాల నుంచి నేతలు ఇతర పార్టీలలోకి ఫిరాయిస్తున్న తరుణంలో అధికార ఎన్‌డిఎను 'నేషనల్ డిఫెక్టర్స్ అలయన్స్' (జాతీయ ఫిరాయింపుదారుల కూటమి) అని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ అభివర్ణించారు. లోక్‌సభలో మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేస్తున్న దుర్మార్గపు ప్రయత్నాలను అడ్డుకునేందుకు తమ పార్టీ నాయకత్వం మిత్రపక్షాలతో సంప్రదింపులు జరుపుతోందని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన తరువాయి 12లో

# కౌలు రైతు చట్టం అమలు ఇంకెప్పుడు?



- 2023లో సిఎం హామీ ఇచ్చినా ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదు
- తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న కౌలు రైతులు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో వ్యవసాయమే జీవనాధారం. కానీ ఆ వ్యవసాయాన్ని నమ్ముకుని, పగలు రాత్రి కష్టపడే కౌలు రైతుల జీవితాలు మాత్రం నేడు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. కౌలు రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడమే ఇందుకు కారణం. నాటి టిపిసిసి అధ్యక్షులు నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2023 సెప్టెంబర్ 13న రాసిన బహిరంగ లేఖలో కౌలు రైతుల గుర్తింపు చట్టాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి కార్యాచరణ చర్యలు చేపట్టనేలేదు. ప్రభుత్వం ప్రతి ఏటా రైతుల కోసం దాదాపు రూ.25,000 కోట్లు ఖర్చు చేస్తోంది. కానీ, ఈ నిధులు పట్టా పత్రాలతో ముడిపడి ఉండటం వల్ల, వ్యవసాయం చేయని భూయజమానుల పరమవుతుండగా అసలైన సాగుదారులు అప్పులపాలై, ఆత్మహత్యలకు పాల్పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు ఇవ్వనంత కాలం తెలంగాణలో వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారం సాధ్యం కాదని 'తెలంగాణ కౌలు రైతుల సర్వే 2026 – నివేదిక' ఆధారంగా స్పష్టమవుతుంది.

**అధిక శాతం కౌలు రైతులు బలహీన వర్గాల వారే**

ఇటీవల కౌలు రైతుల గుర్తింపు సాధన కమిటీ నిర్వహించిన 'తెలంగాణ కౌలు రైతుల సర్వే 2026 – నివేదిక మేరకు 22 జిల్లాలలోని 47 మండలాలకు చెందిన 57 గ్రామాల్లో 1,816 మంది కౌలు రైతులను కలిసి సర్వే నివేదికను రూపొందించింది. ఈ సర్వే ప్రకారం కౌలు సాగు చేస్తున్న తరువాయి 8లో

## రాయదుర్గం భూముల

# వేలంపై హైకోర్టు స్టే

### రాష్ట్ర ప్రభుత్వం, టిజిఐఐసి, గౌరా వెంచర్స్‌కు నోటీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గ్ పన్మక్త గ్రామంలోని సర్వే నెం.83/1లోని ఐదు ఎకరాల భూమి వేలానికి సంబంధించి జారీ చేసిన ఇ–వేలం నోటిఫికేషన్, అనంతర ప్రక్రియపై హైకోర్టు గురువారం స్టే విధించింది. ఈ భూమిని ఎకరాకు రూ.237 కోట్ల చొప్పున గౌరా వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కొనుగోలు చేసింది. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం, టిజిఐఐసి, గౌరా వెంచర్స్‌లకు నోటీసులు ఇచ్చింది. మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లపై జస్టిస్ ఎన్.వి. శ్రవణ్‌కుమార్ సుదీర్ఘ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి పలు కీలక ప్రశ్నలు సంధించారు. పరిశ్రమలు, ఉపాధి కల్పన కోసం కేటాయించిన భూములను తిరిగి స్వాధీనం చేసుకున్న తర్వాత రియల్ ఎస్టేట్ అభివృద్ధికి వినియోగించేలా వేలం వేయడం సమంజసమేనా అని ప్రశ్నించారు. భూకేటాయింపును రద్దు చేసిన తర్వాత ఎస్‌బిఐ చెల్లించిన మొత్తాన్ని తిరిగి చెల్లించారా, చెల్లించకుండా వేలం ఏ ప్రాతిపదికన నిర్వహించారని కూడా ప్రశ్నించారు. టిజిఐఐసి తరపున సీనియర్ న్యాయవాది తరువాయి 12లో

# ట్రంప్ పేరుపై మమకారమెందుకు?

తన దుందుడుకు చేష్టలతో యావత్ ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న అమెరికా దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరుతో హైదరాబాద్ వీధుల్లో ఒక దానికి నామకరణం చేయాలని తలపెట్టడం చర్చనీయాంశంగా మారింది. నానక్‌రామ్ గూడలోని అమెరికా కాన్సులేట్ కార్యాలయానికి ఆనుకొని ఉన్న కీలక రహదారికి ఆయన పేరు పెట్టాలని ప్రభుత్వ పెద్దలు నిర్ణయించుకున్నారు. ఈ రహదారికి 'డొనాల్డ్ ట్రంప్ ఎవెన్యూ'గా జూన్ 23న అధికారికంగా నామ కరణం చేసేందుకు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

మానవాళికి మేలు చేసిన వ్యక్తులు, చరిత్ర పురుషులు, వివిధ రంగాల ప్రముఖులను భావి తరాలు గుర్తుంచుకునేలా వారి పేర్లను స్మారకాలు, ప్రదేశాలు, రహదారులు, భవనాలు, సంస్థలకు పెట్టడం కొత్తేమీ కాదు. హైదరాబాద్, సికిందరాబాద్‌ను అనుసంధానించే రహదారికి దేశస్వాతంత్ర్యోద్యమానికి నేతృత్వం వహించిన మహాత్మాగాంధీ పేరుతో నామకరణం చేశారు. మహానగరం చుట్టూ మణిహారం లాంటి ఔటర్ రింగ్ రోడ్డుకు ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరు పెట్టారు. అలాగే తెలంగాణ బిడ్డ, మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు పేరును మెహదీపట్నం నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్ళే ఎక్స్‌ప్రెస్ హైవేకి నామకరణం చేశారు. ఇటీవల కొత్త ఫ్లైఓవర్ ఒకదానికి పూర్వ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరుతో జాతికి అంకితం చేశారు. హైదరాబాద్‌లో తుది శ్వాస విడిచిన ప్రఖ్యాత గాయకుడు ఉస్తాద్ బడే గులామ్ అలీ ఖాన్ పేరును బషీర్‌బాగ్ ప్రధాన రోడ్డుకు నామకరణం చేయడం తెలిసిందే. అలాగే ప్రాణాంతక మలేరియా దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందని సికిందరాబాద్‌లోనే కనుగొని ప్రపంచానికి గొప్ప మేలు చేసిన బ్రిటీష్ డాక్టర్ సర్ రొనాల్డ్ రాస్‌ను ఈ గడ్డ గౌరవించింది. ఆయన పరిశోధన చేసిన పాత బేగంపేటలోని మిలిటరి ఆసుపత్రికి సర్ రొనాల్డ్ రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పారాసైటాలజీ అని నామకరణం చేసింది.

ఏ కోణంలో చూసినా హైదరాబాద్‌లోని రహదారికి ట్రంప్ పేరు పెట్టడం యోగ్యత కలిగిన నిర్ణయం అనిపించుకోదు. ప్రజాకంటక నిర్ణయాల ద్వారా స్వదేశంలోనే అత్యంత తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నాడు ఈ అమెరికా అధ్యక్షుడు. ఆ దేశ ప్రధాన నగర వీధుల్లో ఇప్పటికే పలుమార్లు ట్రంప్‌కు వ్యతిరేకంగా భారీ ప్రదర్శనలు జరిగాయి. తన ఆధిపత్యాన్ని చాటుకునేందుకు ప్రపంచ దేశాలపై అడ్డగోలు టారిఫ్‌లను విధించటమే కాకుండా, ఇజ్రాయెల్‌తో జతకట్టి ఇరాన్‌పై అనైతిక యుద్ధానికి దిగిన జగడాల మారి. ఏకంగా ఒక సర్వసత్తాక దేశాధ్యక్షుడైన నికోలస్ మదురోను అర్ధరాత్రి ఆయన భార్యతో సహా వెనిజులా నుంచి అమెరికా దళాలు అపహరించుకుపోయిన దుర్నీతిని ప్రపంచం చూచింది.

ట్రంప్ రెండవ దశ పరిపాలనలో భారతదేశానికి చేసిన నష్టాలు, అవమానాలు అంతులేనివి. మన దేశ ఎగుమతులపై పదే పదే అడ్డగోలుగా టారిఫ్‌లను విధించటంతో స్థానికంగా వివిధ పరిశ్రమలు కుదేలయ్యాయి. భారత– పాకిస్థాన్ యుద్ధాన్ని తానే ఆపానని ఇప్పటికే యాభై సార్లకు పైగా చెప్పుకొని మన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని ట్రంప్ మసకబార్చారు. ఇరాన్‌పై అమెరికా యుద్ధం, హోర్మూజ్ మూసివేత ద్వారా భారత్ సహా, ప్రపంచ దేశాలన్నీ ఇంధన కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయి. ధరల పెరుగుదలతో సామాన్యుల నడ్డి విరుగుతున్నది. అన్నిటికీ మించి భారతదేశ ఆహ్వానంపై నావిక కసరత్తు 'మిలాన్'లో పాల్గొని విశాఖపట్నం నుంచి తిరిగి వెళ్తున్న ఇరాన్ నౌకపై అమెరికా టార్పెడో దాడితో 87 మంది నావికులను బలికొనడాన్ని ఎలా మరచిపోగలం? తాజాగా హోర్మూజ్ వద్ద వాణిజ్య నౌకలపై అమెరికా డ్రోన్ దాడులలో ముగ్గురు భారతీయుల దుర్మరణం వార్త ఇంకా కసిరేపుతూనే ఉంది. వీటన్నిటికి కారణం ట్రంప్ పాలన గైకొన్న నిర్ణయాలే కదా! ఆయన హయాంలో అవలంభిస్తున్న జాత్యాహంకార, సామ్రాజ్యవాద, అప్రజాస్వామిక చర్యలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను బెంబేలెత్తిస్తున్న చపలచిత్త నిర్ణయాలు నిస్సందేహంగా చరిత్రలో చీకటి కోణాలుగా నిలిచిపోతాయి.

అమెరికా కాన్సులేట్ వద్ద రహదారికి ట్రంప్ పేరు పెట్టాలనే ప్రతిపాదన గత ఏడాది డిసెంబర్‌లోనే తెరపైకి వచ్చింది. దానిపై అప్పట్లోనే వ్యతిరేకత వ్యక్తమైంది. సిపిఐ శాసనసభా పక్ష నాయకుడు కూనంనేని సాంబశివరావు శాసనసభ సమావేశాలలోనే ట్రంప్ పేరు పెట్టవద్దని ప్రభుత్వానికి సూచించారు. అయినప్పటికీ, ప్రభుత్వం ముందుకు సాగుతూ ఈ నెల 23న నామకరణానికి సిద్ధమైనట్లు వార్తలు వచ్చాయి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వమే రహదారికి ట్రంప్ పేరు పెడుతుంటే అమెరికాకు మోదీ సరెండర్ అయ్యాడని నిత్యం విమర్శించే ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఎందుకు మౌనంగా ఉన్నారంటూ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రాంచందర్‌రావు ఇప్పటికే సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. నిజంగా హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ వద్ద రహదారికి అమెరికా ముఖ్యుడి పేరు పెట్టాలనుకుంటే ఇతర ప్రత్యామ్నాయాలు అనేకం ఉన్నాయి. అందులో ఆ దేశ మాజీ అధ్యక్షుడు అబ్రహాం లింకన్ ఒకరు. అమెరికాను ముక్కలవ్వకుండా కాపాడి, బానిసత్వాన్ని రద్దుచేసిన మహోన్నత వ్యక్తి. 'ప్రజల యొక్క, ప్రజల చేత, ప్రజల కోసం నడిచే ప్రభుత్వం భూమిపై నశించదు' అని ప్రజాస్వామ్యం గుర్తించి గొప్పగా నిర్వచించిన రాజనీతిజ్ఞుడు లింకన్. రాష్ట్ర ప్రభుత్వం అనుకుంటున్న రహదారికి లింకన్ పేరు పెడితే బహుశా ఎవరికీ అభ్యంతరం ఉండకపోవచ్చు. పైగా మంచి పేరు సైతం దక్కుతుంది. కాబట్టి పునరాలోచన అవశ్యం. ●

NATIONAL TESTING AGENCY (NTA)

## ఊహాగానాలు నమ్మొద్దు

**నీట్-యుజి 2026 రీఎగ్జామినేషన్‌కు ఇంకా మూడు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉండటంతో విద్యార్థులు ప్రశాంతంగా ఉండాలి.సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలను నమ్మవద్దు.21న జరగనున్న రీ-ఎగ్జామ్ షెడ్యూల్ ప్రకారమే నిర్వహిస్తాం. అధికారిక సమాచారాన్నే నమ్మాలి.ఇప్పుడు మీ శ్రమపై నమ్మకం ఉంచాల్సిన సమయం వచ్చింది. మీ వంతు అత్యుత్తమ ప్రయత్నం చేయండి. ప్రస్తుతం మీ నుంచి ఆశిస్తున్నది అంతే. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సమాచారాన్ని నమ్మవద్దు.**

- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)




# 'సికిల్ సెల్ రుగ్మత'తో తీవ్ర రక్తహీనత

తల్లిదండ్రుల నుంచి సంక్రమించే జన్యులోప రుగ్మతగా సికిల్ సెల్ రక్తహీనత ప్రమాదకరంగా మారుతోంది. శరీర కణజాలానికి ప్రాణవాయువు, ఆక్సిజన్‌ను అందించే రక్తంలోని ఎర్ర రక్త కణాలతో కూడిన హీమోగ్లోబిన్ ఉపకరిస్తుంది. ఆక్సిజన్‌ను సరఫరా చేస్తున్న ఎర్ర రక్త కణాలు గుండ్రంగా, మృదువుగా, ఫ్లెగ్జిబుల్‌గా ఉంటూ రక్త నాళాల గుండా సులభంగా ప్రవహిస్తూ, మన ఆరోగ్యానికి పునాదులు వేస్తున్నాయి. సికిల్ సెల్ రుగ్మత బారిన పడిన వ్యక్తుల ఎర్ర రక్త కణాలు దృఢంగా, గట్టిగా, అంటుకునే గుణంతో, సిఆకారంలో కొడవలి లేదా సికిల్ ఆకారంలో ఉంటాయి. ఆ సికిల్ కణాలు రక్తనాళాల్లో సులభంగా ప్రవహించకుండా, త్వరగా చనిపోతూ ఉంటాయి. ఇలాంటి సికిల్ సెల్ రుగ్మత ఉన్న వారిలో దీర్ఘకాలిక రక్తహీనత, నొప్పులు, అవయవాలకు హాని, ఇతర తీవ్రమైన అనారోగ్యాలను కలిగిస్తుంది. దీనినే సికిల్ సెల్ రుగ్మతగా పిలవడం జరుగుతోంది.

**ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినం–2026 ఇతివృత్తం:** సికిల్ సెల్ రక్త రుగ్మత పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, ముందస్తు పరీక్షలతో గుర్తించడం, వ్యాధిగ్రస్తుల పట్ల జాగ్రత్తలు తీసుకోవడం, రోగుల కుటుంబాల్లో ఆత్మ విశ్వాసం పెంచడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడానికి ఐరాస ఆమోదంతో ప్రతి ఏట 19 జూన్ రోజున ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినం (వరల్డ్ సికిల్ సెల్ అవేర్‌నెస్ డే) పాటించడం ఆనవాయితీగా మారింది. 2026 ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినం ఇతివృత్తంగా జీవన అవకాశాల అంతరాలను తగ్గించడం: సికిల్ సెల్ వ్యాధిలో సమానత్వం (క్లోజింగ్ ది సర్వైవల్ గ్యాప్ : ఈక్విటీ ఇన్ సికిల్ సెల్ డిసీజ్) అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

**భారత్‌లో సికిల్ సెల్ భారం:** భారత గిరిజన తెగల్లో అత్యధికంగా కనిపిస్తున్న సికిల్ సెల్ వ్యాధి ప్రమాదకరంగా మారుతోంది. 2011 వివరాల ప్రకారం 8.6 శాతం గిరిజన జనాభా లేదా 67.8 మిలియన్ల అభాగ్యులు సికిల్ సెల్ రుగ్మత బారిన పడ్డట్లు స్పష్టం అవుతున్నది. భారతదేశంలో ఎంపీ, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, ఒడిసా, గుజరాత్, మహారాష్ట్ర లాంటి 17 రాష్ట్రాలు/యుటిల్లో అధికంగా సికిల్ సెల్ వ్యాధిగ్రస్థులు కనిపిస్తున్నారు. వ్యాధి తీవ్రతను గుర్తించిన భారత ప్రభుత్వం జాతీయ సికిల్ సెల్ రక్తహీనత నిర్మూలన మిషన్‌ను తీసుకోని 2047 నాటికి ఈ వ్యాధిని నిర్మూలించడానికి పథక రచన చేసి అమలు పరుస్తున్నారు. ఈ మిషన్‌లో భాగంగా 2026 నాటికి 7 కోట్ల గిరిజనులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి కృషి జరుగుతోంది.

**సికిల్ సెల్ వ్యాధికి కారణాలు:** జన్యువుల్లో మ్యుటేషన్ లేదా ఒకదానితో మరొకటి మార్పు చెందడం వల్ల హిమోగ్లోబిన్ ఉత్పత్తిలో లోపం జరుగుతుంది. తల్లిదండ్రులు ఇద్దరిలో ఇలాంటి జన్యు లోపాలు ఉన్నట్లు అయితే వారి సంతానానికి కూడా సికిల్ సెల్ రుగ్మత సంక్రమిస్తుంది. తల్లిదండ్రుల్లో ఒక్కరికి మాత్రమే జన్యు లోపం ఉన్నట్లైతే పిల్లల్లో జన్యు లోపాలు కనిపించినప్పటికీ రోగ లక్షణాలు మాత్రం కనిపించకపోవచ్చని తెలుసుకోవాలి. సికిల్ సెల్ వ్యాధులు (హీమోగ్లోబిన్ఎస్ఎస్, ఎస్ఐ, ఎస్ బీటా తలసేమియా లాంటివి) పలు రకాలుగా ఉంటాయని, వీటిని త్వరగా గుర్తించడం వల్ల వ్యక్తుల జీవితాల్లో ఆరోగ్యాన్ని మెరుగు పరచవచ్చని, ఆరోగ్య సురక్ష గొడుగు పట్టవచ్చని తెలుసుకోవాలి.

**(19 జూన్ ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినం సందర్భంగా)**

# ఒక్క రూపాయి కూడా పెన్షన్ పెంచని పుష్కరకాల ప్రధాని మోదీ



ఎం. కోటేశ్వరరావు

నరేంద్రమోదీ పుష్కర ప్రధానిగా, ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను మించి పదవిలో కొనసాగుతున్న నేతగా భక్తులు, అభిమానుల నుంచి నీరాజనాలు, ఇతరుల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ప్రభుత్వ పథకాల గురించి విజయగానాలు చేస్తుంటే వాటి తీరు గురించి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడ అన్నింటి గురించి వివరించేందుకు అవకాశం లేదు. కనుక మోదీ మానవత్వం గురించి వెల్లడించే సామాజిక పెన్షన్ల గురించి చూద్దాం. మోదీ పదవిని అధిష్టించే నాటికి అంతకుముందు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన జాతీయ సామాజిక సహాయక పథకం(ఎన్ఎస్ఎపి) అమల్లో ఉంది. దీనిలో ఆరు పదులు దాటిన వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెన్షన్లు మంజూరు చేశారు. ఈ పథకాన్ని రాష్ట్రాలు అమలు జరపాలి. కేంద్రం ఇచ్చే నగదుకు అదనపు మొత్తాలను జత చేయాలనే షరతేమీ లేదు. అయితే కొన్ని రాష్ట్రాలు అదనంగా ఇస్తున్నాయి. అందువల్లనే వివిధ రాష్ట్రాలలో చెల్లించే మొత్తాల్లో ఎంతో తేడా ఉంది. 2023లో కేంద్రం తెలిపిన సమాచారం ప్రకారం సగటున రు.1,100 అందుకుంటున్నట్లు తేలింది. ఉదాహరణకు రెండింజన్ల పాలనలో అభివృద్ధిలో దూసుకుపోతున్నదని చెబుతున్న మధ్యప్రదేశ్‌లో 60 ఏండ్ల వారికి రు.600, ఎనభై దాటిన వారికి రు.1,000 ఇస్తున్నారు. ఛత్తీస్‌ఘర్‌లో రు.350, ఇక దేశానికే ఆదర్శం అని చెబుతున్న గుజరాత్‌లో వరుసగా రు.750, రు.1,250 చెల్లిస్తున్నారు. మోదీ తరువాత ఆదర్శవంతమైన పాలన అందించారని కీర్తిస్తున్న నితీష్ కుమార్ పాలనలో బీహార్‌లో ఇస్తున్నది రు.1,100, ఆంధ్రప్రదేశ్‌లో రు.4,000చెల్లిస్తున్నారు. దేశంలో ఇదే గరిష్టం. ఏ రాష్ట్రం ఎంత చెల్లించినా దీనిలో కేంద్రం ఇస్తున్న మొత్తాలు 60 ఏండ్లు దాటిన వారికి రు.200, ఎనిమిది పదులు దాటితే రు.500 మాత్రమే. అంతకు మించి ఇచ్చేదంతా రాష్ట్రాల బడ్జెట్ల నుంచే కేటాయిస్తున్నారు. అభాగ్యులను ఆదుకొనేందుకు ముందుకు రాకుండా వారి ఉసురుపోసుకుంటున్న పాలనలో రెండింజన్లు ఉంటేనేం ఇరవై ఉన్నా ప్రయోజనం ఏముంది! ప్రతిపక్షంలో ఉండగా ఇంత స్వల్పమొత్తాలా అంటూ ఇదే బిజెపి విమర్శించింది.

ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమంటే తనకు అధికారమిస్తే అచ్చే దిన్ అంటే మంచి రోజులను తెస్తానని 2014లో వాగ్దానం చేసిన నరేంద్రమోదీ వయస్సు ఇప్పుడు 75 దాటింది. ఇది కూడా వివాదమే, ఒక సర్టిఫికెట్ ప్రకారం 75దాటితే ఆయన చెప్పుకుంటున్నదాని ప్రకారం త్వరలో అధిగమిస్తారు. అరవై దాటిన వారెవరికైనా వృద్ధుల బాధలేమిటో తెలిసి ఉండాలి. అయినా ఏమీ తెలియనట్లు, పెన్షన్ మొత్తాలను పెంచుతూ సవరించేందుకు మొరాయిస్తున్నారు, ససేమిరా కుదరదని మాట్లాడక పోయినా ఆచరణలో చూపుతున్నారు. పెన్షన్ల సవరణకు ఏమైనా కాల వ్యవధి ఉందా అని లోక్‌సభలో వచ్చిన ఒక ప్రశ్నకు మంత్రి కమలేష్ పాశ్వాన్ 2025 ఫిబ్రవరి 11న ఇచ్చిన సమాధానం ఇలా ఉంది. ''పథకపు మార్గదర్శక సూత్రాల ప్రకారం ప్రత్యేకించి సవరణకు నిర్ణీత వ్యవధి అంటూ లేదు. అయినప్పటికీ అంతకు ముందు ఉన్న రు.75ను 2007లో రు.200కు పెంచారు. ఎనభై అంతకు మించిన వయస్సున్న వారికి 2011లో రు.500కు పెంచారు. ఇదిగాక వితంతు, వికలాంగులకు ఇచ్చే మొత్తాన్ని 2012లో రు.200 నుంచి రు.300కు పెంచారు.'' అప్పటి నుంచి కేంద్రం ఒక్క రూపాయి కూడా అదనంగా ఇవ్వటం లేదు. మోదీ సర్కార్ మానవ ముఖానికి ఇది అద్దం పడుతున్నది. ఈ ప్రభుత్వ హయాంలోనే పార్లమెంటు సభ్యులకు నెలవారీ వేతనాలు, ఇతర అలవెన్సులు రు.లలో ఎలా పెంచారో చూద్దాం.

| అంశం | 2014 | 2026 |
|---|---|---|
| మూలవేతనం | 50,000 | 1,24,000 |
| నియోజకవర్గ అలవెన్సు | 45,000 | 90,000 |
| ఆఫీసు ఖర్చులు | 45,000 | 75,000 |
| సమావేశాల హాజరు రోజు భత్యం | 2,000 | 2,500 |
| కనీస పెన్షన్: నెలకు | 20,000 | 31,000 |
| పెన్షన్ ప్రతి ఏటికి అదనం | 1,500 | 2,500 |

2014లో ఉన్న ఇతర సౌకర్యాల్లో ఇంటి వసతి, వైద్యం, మూడు టెలిఫోన్లు ఉచితం, ఏడాదికి 50వేల యూనిట్లు విద్యుత్, నీరు ఉచితం, ఎంపితో పాటు కుటుంబ సభ్యులు లేదా తోటి ప్రయాణం చేసేవారికి ఏటా 34 విమాన ప్రయాణాలు, అపరిమితంగా రైలు, బస్సు ప్రయాణాలు ఉచితం. 2026 నాటికి పైన పేర్కొన్న సౌకర్యాలతో పాటు ఏడాదికి లక్షన్నర రూపాయలు ఫోన్లు, ఇంటర్నెట్ సౌకర్యాలకోసం ఇస్తున్నారు. పన్నెండు సంవత్సరాల్లో ఇంతగా ఎంపిల వేతనాలు, అలవెన్సులు పెంచిన ప్రభుత్వం వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పెన్షన్ మొత్తాలను పెంచేందుకు ఎలాంటి మార్గదర్శక సూత్రాలు లేవని చెబుతోంది. ఆర్టికల్ 370, ఇతర అనేక చట్టాలను సవరించిన మానవతావాదులు దీనికి అవసరమైన సవరణలు చేపట్టేందుకు ఎవరు అడ్డుపడ్డారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా ఎంపిలు, ఉద్యోగుల వేతనాలు పెంచుతున్న కేంద్రం అభాగ్యులకు అది వర్తించదా? 2013 నుంచి 2026 నాటికి రూపాయి విలువ పతనమై పెన్షన్ నిజమొత్తం విలువ రు.99 మాత్రమే, (ఈ మొత్తానికి గ్రామాల్లో అరకిలో వేరుశనగ నూనె మాత్రమే వస్తుంది, మిగతా అవసరాల సంగతేమిటి) అందుకే కొందరు దీన్ని క్రూర పరిహాసం అని వర్ణిస్తున్నారు, ఇతర వస్తువుల ధరలు, ఇతర అవసరాల పెరుగుదల సంగతేమిటి? పెన్షన్ మొత్తాలు చాలటం లేదని 95శాతం మంది చెప్పినట్లు ప్రభుత్వం నిర్వహించిన సర్వేలోనే తేలింది, వారంతా బిజెపి పాలిత రాష్ట్రాల వారే అని వేరే చెప్పనవసరం లేదు. ఒకవైపు అవసరమైన తిండి గింజల కొనుగోలుకు తగిన ఉపాధి లేని కారణం గా కేంద్ర ప్రభుత్వం 80కోట్ల మందికి ప్రతినెలా ఐదేసి కిలోల వంతున అందిస్తున్నది. దేశంలో వృద్ధుల సంఖ్య పెరుగుతున్నదని అందరూ అంగీకరిస్తున్నారు. సమాజంలో వస్తున్న మార్పులు, లేదా బతుకుతెరువు కోసం వలసలు పోతున్న స్థితిలో ఇండ్లకే పరిమితం అవుతున్న వృద్ధులను ఆదుకోవాల్సిన సామాజిక బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. దేశంలో వృద్ధుల సంఖ్య ప్రస్తుతం 17కోట్లని, 2030 నాటికి 20కోట్లకు పెరుగుతుందని అంచనా. కేంద్రం తన పథకంలో భాగంగా పెన్షన్లు ఎందుకు పెంచటం లేదని బిజెపి నేతలను ప్రశ్నిస్తే రాష్ట్రాలకు ఆ బాధ్యత లేదా అని ఎదురుదాడికి దిగుతారు.

ఆంధ్రప్రదేశ్ మాదిరి బిజెపి పాలిత రాష్ట్రాలలో ఎందుకు ఇవ్వటం లేదంటే మెమ్మెమ్మె బెబ్బెబ్బె అంటారు. రాష్ట్రాలకూ బాధ్యత ఉంది గనుకనే అవి పెంచుతున్నాయి, కేంద్రం ఎందుకు పెంచ టం లేదన్నదే ప్రశ్న. పెన్షన్ల మొత్తాన్ని పెంచేందుకు రాష్ట్రాలకు స్వేచ్ఛ ఉందని అతితెలివి సమాధానం కేంద్రమంత్రి నోటి నుంచి వెలువడింది.

తమ ప్రభుత్వం రాష్ట్రాలకు ఇచ్చే నిధుల వాటాను 32 నుంచి 42 శాతానికి పెంచిందని బిజెపి నేతలు గొప్పగా చెప్పుకుంటారు. కానీ ఆ ముసుగులో పథకాలలో కేంద్రం తన వాటాను గణనీయంగా తగ్గించిన సంగతి మాత్రం చెప్పరు. తాజాగా గ్రామీణ ఉపాధి పథకంలో 90 ని 60శాతానికి కుదించిన సంగతి తెలిసిందే. అనేక పథకాలు ఇలానే ఉన్నాయి, అందుకే ఒక చేత్తో ఇచ్చి మరోచేత్తో లాక్కున్నట్లు విమర్శలు వచ్చాయి. పెన్షన్ల విషయంలో కూడా అదే జరుగుతోంది. వివిధ రాష్ట్రాలు ఇస్తున్న మొత్తాలతో పాటు సంఖ్య కూడా పెరిగింది, కనీసం వారికైనా కేంద్రం నిధులు మంజూరు చేయటం లేదు. అయినా ఏ బిజెపి నేతా లేదా చంద్రబాబు వంటి వారు గానీ కుక్కిన పేనుల్లా ఉంటారు తప్ప దాన్ని గురించి అడగరు. కార్పొరేట్లకు ఎంతో ఉదారంగా పన్ను తగ్గించి ఖజానాకు రావాల్సిన మొత్తాన్నే రద్దు చేశారు, రాయితీలు జనం చెల్లిస్తున్న పన్నుల నుంచే ఇస్తున్నారు. మరొక దుర్మార్గం ఏమంటే తాము ఇచ్చే ముష్టి రెండువందల రూపాయలను కూడా ఏ రాష్ట్రంలో ఎంతమందికి ఇవ్వాలో కేంద్రం కోటాలను నిర్ణయిస్తుంది. ఆ మేరకు ప్రస్తుతం 3.09కోట్ల మందికి మాత్ర మే ఇస్తున్నది, అదనంగా సంఖ్యను పెంచుకోవాలంటే రాష్ట్రాలే భరించాలని చెప్పిం ది. అలా రాష్ట్రాలు అదనంగా ఇస్తున్న సంఖ్యతో కలుపుకుంటే మొత్తం లబ్దిదారులు 5.86 కోట్ల మంది ఉన్నారు. నిజానికి ఇప్పటికే ఆరుకోట్ల మంది వృద్ధులు నిరుపేద కుటుంబాల్లో ఉన్నారని అంచనా, వారందరికీ కూడా కేంద్ర ప్రభుత్వం పెన్షన్లు ఇవ్వటం లేదు. అందుకే కేంద్ర ప్రభుత్వం, బిజెపి పాలిత రాష్ట్రాలు వృద్ధుల ఉసురు తీస్తున్నాయని వ్యాఖ్యానించాల్సి వస్తోంది. గతంలో 58 ఏండ్లు దాటిన మహిళలు, 60 ఏండ్ల వృద్ధులకు రైళ్లలో ఛార్జీల రాయితీ ఉండేది. మోదీ సర్కార్ దీన్ని కూడా రద్దు చేసింది. తన ఏలుబడిలో దేశ సంపద(జిడిపి)ని గణనీయంగా పెంచానని మోదీ సర్కార్ చెప్పుకుంటుంది. సమాజానికి ఉపయోగపడని సంపద తాడి చెట్టు మాదిరి ఎంత పెరిగితేనేం! మోదీ అధికారానికి వచ్చినపుడు సామాజిక పెన్షన్లకు కేటాయించిన మొత్తం జిడిపిలో 0.58 శాతం ఉండేది, పదేండ్ల తరువాత అది 0.2కు పడిపోయింది. ఏటా బడ్జెట్ కేటాయింపులు తొమ్మిదిన్నరవేల కోట్లకు అటూ ఇటూగానే ఉన్నాయి. రెండు సంవత్సరాల క్రితం నీతి ఆయోగ్ నివేదిక దేశంలో 78శాతం మంది వృద్ధులు పెన్షన్లు లేకుండా బతుకుతున్నారని, వారిలో 70శాతం తమ కుటుంబాల మీద ఆధారపడుతున్నట్లు పేర్కొన్నది. ఎన్నికల బాండ్ల జారీ చెల్లదు అని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన తరువాత కూడా పదివేల కోట్ల రూపాయలు వెచ్చించి వాటిని ముద్రించి చెత్తబుట్టలో వేసిన జవాబుదారీతనం నరేంద్ర మోదీది. కేవలం పన్నెండు కార్పొరేట్ సంస్థలు దివాలా ప్రకటిస్తే వాటికి రద్దు చేసిన మొత్తం రు.2.84లక్షల కోట్లు. నేను పైసా తినను ఇతరులను తిననివ్వను అని ఎన్ని కబుర్లు చెబితే ఏమిటి! అందువలన నరేంద్రమోదీ ఎంతకాలం పదవిలో ఉంటేనేం, మరో పుష్కరం ఉన్నా ప్రయోజనం ఏమి టి?

*ఇప్పటికే ఆరు కోట్ల మంది వృద్ధులు నిరుపేద కుటుంబాల్లో ఉన్నారని అంచనా, వారందరికీ కూడా కేంద్ర ప్రభుత్వం పెన్షన్లు ఇవ్వటం లేదు. అందుకే కేంద్ర ప్రభుత్వం, బిజెపి పాలిత రాష్ట్రాలు వృద్ధుల ఉసురు తీస్తున్నాయని వ్యాఖ్యానించాల్సి వస్తోంది. గతంలో 58 ఏండ్లు దాటిన మహిళలు, 60 ఏండ్ల వృద్ధులకు రైళ్లలో ఛార్జీల రాయితీ ఉండేది. మోదీ సర్కార్ దీన్ని కూడా రద్దు చేసింది. తన ఏలుబడిలో దేశ సంపద(జిడిపి)ని గణనీయంగా పెంచానని మోదీ సర్కార్ చెప్పుకుంటుంది. సమాజానికి ఉపయోగపడని సంపద తాడిచెట్టు మాదిరి ఎంత పెరిగితేనేం!*

# మన బడుల్లో పౌష్టికాహార విప్లవం ఎప్పుడు?



ఎం.కృష్ణ ఆదిత్య
పాత్రికేయుడు

తెలంగాణ అభివృద్ధి అంటే కేవలం భవనాలు, పరిశ్రమల నిర్మాణంతోనే కాదు, రేపటి సమాజాన్ని నడిపించే పౌరు ల ఆరోగ్య పునాదుల పైన కూడా ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా ఒకటి నుంచి పదిహేనేళ్ల వయసున్న బాలబాలికల దశ భౌతిక, మానసిక ఎదుగుదలకు అత్యంత కీలకమైనది. ఈ వయసులో సరైన పోషకాహారం అందకపోవడం వల్ల రక్తహీనత, శారీరక ఎదుగుదల మందగించడం వంటి సమస్యలు జీవితకాలం వెంటాడుతాయి. కేవలం పిల్లల ఆకలి తీర్చడం వేరు, వారికి సంపూర్ణ పౌష్టికాహారాన్ని అందించడం వేరు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని కేవలం కడుపు నింపే కార్యక్రమంగా కాకుండా, వ్యాధి నిరోధక శక్తిని, మేధో వికాసాన్ని పెంచే ఒక అద్భుతమైన ఆరోగ్య ఉద్యమంగా మలచుకోవాల్సిన అవస రం ప్రభుత్వాల పైన ఎంతైనా ఉంది.

పాఠశాల భోజనం విషయంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్న ఫిన్లాండ్ మోడల్‌ను మనం తప్పక అధ్యయనం చేయాలి. ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా పాఠశాల పిల్లలందరికీ పూర్తి ఉచితంగా, అత్యుత్తమ పోషకాలతో కూడిన భోజనాన్ని అందించిన దేశం ఫిన్లాండ్ విద్యార్థుల రోజువారీ క్యాలరీల అవసరంలో మూడొంతుల భాగం కేవలం ఆ భోజనం ద్వారానే లభించేలా మెనూను శాస్త్రీయంగా డిజైన్ చేస్తారు. విద్యా బడ్జెట్‌లో కనీసం ఒకటి నుంచి ఒకటిన్నర శాతం నిధులను కేవలం పిల్లల భోజనానికే కేటాయిస్తారు. భోజనం కోసం చేసే ఖర్చును వృధాగా కాకుండా, భవిష్యత్తు తరాల ఆరోగ్యంపై పెడుతున్న అత్యుత్తమ పెట్టుబడిగా ఆ ప్రభుత్వం భావిస్తుంది. మన పాలకులు కూడా ఈ మోడల్‌ను స్ఫూర్తిగా తీసుకుని బడ్జెట్ కేటాయింపులు చేయాల్సిన సమయం ఆసన్నమైంది.

**కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం – కేటాయింపుల్లో పక్షపాతం**

గణాంకాలను పరిశీలిస్తే పసిపిల్లల పౌష్టికాహారం పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. దేశవ్యాప్తంగా సుమారు 11 కోట్ల మంది పిల్లలకు మధ్యాహ్న భోజనం అందించేందుకు కేంద్రం వార్షిక బడ్జెట్‌లో కేటాయిస్తున్నది సుమారు 12,467 కోట్ల రూపాయలు మాత్రమే. అంటే ఒక్కో విద్యార్థి పౌష్టికాహారం కోసం కేంద్రం రోజుకు వెచ్చిస్తున్నది సగటున ఐదారు రూపాయలు మాత్రమే. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా.. దేశంలో పసిపిల్లల పోషణ కోసం రోజుకు ఐదారు రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వాలు, వివిధ పథకాలు, గోశాలల ద్వారా ఒక్కో పశువు రోజువారీ గ్రాసం కోసం సగటున రూ.30 నుంచి రూ.50 వరకు కేటాయిస్తుండటం (ఉదా: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి నిరాశ్రయ గోవంశ సహ భాగితా యోజన) పాలకుల ప్రాధాన్యతలను ప్రశ్నిస్తోంది. ప్రచార ఆర్భాటాలకు, కార్పొరేట్ రాయితీలకు వేల కోట్ల రూపాయలు సునాయాసంగా కేటాయిస్తున్న కేంద్రం.. దేశ భవిష్యత్తును నిర్ణయించే పిల్లల భోజనానికి, నాణ్యమైన ప్రోటీన్ అందించడానికి నిధులు పెంచకపోవడం తీవ్ర శోచనీయం.



**సాంస్కృతిక విశ్వాసాలు కాదు.. శాస్త్రీయతే ప్రామాణికం కావాలి**

పాఠశాలల్లో పిల్లలకు అందించే పౌష్టికాహారం విషయంలో కొన్నిసార్లు అనవసరమైన వివాదాలు తలెత్తుతున్నాయి. ఇటీవల ప్రముఖ పండితులు గరికపాటి నరసింహారావు గారు పిల్లల మధ్యాహ్న భోజనం, అందులోని మెనూపై చేసిన విమర్శలు ఈ కోవలోనివే. పిల్లల కడుపు నింపే, కండపుష్టిని పెంచే ఆహారాన్ని మత, సాంస్కృతిక లేదా వ్యక్తిగత ఆహార నియమాలతో ముడిపెట్టడం అత్యంత శోచనీయం. ఒకవిద్యార్థికి గుడ్డు లేదా మాంసాహారం ద్వారా లభించే ప్రోటీన్ అనేది జీవశాస్త్ర పరమైన ప్రాథమిక అవసరం తప్ప, అది ఒక విలాసమో లేదా సంప్రదాయాలకు వ్యతిరేకమైన అంశమో కాదు. సమాజంలో పలుకుబడి ఉన్న పండితులు తమ వ్యక్తిగత విశ్వాసాలను పసి పిల్లల పళ్లెంలో రుద్దాలని చూసినప్పుడు, ప్రభుత్వాలు వాటికి తలొగ్గకుండా కేవలం వైద్య, శాస్త్రీయ ఆరోగ్య ప్రమాణాలకు మాత్రమే పెద్దపీట వేయాలి.

**పౌష్టికాహారంలో వ్యత్యాసాలు**

రాష్ట్ర ప్రభుత్వం తన తాజా బడ్జెట్‌లో విద్యా రంగానికి 26,674 కోట్ల రూపాయలు కేటాయించడం, అందులో సుమారు 900 కోట్లతో ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనాన్ని విస్తరించడం గొప్ప ముందడుగు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలోని గురుకుల పాఠశాలల్లో చదువుతు న్న విద్యార్థులకు వారానికి ఒకసారి చికెన్ వంటి మాంసాహారాన్ని అందిస్తూ అత్యుత్తమ నాణ్యమైన ప్రోటీన్‌ను సమకూరుస్తోంది. కానీ, అదే తరహా విధానాన్ని అత్యంత పేదరికంలో మగ్గుతున్న సామాన్య ప్రభుత్వ బడుల్లో ఎందుకు అమలు చేయలేకపోతున్నారనేది ప్రశ్న. ప్రభుత్వ బడుల్లో చదివే పిల్లలందరికీ ఆ మాత్రం పౌష్టికాహారం అందకపోవడం తీవ్రమైన వివక్షే అవుతుంది.

**ప్రయోగాత్మక మార్పులు, డిజిటల్ హెల్త్ ప్రొఫైలింగ్**

బాలబాలికల్లో పోషకాహార లోపాన్ని సమూలంగా పారద్రోలేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డిజిటల్ హెల్త్ ప్రొఫైలింగ్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. ప్రతి విద్యార్థి బరువు, ఎత్తు, హిమోగ్లోబిన్ శాతాన్ని నమోదు చేస్తూ, రాష్ట్రంలో ఏ ఏ ప్రాంతాల్లో లోపం తీవ్రంగా ఉందో అంచనా వేయాలి. అలా గుర్తించిన ఏజెన్సీ గ్రామాల్లోని బడుల్లో ప్రయోగాత్మకంగా వారానికి కనీసం రెండు రోజులు మధ్యాహ్న భోజనంలో చికెన్ వంటి మాంసాహారాన్ని మెనూలో చేర్చాలి. తద్వారా లభించే ఐరన్, నాణ్యమైన ప్రోటీన్ వల్ల పిల్లల ఎదుగుదలలో వచ్చే అద్భుతమైన మార్పులను అధ్యయనం చేసి, ఈ విధానాన్ని క్రమంగా రాష్ట్రమంతటా విస్తరించాలి.

**విద్యా ప్రణాళికలో ఒక సబ్జెక్టుగా న్యూట్రిషన్**

బడిలో పౌష్టికాహారం వడ్డించడమే కాకుండా, దాని విలువను పిల్లలకు చిన్నప్పటి నుంచే బోధించడం ఎంతో ముఖ్యం. జపాన్ దేశంలో అమలు చేస్తున్న ఆహార విద్య తరహాలో, మన రాష్ట్రంలో కూడా న్యూట్రిషన్ సబ్జెక్టును పాఠ్యప్రణాళికలో తప్పనిసరిగా చేర్చాలి. ఏ రకమైన ఆహారం తీసుకుంటే ఎన్ని క్యాలరీలు అందుతాయి, ఆరోగ్యకరమైన స్థానిక ఆహారం ఏది, జంక్ ఫుడ్ అనర్థాలు ఏమిటి అనే విషయాలను పిల్లలకు ఒక సబ్జెక్టు రూపంలో బోధించాలి.

దీనిద్వారా విద్యార్థులు కేవలం బడిలోనే కాకుండా, ఇళ్లలో కూడా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహిస్తారు. ప్రభుత్వాలు చిత్తశుద్ధి తో ఈ మార్పులకు శ్రీకారం చుడితే, ఆరోగ్యవంతమైన నవ తెలంగాణను మనం గర్వంగా నిర్మించుకోవచ్చు.

# పురపాలక ఇంజనీరింగ్ విభాగాల్లో బదిలీల గందరగోళం !

- అధికారుల కొరతతో కునారిల్లుతున్న జిహెచ్ఎంసి, సిఎంసి, ఎంఎంసి
- వర్షాకాలం వేళ ప్రాజెక్టులపై బదిలీల ఎఫెక్ట్
- హేతుబద్ధీకరణ లేదంటూ ఇంజనీర్లను రిలీవ్ చేయని కమిషనర్లు
- భారీగా నిబంధనల ఉల్లంఘన
- డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ట్రై కార్పొరేషన్‌ల ఇంజనీరింగ్ విభాగాల్లో తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది. ఇప్పటికే సరిపడా అధికారులు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో, పురపాలక శాఖ ఇటీవల జారీ చేసిన బదిలీ ఉత్తర్వులు క్షేత్రస్థాయి పనులపై, పాలనా వ్యవహారాలపై తీవ్ర ప్రభావం చూపేలా మారాయి. దీంతో స్థానచలనం కలిగిన ఇంజనీరింగ్ అధికారులను రిలీవ్ చేయకపోవడం ఇప్పుడు మున్సిపల్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ బదిలీ వ్యవహారం కాస్తా ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులు, ఎస్ఎన్‌డిపి, వర్షాకాల పనులపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ఇప్పటి వరకు నత్త నడకన సాగిన ప్రాజెక్టు పనులు ఇటీవలనే ఉపందుకున్న తరుణంలో ఇంజనీర్ల బదిలీతో పనులు మరోసారి ఆటకెక్కే పరిస్థితులు నెలకొన్నాయి. జిహెచ్ఎంసి, సిఎం, ఎంఎం సి పరిధిలోని ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ (ఇఇ), డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ (డిఇఇ), అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ (ఎఇఇ)లను బదిలీ చేస్తూ గత మే 30వ తేదీన పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజారోగ్య శాఖ సిఫార్సుల మేరకు విభాగాధిపతి ఈ జిఒను విడుదల చేశారు. అయితే బదిలీల ఉత్తర్వులు వెలువడి 20 రోజు లు కావస్తున్నా, జిహెచ్ఎంసి, సిఎంసి కమిషనర్లు మా త్రం తమ పరిధిలోని ఇంజనీర్లను రిలీవ్ చేయడం లేదు. ఈ బదిలీల్లో అసలు హేతుబద్ధీకరణే లేదని, దీనిపై పునఃపరిశీలన జరపాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ దృష్టికి కమిషనర్లు తీసుకెళ్లినట్లు సమాచారం.

### వన్-వే ట్రాఫిక్‌లా బదిలీలు !

ప్రస్తుతం జిహెచ్ఎంసిలో కేవలం 50 శాతం సిబ్బందితోనే ఇంజనీరింగ్ విభాగం నెట్టుకొస్తోంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో జిహెచ్ఎంసి నుంచి మెజార్టీ అధికారులను బదిలీ చేసి, ఆ స్థానాల్లో కొత్తవారిని కేటాయించకపోవడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

**ఎఇఇలు :** జిహెచ్ఎంసి నుంచి 30 మంది ఎఇఇలను బదిలీ చేయగా, కేవలం ఐదుగురిని మాత్రమే ఇక్కడికి పంపారు.

**డిఇఇలు :** 23 మంది బదిలీ కాగా, కేవలం 17 మందిని కేటాయించారు.

**ఇఇలు :** ఏడుగురు ఇఇల స్థానంలో ఆరుగురిని మాత్రమే బదిలీ చేశారు.

ఇక్కడి నుంచి వెళ్లేవారి సంఖ్య ఎక్కువగా ఉండటం, వచ్చే వారి సంఖ్య తక్కువగా ఉండటంతో పనులు ఎలా సాగుతాయని అధికారులు ప్రశ్నిస్తున్నారు. బదిలీలపై అభ్యంతరం లేకపోయినా.. వెళ్లే వారి స్థానంలో సరిపడా అధికారులను కేటాయించాలని కోరుతున్నారు. దీనిపై సవరణ ఉత్తర్వులు వస్తాయా? లేదా పాత జిఒనే అమలు చేస్తా రా? అనేది వేచి చూడాలి. మరోవైపు ఎంఎంసిలో బదిలీ అయిన ఇంజనీర్లను రిలీవ్ చేసినప్పటికీ, వారికి కొత్త చోట పోస్టింగ్ ఇవ్వకపోవడంతో వారు ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నారు.

### వర్షాకాలం వేళ ప్రాజెక్టులకు బ్రేక్?

ప్రస్తుతం ముసురు పడుతున్న వర్షాకాలం కావడంతో రోడ్ల మరమ్మతులు, ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టడానికి ఇంజనీర్లు ఎంతో కీలకం. దీనికి తోడు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' (హెచ్‌సిటీ) ప్రాజెక్టులు ఇప్పుడిప్పుడే పట్టాలెక్కాయి. కెబిఆర్ పార్కు చుట్టూ రెండు చోట్ల పనులు ప్రారంభం కాగా, ఎస్ఆర్‌డిపిలో భాగంగా చేపట్టిన నల్లగొండ ఎక్స్ రోడ్ స్టీల్ బ్రిడ్జి, మూసారాం బాగ్ బ్రిడ్జి పనులు ఊపందుకున్నాయి. ఈ తరుణంలో కీలకమైన ఇంజనీర్లను బదిలీ చేయడం వల్ల ప్రాజెక్టుల పురోగతి, నిర్వహణ దెబ్బతింటుందని ఉన్నతాధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### నిబంధనలు గాల్లోకి.. భారీగా చేతులు మారిన డబ్బులు?

ఈ బదిలీల ప్రక్రియపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా మూడేళ్లు ఒకే స్థానంలో ఉన్నవారిని బదిలీ చేయాల్సి ఉండగా, ఆ నిబంధనలను ఎక్కడా పాటించలేదనే ఆరోపణలు వస్తున్నాయి. స్థానిక కార్పొరేషన్‌ల అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోలేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సస్పెన్షన్‌లో ఉన్న ఒక అధికారిని జిహెచ్ఎంసి నుంచి ఎంఎంసికి బదిలీ చేయడం హాట్ టాపిక్‌గా మారింది. కరీంనగర్ నుంచి నెల రోజుల క్రితమే వచ్చిన ఒక ఈఈని మళ్లీ బదిలీ చేయడం గమనార్హం. బదిలీలకు ముందు ఇంజనీర్ల నుంచి మూడు ఆప్షన్లు తీసుకున్నప్పటికీ, కొందరికి వారు కోరని, ఆప్షన్‌లలో ప్రస్తావించని సంస్థలకు బదిలీలు చేశారు. (ఉదాహరణకు ఎంఎంసిలోని ఓ ఇంజనీర్ ఆప్షన్ ఇవ్వకపోయినా సిఎంసికి బదిలీ చేశారు). ఈ బదిలీల వెనుక పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, నచ్చిన చోట పోస్టింగుల కోసం భారీగా డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలు మున్సిపల్ సర్కిళ్లలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

## డిజిటల్ ఆధారాల విశ్లేషణలో పోలీసులకు ఆధునిక శిక్షణ



**ప్రజాపక్షం /హైదరాబాద్:** సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు, సోషల్ మీడియా ఆధారిత నేరాల దర్యాప్తులో పోలీసు అధికారుల సాంకేతిక సామర్థ్యాలను పెంపొందించే లక్ష్యంతో తెలంగాణ పోలీస్ అకాడమీ (టిజిపిఎ)లో నిర్వహించిన నాలుగు రోజుల ఫాస్ట్ ట్రాక్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. కాల్ డీటైల్ రికార్డులు (సిడిఆర్), ఇంటర్నెట్ ప్రోటో కాల్ డీటైల్ రికార్డులు (ఐపీడీఆర్), టవర్ డంప్ విశ్లేషణ, సోషల్ మీడియా ప్రొఫైలింగ్, డిజిటల్ ఫుట్‌ప్రింట్ అనాలిసిస్ వంటి ఆధునిక అంశాలపై ఫీల్డ్ స్థాయి అధికారులకు శిక్షణ అందించారు. టిజిపిఎ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ ప్రత్యేక చొరవతో చేపట్టిన ఈ కార్యక్రమం కానిస్టేబుల్ నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి వరకు దర్యాప్తు అధికారుల నైపుణ్యాలను మెరుగుపరచేందుకు రూపొందించారు. ఐదో బ్యాచ్‌లో మొత్తం 31 మంది అధికారులు శిక్షణ పొందగా, వారిలో ఒక ఇన్‌స్పెక్టర్, ఆరుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, 21 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. కోర్సు ముగింపు కార్యక్రమాన్ని కోర్సు డైరెక్టర్ వి. భాస్కర్, కోఆర్డినేటర్, సైబర్ నిపుణు డు ప్రగతి రతన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నేటి పరిస్థితుల్లో సైబర్ నేరాలు, వైట్ కాలర్ క్రైమ్స్, ఆర్గనైజ్డ్ క్రైమ్ కేసుల దర్యాప్తులో డిజిటల్ ఆధారాల ప్రాధాన్యం రోజురోజుకు పెరుగుతోందని అధికారులు పేర్కొన్నారు. ఈ శిక్షణ పొందిన అధికారులు తమ యూనిట్లలో నేరాల దర్యాప్తును మరింత సమర్థవంతంగా నిర్వహించగలరని, ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని యూనిట్లు తమ సిబ్బందిని ఈ కోర్సులకు పంపించి ఆధునిక సైబర్ దర్యాప్తు పద్ధతులపై అవగాహన పెంపొందించాలని కోర్సు డైరెక్టర్ వి. భాస్కర్ సూచించారు.

## ధాన్యం కొనుగోళ్ల విషయంలో చేతులెత్తేసిన ప్రభుత్వం: హరీశ్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** డిజిటల్ క్యాబినెట్ పేరుతో ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం చేతులెత్తేయడం రైతాంగాన్ని దారుణంగా మోసం చేయడమేనని బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రోజుకో వింత నిర్ణయం, చెత్త విధానాలతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బతుకును చిత్తు చేస్తోందని, వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెడుతున్నదని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన 'డిస్ట్రక్టివ్ క్రియేటివిటీ' తో రైతుల జీవితాలతో ఆడుకుంటున్నదన్నారు. ఇక నుంచి కేంద్రం నిర్దేశించిన కోటాకు లోబడి మాత్రమే ధాన్యం కొనుగోళ్లు చేస్తామని చెప్పడమంటేనే ధాన్యం కొనుగోళ్ల నుండి రాష్ట్ర ప్రభుత్వం తప్పుకోవడమేనని మండిపడ్డారు. రైతులు పండించిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే రైతులు పండిన పంటను ఏం చేయాలని, వారు ఇంట్లో దాచుకోవాలా అని ప్రశ్నించారు. పంట బోనస్ రావాలంటే ఏడు రకాల సన్నాలే సాగు చేయాలని చెప్పడమంటే సాగుపై ఆంక్షలు విధించడమేనని అన్నారు. కృష్ణా జలాలపై త్రి సభ్య కమిటీ సమావేశానికి ముందే తెలంగాణలో నీటి కొరత ఉన్నదని, ఎపి ఇప్పటికే అధికంగా నీటిని తరలించిందని లేఖలు రాసినప్పటికీ మళ్లీ 10 టిఎంసిల నీటిని ఎపికి ఎందుకు వదిలారని హరీశ్‌రావు ప్రశ్నించారు.

## జార్ఖండ్ రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్

### నాలుగోసారి గెలిచి రికార్డు సృష్టించిన నత్వానీ

**రాంచీ:** జార్ఖండ్‌లో గురువారం జరిగిన రాజ్యసభ ఎన్నికలో క్రాస్ ఓటింగ్ జరిగింది. మరో మూడుఓట్లు కౌంటింగ్‌లో చెల్లుబాటు కాలేదు. అసెంబ్లీలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రణవ్ ఝా ఓడిపోయారు. ఎన్‌డిఎ మద్దతుగల స్వతంత్ర అభ్యర్థి పరిమళ్ నత్వానీకి అనుకూలంగా క్రాస్ ఓటింగ్ జరగడంతో ఆయన నాలుగోసారి కూడా రాజ్యసభకు గెలిచి చరిత్ర సృష్టించారు. మరో రాజ్యసభ స్థానాన్ని అసెంబ్లీలో అధికారపార్టీ జార్ఖండ్ ముక్తిమోర్చాకు చెందిన అభ్యర్థి బైద్యనాథ్ రామ్ గెలుచుకున్నారు. అసెంబ్లీలో ఎన్‌డిఎకు తగినంత బలం లేకపోయినాగానీ క్రాస్ ఓటింగ్‌తో విజయం సాధించింది. దీంతో కాంగ్రెస్‌పార్టీకి చెందిన ప్రణవ్ ఝా ఓటమిపాలయ్యారు. ఝాకు ఇరవైఓట్లు మాత్రమే లభించగా నత్వానీకి 28 ఓట్లు వచ్చినట్లు ఒక అధికారి చెప్పారు. జెఎంఎం అభ్యర్థి రామ్ 30 ఓట్లు గెలుచుకుని రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఇద్దరు బిజెపి అభ్యర్థులు, ఒక కాంగ్రెస్ అభ్యర్థి ఓట్లు కౌంటింగ్‌లో చెల్లుబాటు కాలేదు. 81 మంది శాసనసభ్యులున్న జార్ఖండ్ అసెంబ్లీలో బిజెపి నాయకత్వానగల ఎన్‌డిఎకు 24 మంది శాసనసభ్యుల బలం మాత్రమే ఉంది. ఇందులో ఇద్దరు బిజెపి ఎంఎల్‌ఎల ఓట్లు చెల్లుబాటు కాలేదు. ఐనాగానీ నత్వానీకి 28 ఓట్లు లభించాయి. జెఎంఎం,కాంగ్రెస్, ఇతర కూటమి పార్టీలకు కలిపి 56 మంది ఎంఎల్‌ఎల బలం ఉంది. జార్ఖండ్ అసెంబ్లీ ప్రాంగణంలోనే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. నత్వానీ 2008 2020 వరకు ఇండిపెండెంట్ ఎంపీగా రెండుసార్లు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. 2020లో ఆంధ్రప్రదేశ్ నుండి ఎంపీగా రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. ఇప్పుడు క్రాస్ ఓటింగ్ ద్వారా మళ్ళీ జార్ఖండ్ నుండి రాజ్యసభకు ఎన్నికయ్యారు. రాజ్యసభలో సుదీర్ఘకాలం ఒక స్వతంత్ర ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన ఘనత కూడా ఆయనే దక్కించుకున్నారు. ఈ సందర్భంగా తనను గెలిపించిన ఎంఎల్‌ఎలు అందరికీ ఆయన సోషల్ మీడియా వేదికగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జార్ఖండ్‌ను ఆయన కర్మభూమిగా అభివర్ణించారు. మరో ప్రకటనలో విడిగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్, ఇతర బిజెపి నాయకులకు, ఎన్‌డిఎ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కర్మభూమి జార్ఖండ్ ఎప్పటికీ తనను విస్మరించలేదని అన్నారు. మరోసారి జార్ఖండ్ ప్రజలకు రాజ్యసభ ద్వారా సేవలు అందించడానికి అవకాశం లభించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.


**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం :: సుల్తానాబాద్**

కొటేషన్ ప్రకటన

1) **E1/SLTB/QN/07/2026-27/2026 తేది: 18.06.2026,** 2) పెద్దపల్లి జిల్లా, సుల్తానాబాద్ మున్సిపాలిటీలో కింది వాటి కోసం కొటేషన్లు కోరుచున్నవి: (ఎ) సమావేశ మందిరం కొరకు డెస్క్‌టాప్ కండెన్సర్ గూస్‌నెక్ మైక్రోఫోన్, (బి) నేల మీద వేసే గ్రీన్ మ్యాట్, (సి) టేబుల్ గ్లాసులు, (డి) టార్చ్‌లైట్, ఛార్జింగ్ లైట్లు, గ్లౌజులు, స్టీల్ గొడుగులు, నీటి క్యాన్లు, క్లైంబింగ్ స్ట్రైక్స్ (గాఫ్స్) & పాదరక్షలు, ఎలక్ట్రిక్ ఇన్సులేటర్ స్టిక్, బూట్లు, లైట్లతో కూడిన నేమ్ బోర్డులు, సబ్‌మెర్సిబుల్ పంపుల కొరకు ఎలక్ట్రికల్ ప్యానెల్ బోర్డు మొదలైనవి. తేది: 19.06.2026 నుండి 22.06.2026 వరకు కార్యాలయ వేళల్లో సాయంత్రం 4:00 గంటలలోపు.

సం/-కమిషనర్
సుల్తానాబాద్ మున్సిపాలిటీ

DIPR R.O. No. : 4493-PP/CL/ADVT/2026-27, Date: 18-06-2026

**శంకర్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయం, రంగారెడ్డి జల్లా.**

Lr.No. E1/MCS/220/2026 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు తేది: 18.06.2026

శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో "1). వర్షపు నీటి కాలువల నిర్మాణం, 2). భూగర్భ డ్రైనేజీ నిర్వహణ, నీటి సరఫరా మరియు బోర్ మోటార్ల మరమ్మతు పనులు, 3). సి.సి. రోడ్ల నిర్మాణం మరియు 4). నాలాల పూడికతీత కోసం హిటాచీ యంత్రాల అద్దె" పనుల కోసం నమోదిత కాంట్రాక్టర్ల నుండి టెండర్లు ఆహ్వానించడమైనది. ఈ టెండర్లను శంకర్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ 27-06-2026 మధ్యాహ్నం 02:00 గంటల వరకు స్వీకరిస్తారు మరియు అదే రోజు మధ్యాహ్నం 02:30 గంటలకు కమిషనర్ సమక్షంలో టెండర్లు తెరవబడతాయి. సంబంధిత కార్యక్రమాల వివరాలు కింద ఇవ్వబడ్డాయి.

టెండర్ల షెడ్యూల్ వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

1. టెండర్ పత్రం డౌన్‌లోడ్ తేదీ : 19-06-2026 మధ్యాహ్నం 02:00 గంటలకు
2. ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ల సమర్పణ : 27-06-2026 మధ్యాహ్నం 02:00 గంటలకు
3. టెండర్ల ప్రారంభం : 27-06-2026 మధ్యాహ్నం 02:30 గంటలకు

మరిన్ని వివరాల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్లాట్‌ఫారమ్ **https://tender.telangana.gov.in** ను సందర్శించండి లేదా శంకర్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయాన్ని సంప్రదించండి. సంప్రదించవలసిన నంబర్లు: 7337323577 / 7331127776.

*నోటీసు బోర్డులో ఉంచడమైనది.*

సం/- కమిషనర్
శంకర్‌పల్లి మున్సిపాలిటీ

DIPR R.O. No. : 4526-PP/CL/ADVT/2026-27, Date: 18-06-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

ఇఇ-II (56-కొంపల్లి, 59-దుండిగల్ & 60-మేడ్చల్), కుత్బుల్లాపూర్ జోన్.

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

NIT.No. 12/EE-56/QBZ/CMC/2026-27, Dt:18-06-2026 'ఇ'ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో ప్రచురించబడినది. వివరాలకు @https://tender.eprocurement.gov.inలో లాగ్‌ఇన్ అయి చూడవచ్చు. ఈవెంట్ల తేదీల పూర్తి వివరాలు క్రింది విధంగా:

| Nit No. | పని పేరు | అంచనా విలువ | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది & సమయం/ బిడ్ దాఖలుకు ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| Nit No. 12/ EE-56/QBZ/ CMC/2026-27, Dt: 18-06-2026 | కొంపల్లి సర్కిల్ కార్యాలయ నిర్వహణ మరియు తాగునీటి క్యాన్ల సరఫరా - 1 పని. జెట్టింగ్ యంత్రాల అద్దె - 1 పని. | రూ. 23.30 లక్షలు | 19-06-2026 02.00 PM to 27-06-2026 02.00 PM | ఇ.ఇ., సర్కిల్-56,59 & 60, సిఎంసి, కుత్బుల్లాపూర్. సెల్ నెం. 799548066 / 7331181426 |

సంప్రదించవలసిన అధికారి పేరు మరియు చిరునామా: శ్రీ సుబ్రమణ్య SVRNRD, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, 56-కొంపల్లి, 59-దుండిగల్ & 60-మేడ్చల్, కుత్బుల్లాపూర్ జోన్, సిఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-56, 59 & 60, QBZ, CMC.

DIPR R.O. No. : 4553-PP/CL/ADVT/2026-27, Date: 18-06-2026



## విద్యార్థుల భవిష్యత్ తరగతి గదుల నుంచే ప్రారంభం



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ : విద్యార్థుల భవిష్యత్ తరగతి గదుల నుంచే ప్రారంభమవుతుందనే విషయాన్ని గుర్తించుకోవాలని దేవునిబండ తండా సిపిఐ సర్పంచ్ ఎం.శ్రీనునాయక్ సూచించారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దేవునిబండ తండాలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎం.శ్రీనునాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అంధించడంతోపాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలను, నోట్స్ పుస్తకాలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో విద్యను నేర్చుకొని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు చిన్నతనం నుండే క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని అకాంక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గీత, ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, తండా పెద్దలు శంకర్ పాల్గొన్నారు.

## ఉన్ని పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా గడ్డం శ్రీనివాస్ ఎన్నిక



ప్రజాపక్షం/ఫరూక్‌నగర్: ఉన్ని సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గురువారం పట్టణంలోని ఉన్న పారిశ్రామిక సహకార మేనేజింగ్ కమిటి ఎన్నికలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా గడ్డం శ్రీనివాస్ (క్యాసెట్ శ్రీను), ఉపాధ్యక్షుడిగా గోవిందు యాదయ్య (నర్సప్ప గూడ), ప్రధాన కార్యదర్శిగా ఎర్ర అంజనేయులు (ఎస్‌బి పల్లి), కోశాధికారిగా క్యామ నర్సింహులు (షాద్‌నగర్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా కొంగండ్ల పద్మమ్మ (కాకునూరు), గుండ్ల సిద్దమ్మ (షాద్‌నగర్), గౌర వెంకటయ్య (వీర్లపల్లి), ఎమ్మె వెంకటయ్య (ఎస్‌బిపల్లి), ఎదిర జంగయ్య (బోదునంపల్లి)లను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి చంద్రకుమార్ ప్రకటించారు. నూతన కమిటి ఎన్నికల సందర్భంగా సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో డి.నర్సింహులు, గోవిందు, జంగిలి మల్లయ్య, గడ్డం సుధాకర్, రాజుల యాదయ్య, ఎమ్మె బాలరాజు, ఎమ్మె ధనవంతు, ఎర్ర రవి, పిప్పళ్ల జంగయ్య, ఎదిర వెంకటయ్య, టి.శ్రీనివాస్, క్యామ సురేష్, క్యామ శ్రీశైలం, గడ్డం వెంకటేష్, కేంద్యాల రాజేష్, క్యామ రమేష్, కేంద్యాల శేషుకుమార్ పాల్గొన్నారు.

## ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/కేశంపేట: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి సూచించారు. గురువారం కేశంపేట మండల కేంద్రంలో కిట్టు యాదవ్ ఏర్పాటు చేసిన అగ్రి డ్రోన్స్ సేల్స్, సర్వీస్ షాపును ప్రారంభించారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని షాపు యాజమాని కిట్టు యాదవ్ మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని వ్యవసాయం చేస్తే ఉత్పత్తులు పెరగడంతోపాటు ఆర్థికంగా రాణించేందుకు ఆస్కారం ఉంటుందని వివరించారు. రైతులకు ఉపయోగపడే ఆధునిక యంత్రాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బుర్రి స్వప్న భూపాల్‌రెడ్డి, థౌర్యానాయక్, రవీందర్‌రెడ్డి, నేతలు శివ యాదవ్, తలసాని వెంకట్‌రెడ్డి, తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, తోల ఆంజనేయులు యాదవ్, బాల్‌రాజ్ గౌడ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/కొందుర్గు: ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని, అప్పుడే మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం కొందుర్గు మండల పరిధిలోని ఉమ్మెంత్యాల గ్రామంలో మైసమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కొందుర్గు నుండి ఉమ్మెంత్యాల వరకు రూ.2.46కోట్ల వ్యయంతో నిర్మించనున్న బిటి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలందరు ఐక్యమత్యంతో ఉన్నప్పుడే గ్రామాలు అభివృద్ధి సాధించేందుకు అస్కారం ఉంటుందని వివరించారు. ఉమ్మడి కొందుర్గు మండలాన్ని అభివృద్ధి చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నానని, ఇందుకు ప్రజలందరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, సింగిల్ విండో చైర్మెన్ చిట్టెం దామోదర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, ఉమ్మెంతాల సర్పంచ్ జ్యోతి శ్రీనివాస్‌రెడ్డి, కేకే కృష్ణ, గోపాల్, లాలాపేట పర్పంచ్ నర్సింలు, మాజీ సర్పంచ్ నర్సింలు, కాంగ్రెస్ నేత కృష్ణారెడ్డి, ఆనెగళ్ల ఆనంద్, ఎస్సీసెల్ అధ్యక్షుడు నరేందర్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నేతలు పాల్గొన్నారు.

## కెబిఆర్ పార్క్ వద్ద పెంపుడు జంతువుల..
# సంరక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్ : నగరంలోని బంజారాహిల్స్ కెబిఆర్ పార్క్, గేట్ నెంబర్ 5 వద్ద పెంపుడు జంతువుల కోసం ప్రత్యేక సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు కేంద్రంలోని సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రారంభోత్సవం అనంతరం అధికారులు కేంద్రంలోని సదుపాయాలను పరిశీలించి, అక్కడికి వచ్చిన పెంపుడు జంతువుల యజమానులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కేంద్రం పెంపుడు జంతువుల యజమానులకు ఎంతో మేలు చేస్తుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఉన్నతాధికారులు మాట్లాడుతూ పెంపుడు జంతువుల సంక్షేమం, యజమానులకు కల్పించాల్సిన సౌకర్యాల గురించి వివరించారు. నగరంలో పెంపుడు జంతువులను పెంచుకునే వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, వాటికి అవసరమైన సంరక్షణ, ఆరోగ్య సేవలను అందించే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని తెలిపారు. నగరంలో పెంపుడు జంతువుల సంరక్షణకు అవసరమైన సేవలను మరింత విస్తరించేందుకు జీహెచ్‌ఎంసీ కృషి చేస్తోందన్నారు.



ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ బి. సంతోష్, ప్రధాన పశువైద్య అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వీరితో పాటు కేంద్ర యాజమాన్య ప్రతినిధులు, నగరంలోని పెంపుడు జంతువుల యజమానులు, పెద్ద సంఖ్యలో స్థానికులు హాజరయ్యారు.

## హెచ్-సిటీ ప్రాజెక్టులకు..
# వేగవంతంగా భూసేకరణ

సిఎంసి కమిషనర్ డాక్టర్ జి.సృజన



ప్రజాపక్షం/హైదరాబాద్ : హెచ్‌సిటీ ప్రాజెక్టు పనులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ డాక్టర్ జి.సృజన టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. కొండాపూర్ అంజయ్యనగర్‌లో చేపట్టనున్న హెచ్‌సిటీ ప్రాజెక్టు పనుల పురోగతిని గురువారం స్థానిక ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీతో కలిసి కమిషనర్ పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లు, భూసేకరణ ప్రక్రియపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు పురోగతిపై అధికారులు కమిషనర్‌కు వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అమలుకు అవసరమైన భూసేకరణ పురోగతిని తెలుసుకున్న కమిషనర్, రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన ప్రారంభించేందుకు భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ప్రతిపాదిత రోడ్డు విస్తరణ పూర్తయితే కొండాపూర్ మెయిన్ రోడ్డుపై ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు వాహనదారులకు మెరుగైన రాకపోకల సౌకర్యం కలుగుతుందన్నారు. ప్రాజెక్టు అమలులో అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, నిర్ణీత గడువులో పనులు పూర్తి అయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ బి. వెంకన్న, అదనపు సిటీ ప్లానర్ శైలజ, సిటీప్లానర్ తులసీరామ్, ఎసిపి గౌతమి, డిప్యూటీ కమిషనర్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## 'తెలంగాణ మాల ఉద్యమకారుల సమన్వయ కమిటీ' ఏర్పాటు!

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న మాలల వివరాలను సేకరించి ప్రభుత్వానికి సమర్పించాలని మాలమహానాడు నిర్ణయించింది. 'మాలమహానాడు'రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అధ్యక్షతన హైదరాబాద్‌లో 'మాల ఉద్యమకారుల' సమావేశం గురువారం జరిగింది. మాల ఉద్యమకారులతో హైదరాబాద్ లో సభ ఏర్పాటు చేయాలని సమావేశం తీర్మానించింది.అలాగే మాల తెలంగాణ ఉద్యమకారుల కో ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కో ఆర్డినేషన్ కమిటీ ఉమ్మడి జిల్లాల వారీగా మాల ఉద్యమకారుల సమన్వయ కమిటీని ఏర్పాటు చేయనుంది. కమిటీకి పిల్లి సుధాకర్ సమన్వయకర్త వ్యవహరించగా, కమిటీ సభ్యులు గాభైరి రమేష్, దార సత్యం,నల్లాల కనకరాజు,గోలి సైదులు,అసాది పురుషోత్తం,సలహాదారుగా గొల్లపల్లి నాగరాజు, తొగరు సుధాకర్ ఎన్నికయ్యారు.



## ఎన్‌టియుసిలోకి జిహెచ్‌ఎంసి రవాణా విభాగం కార్మికులు

ఆదిల్ షరీఫ్ ఆధ్వర్యంలో మజ్దూర్ యూనియన్‌లో 300 మంది మున్సిపల్ సిబ్బంది చేరిక



ప్రజాపక్షం/హైదరాబాద్ : జిహెచ్‌ఎంసి రవాణా విభాగానికి చెందిన ఖైరతాబాద్, గోల్కొండ జోన్‌ల పరిధిలోని సుమారు 300 మంది ఉద్యోగులు, కార్మికులు మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ (ఎంఎస్‌ఎంయుఐఎన్‌టియుసి)లో చేరారు. తెలంగాణ రాష్ట్ర ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరు యూనియన్ సభ్యత్వం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన జలమండలి యూనియన్ ఎన్నికల్లో ఐఎన్‌టియుసి ఘన విజయం సాధించిందని గుర్తు చేశారు. అదే ఉత్సాహంతో రాబోయే జిహెచ్‌ఎంసి యూనియన్ ఎన్నికల్లోనూ ఐఎన్‌టియుసి భారీ మెజార్టీతో గెలుపొందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రవాణా విభాగం కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఈ సందర్భంగా ప్రస్తావించిన ఆదిల్ షరీఫ్, ఎఫ్‌ఆర్‌ఎస్ అటెండెన్స్ విధానంలో సాంకేతిక లోపాల కారణంగా విధులకు హాజరైనప్పటికీ పలువురికి గైర్హాజరు నమోదవుతోందని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే కార్మికులు కొద్ది పాటి ఆలస్యంతో వచ్చినా హాజరు, వేతనం కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా వేతనాల చెల్లింపులు ఆలస్యమవుతున్నాయని, చెత్త తరలించే వాహనాలు చెడిపోతే సకాలంలో మరమ్మతులు చేపట్టడం లేదని విమర్శించారు. దీంతో డ్రైవర్లు, కార్మికులు సొంత ఖర్చులతో వాహనాలను నిర్వహించాల్సి వస్తోందన్నారు. మరోవైపు మరమ్మతుల బిల్లులు క్రమం తప్పకుండా క్లెయిమ్ అవుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పనులు జరగడం లేదని ఆరోపించారు. వాహనాల డీజిల్ కూపన్‌ల జారీలోనూ అక్రమాలు జరుగుతున్నాయని, నాలుగు ట్రిప్పులకు కూపన్‌లు జారీ చేస్తూ కేవలం రెండు ట్రిప్పులకే పరిమితం చేస్తున్నారని మండిపడ్డారు. విధి నిర్వహణలో మరణించిన, వృద్ధాప్యం లేదా అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జిహెచ్‌ఎంసి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి ఏ.వి.ఎస్. గాంధీ, కార్యదర్శి జి.శివకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.ఎస్.ఉమేష్ బాబు, నాయకులు శివశంకర్, యూనుస్, శ్రీశైలం, జ్ఞానేశ్వర్, ఇస్మాయిల్, కృష్ణ, మహ్మద్ గౌస్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం..

99 రోజుల్లో 560 మంది అరెస్ట్



ప్రజాపక్షం /హైదరాబాద్: తెలంగాణలో మాదక ద్రవ్యాలు, గుడుంబా, నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో ఎక్సైజ్ శాఖ విస్తృత స్థాయిలో దాడులు, తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. రాష్ట్రంలో డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యవేక్షణలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రావు, ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అవినాశ్ మహంతి ఆధ్వర్యంలో కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేశారు.

ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్, జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందాలు, ఎక్సైజ్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది 99 రోజుల పాటు ప్రత్యేక దాడులు నిర్వహించారు. టిజి న్యాబ్, ఈగల్ ఫోర్స్, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌తో కలిసి డ్రగ్స్ సరఫరా, తయారీ కేంద్రాలు, కెమికల్ కంపెనీలు, మెడికల్ హాల్స్, హోల్‌సేల్ ఔషధ సంస్థలపై సంయుక్త తనిఖీలు చేపట్టి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేశారు.కల్తీ కల్లు తయారీకి వినియోగించే ఆల్ప్రాజోలామ్ తదితర పదార్థాలపై దాడులు నిర్వహించడంతో పాటు కల్తీ కల్లు నమూనాలు సేకరించారు. లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న కల్లు దుకాణాలపై చర్యలు తీసుకున్నారు. నాటుసారా తయారీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించిన ఎక్సైజ్ శాఖ హాట్ స్పాట్ ప్రాంతాల్లో బట్టీలను ధ్వంసం చేసి, బెల్లం, అలం వంటి ముడిసరుకును స్వాధీనం చేసుకుంది. ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, డివిజన్ స్థాయిల్లో 712 అవగాహన సదస్సులు నిర్వహించగా, డ్రగ్స్ వ్యతిరేకంగా ప్రత్యేకంగా 325 చైతన్య కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రజాప్రతినిధుల సహకారంతో యువతకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు.మత్తు పదార్థాలకు బానిసలైన వారికి చికిత్స అందించేందుకు జీఓఎంఎస్4 ప్రకారం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రుల్లో అడిక్షన్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఎన్‌డిపిఎస్ చట్టం కింద 99 రోజుల్లో 321 కేసులు నమోదు చేసి 560 మందిని అరెస్ట్ చేశారు. 1,294 కిలోల గంజాయితో పాటు ఓజీ కుష్, హాషీష్ ఆయిల్, చరాస్, కోకైన్, హెరాయిన్, ఎండీఎంఏ, ఎల్‌ఎస్‌డీ డ్రగ్స్, నిషేధిత కోడిన్ దగ్గు మందులు, ఆల్ప్రాజోలామ్ వంటి మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. 138 వాహనాలను సీజ్ చేయగా, గుడుంబాపై చేపట్టిన ప్రత్యేక చర్యల్లో 4,809 కేసులు నమోదు చేసి 3,924 మందిని అరెస్ట్ చేశారు. 20,041 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోగా, 3,12,850 లీటర్ల పులియబెట్టిన ముడిసారా మిశ్రమాన్ని ధ్వంసం చేశారు. నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం అక్రమ రవాణాకు సంబంధించి 446 కేసులు, అక్రమ మద్యం విక్రయాలపై 862 కేసులు నమోదు చేశారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా డ్రగ్స్, గుడుంబా, అక్రమ మద్యం నిర్మూలనకు ఎక్సైజ్ శాఖ అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించి సమగ్ర చర్యలు చేపట్టిందని అధికారులు తెలిపారు.

## అంబుడ్స్‌మెన్ ఉత్తర్వులు
# తప్పనిసరి అమలు చేయాల్సిందే

ప్రజాపక్షం/హైదరాబాద్: అనుబంధ క్రికెట్ సంఘాలకు ప్రతి ఏడాది రూ.3 లక్షల చొప్పున నిధులు విడుదల చేయాలంటూ అంబుడ్స్‌మెన్ ఇచ్చిన ఆదేశాలను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తప్పనిసరిగా అమలు చేయాలని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. 2017–18 నుంచి 2025–26 వరకు మొత్తం తొమ్మిదేళ్లకు సంబంధించిన రూ.27 లక్షలను ఎనిమిది వారాల్లో మహమూద్ క్రికెట్ క్లబ్‌కు చెల్లించాలని ఆదేశించింది. అంబుడ్స్‌మెన్ ఉత్తర్వులను హెచ్‌సీఏ అమలు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ మహమూద్ క్రికెట్ క్లబ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ జరిపారు. అంబుడ్స్‌మెన్ నిర్ణయాలకు హెచ్‌సీఏ కట్టుబడి ఉండాల్సిందేనని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఒక ప్రైవేటు వాణిజ్య సంస్థకు రూ.68 కోట్ల నిధులు కేటాయించే స్థోమత ఉన్న హెచ్‌సీఏ, అనుబంధ క్లబ్‌లకు సంవత్సరానికి కేవలం రూ.3 లక్షలు చెల్లించకుండా ఉండటం ఎలా సమంజసమవుతుందని ప్రశ్నించారు. అంబుడ్స్‌మెన్ ఉత్తర్వుల ప్రకారం పెండింగ్ నిధులను విడుదల చేయాలని ఆదేశిస్తూ పిటిషన్‌ను ముగించారు.

## రూ.వెయ్యి కోట్ల విలువ చేసే
# ధాన్యం దోపిడీకి పాల్పడ్డ రైస్‌మిల్లర్లు

బిఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: రైస్‌మిల్లర్లు వెయ్యి కోట్ల రూపాయల విలువ చేసే ధాన్యం దోపిడీకి పాల్పడ్డారని, దీనిపైన ప్రభుత్వం విచారణకు ఆదేశించాలని బిఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ధర్మకాంట తూకాన్ని పరిగణనలోకి తీసుకుంటే వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జీవన్ రెడ్డి మాట్లాడుతూ ఏడు రకాలను మాత్రమే సాగు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటిస్తుందని, దిగుబడి లేని పంటలను సాగు చేయాలనడం సరికాదని, ధాన్యం సేకరణ బాధ్యతను తప్పించుకునేందుకు ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. రబీ సీజన్ బోనస్ విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోయిందని, కనీసం ఖరీఫ్ సీజన్ లోనైనా రైతు భరోసా రూ.15వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు ఏ రకమైన సాగు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసాను రైతులకు ఇవ్వాలని జీవన్‌రెడ్డి కోరారు.

## బ్యాంక్ ఖాతా నుంచి
# రూ.1.89లక్షల మాయం

పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు



ప్రజాపక్షం/కొత్తూరు : బ్యాంక్ ఖాతాదారుడి అనుమతి లేకుండానే మోసపూరితంగా ఏకంగా ఒక లక్ష ఎనభై తొమ్మిది వేల రెండు వందల రూపాయలు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు బాధితుడు రమేష్ కివేట్ తెలిపారు. గురువారం కొత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తూరు మండల పరిధిలోని పిట్టిలామినేషన్ పరిశ్రమలో కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న రమేష్ కివేట్ బ్యాంక్ ఖాతా నుండి గుర్తు తెలియని వ్యక్తులు వివిధ దశల్లో మొత్తం రూ.1.89లక్షల 200నగదు చోరీకి గురైనట్లు తెలిపారు. బాధితుడు జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా పేర్కొన్నారు. బాధితుడి ఎస్‌బిఐ బ్యాంక్ ఖాతా నుండి సైబర్ నేరగాళ్ళే ఈ పని చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తూరు పోలీసులు తెలిపారు.

# సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి



ప్రజాపక్షం/కేశంపేట: సైబర్ నేరాల పట్ల ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించేందుకు పోలీసులు కృషి చేయాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి వివరించారు. గురువారం కేశంపేట పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ల పనితీరుపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తరుణ్ జోషి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలతోపాటు పోలీస్ స్టేషన్ల సమగ్ర పనితీరును సమీక్షించినట్లు తెలిపారు. స్టేషన్‌లో రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తులు, ప్రజా వినతుల పరిష్కారం, నేర గణాంకాలు, శాఖ పరమైన కార్యక్రమాల అమలును పరిశీలిస్తున్నట్లు వివరించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది వృత్తి పరమైన, పారదర్శకమైన, బాధ్యతాయుతమైన ప్రజామిత్ర పోలిసింగ్‌ను అమలు చేయాలని అదేశించారు. ప్రజల ఫిర్యాదులకు తక్షణమే స్పంధించడంతోపాటు క్రిమినల్ కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఆకాంక్షించారు. బీట్ పోలీసింగ్‌ను బలోపేతం చేసి ప్రజలతో నిరంతరం సంబందాలు కొనసాగించే విధంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. గ్రామ పోలీస్ అధికారులు, విపిఓలు గ్రామాల్లో సమాచార సేకరణను చురుకుగా చేపట్టి అనుమానాస్పద కదలికలు, కార్యకలాపాలను తక్షణమే నివేధించాలని ఆదేశించారు. గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలతో సమన్వయం కొనసాగిస్తూ సమస్యలను ప్రారంభదశలోనే గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరస్తులు, రౌడీషీటర్లు, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా ఏర్పాటు, సమర్థవంతమైన పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ కార్యకలాపాలు, సైబర్‌నేరాలు, జూదంపై ప్రత్యేక నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్‌అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ డిసిపి శిరీష, ఏసిపి లక్ష్మీ నారాయణ, కేశంపేట సిఐ నరహరి, సిబ్బంది ఉన్నారు.

## సొంతింటి కలను నెరవేర్చుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** పేదల సొంతింటి కలను నెరవేర్చుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరు అండగా ఉండాలని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. గురువారం అలియాబాద్ మున్సిపాలిటిలోని మజీద్ పూర్‌లో సంగీత రవిగౌడ్‌లకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వార అనేక కుటుంబాలు సొంత ఇంటి కలను నెరవేర్చుకుంటున్నాయని చెప్పారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, కౌన్సిలర్లు సరసం వనజ అశోక్‌రెడ్డి, సామల జశ్వంత్‌రెడ్డి, ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, మాజీ సర్పంచ్‌లు, మున్సిపల్ బిసి సెల్ అధ్యక్షులు నర్సింగరావుగౌడ్, అబ్బగౌని సురేష్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, శ్రీశైలంగౌడ్, శ్యామ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్‌లు మంజూరు చేయించాలి

### ఎంపి ఈటలను కోరిన మాజీ కార్పొరేటర్ క్యాసం రాజ్యలక్ష్మి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** డబుల్ బెడ్ రూంల కోసం ధరఖాస్తు చేసుకొన్న వినాయక్‌నగర్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన వారికి మంజూరు చేయించాలంటూ స్థానిక మాజీ కార్పొరేటర్ క్యాసం రాజ్యలక్ష్మి కోరారు. ఈ మేరకు ఆమె గురువారం మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్‌ను కల్సి దరఖాస్తుదారుల వివరాలను అందచేసారు. చాలీచాలని జీతా లు, రోజువారీ కూలీనాలీ డబ్బులతో పోషించుకొంటున్న కుటుంబీకుల సొంత ఇంటి కలను నెరవేర్చాలని కోరగా తన వంతుగా సహకరిస్తానని ఈటల హామీ ఇచ్చారు.

## ఉపాధ్యాయులకు ఎఐ శిక్షణ షురూ

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను ఇంగ్లీష్ బోధనలో సమర్థవంతంగా వినియోగించడంతో పాటు పరిశోధనా రంగంలో నాణ్యమైన థీసిన్ రచనకు అవసరమైన నైపుణ్యాలపై అధ్యాపకులకు అవగాహన కల్పించేందుకు అనురాగ్ యూనివర్సిటీలో ఐదు రోజుల ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమం ప్రారంభిమైంది.వెంకటాపూర్‌లో నిర్వహిస్తున్న ఈ శిక్షణా కార్యక్రమానికి తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ మాజీ ఆచార్యులు డాక్టర్ కేవీ రఘుపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన ఏఐ ఆధారిత ఇంగ్లీష్ తరగతి గదుల నిర్వహణ ఆధునిక బోధనా పద్ధతులు పరిశోధనా రంగంలో థీసిన్ రచనకు అనుసరించాల్సిన ప్రమాణాలపై అధ్యాపకులకు విలువైన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ జి,వీఎస్ అనంతలక్ష్మి, ప్రవేశాల సంచాలకులు డాక్టర్ మహిపతి శ్రీనివాస్,విశ్వవిద్యాలయ అధ్యాపకులు ఇతర విద్యాసంస్థల అధ్యాపకులు పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.శిక్షణా కార్యక్రమం ద్వారా అధ్యాపకుల్లో సాంకేతిక నైపుణ్యాలు పెంపొందడంతో పాటు బోధన పరిశోధన రంగాల్లో నూతన మార్పులకు దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.



## పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వం : కౌన్సిలర్ శ్రీవాణి వైద్యనాథ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తుందని ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కౌన్సిలర్ కటికెల శ్రీవాణి వైద్యనాథ్ అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపాలిటి లక్ష్మాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు 3వ వార్డు కౌన్సిలర్ శ్రీవాణి వైద్యనాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం సిఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం ప్రతి ఒక్కరు ముందుకు రావాలని సూచించారు. కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతుందని చెప్పారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు సాధిస్తున్న ప్రగతిని చూసి ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ హెచ్‌ఎం శారద, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కటికెల గోపి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

### ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన పామేనా భీమ్ భరత్



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలోని ఆర్కాతల గ్రామంలో గురువారం మద్దికుంట నవనీత విట్టల్ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేనా భీమ్ భరత్ ప్రారంభించారు. గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన ఆయన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పామేనా భీమ్ భరత్ మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయడంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ప్రతి కుటుంబం సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించేందుకు సొంత ఇల్లు ఎంతో అవసరమని పేర్కొన్నారు. మద్దికుంట నవనీత విట్టల్ కుటుంబ సభ్యులు తమ ఇంటి ప్రారంభోత్సవానికి హాజరైన పామేనా భీమ్ భరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలు కూడా ఆయనకు స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సామ వెంకట్ రెడ్డి, మాజీ అధ్యక్షులు మేడిపల్లి వెంకటయ్య, బి బ్లాక్ అధ్యక్షులు పోలీస్ మధుసూదన్ రెడ్డి, నాయకులు తలారి శేఖర్, గంజాయి రాములు,మద్దికుంట రాములు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చెరువు పునరుద్ధరణకు శ్రీకారం

### పనులు ప్రారంభించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉప్పల్ నియోజకవర్గంలోని రామాంతాపూర్ పెద్ద చెరువు పునరుద్ధరణ పనులను హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ గురువారం ప్రారంభించారు. సాంప్రదాయబద్ధంగా శంకుస్థాపన నిర్వహించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సకల జీవకోటికీ ప్రాణాధారమైన జలవనరుల రక్షణకు పెద్దపీట వేస్తున్న హైడ్రా, ఇప్పటికే మొదటి విడతలో 6 చెరువుల పునరుద్ధరణను విజయవంతంగా పూర్తి చేసింది. రెండో విడతలో భాగంగా మరో 14 చెరువులను అభివృద్ధి చేయనుండగా, అందులో రామాంతాపూర్ చెరువు పనులు ప్రారంభించారు.

రామాంతాపూర్ పెద్ద చెరువు ఎఫ్‌టిఎల్ విస్తీర్ణం మొత్తం 30 ఎకరాలు కాగా, ఇందులో సుమారు 16 ఎకరాల వరకు కబ్జాకు గురైంది. 12 ఎకరాల్లో ఇప్పటికే శాశ్వత భవనాలు వెలిశాయి, వీటి జోలికి ప్రస్తుతానికి హైడ్రా వెళ్లలేదు. మిగిలిన 4 ఎకరాల మేర ఉన్న తాత్కాలిక షెడ్లను, గుడిసెల ను ఖాళీ చేయించడం ద్వారా మొత్తం 18 ఎకరాలకు పైగా భూమిని హైడ్రా చెరువు పునరుద్ధరణ కోసం అందుబాటులోకి తెచ్చింది. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం దాదాపు రూ.19 కోట్ల వరకు వ్యయం చేయనుంది. ఈ చెరువు పూర్తి స్థాయిలో పునరుద్ధరణకు అయితే పరిసర ప్రాంతాల్లో వరదల ముప్పు శాశ్వతంగా తప్పుతుంది. భూగర్భ జల మట్టం పెరగడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ఈ చెరువు కీలక పాత్ర పోషించనుంది.

**మానవత్వంతో హైడ్రా అడుగు..**
**గుడిసెవాసులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు**

ప్రతి ఏటా వర్షాకాలంలో చెరువు నిండి గుడిసెలు మునిగిపోవడంతో, అక్కడ నివసించే పేద కూలీలు, చెత్త సేకరించేవారు తీవ్ర అవస్థలు పడేవారు. వీరి కష్టాలను గుర్తించిన హైడ్రా, మానవీయ కోణంలో స్పందించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లింది. బాధితులతో నేరుగా మాట్లాడి, వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది.

ప్రభుత్వ నిర్ణయానికి సంతోషించిన సుమారు 36 కుటుంబాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చెరువు విస్తరణకు సహకరించారని, వీరందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా హైడ్రా చర్యలు తీసుకుందని కమిషనర్ రంగనాథ్ చెప్పారు. చెరువులను పరిరక్షించడం అంటే కేవలం నీటి వనరులను కాపాడటం మాత్రమే కాదని, నగర భవిష్యత్తును కూడా సురక్షితం చేయడమన్నారు.



## సహకార సంఘాన్ని సందర్శించిన టిఎస్‌పిఎస్‌సి రిజిస్ట్రార్లు

### అవగాహన కల్పిస్తున్న డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా శామీర్‌పేటలోని వ్యవసాయ సహకార సంఘాన్ని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వార సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్లుగా ఎంపికైన శిక్షణార్థులు రాజేంద్రనగర్‌లోని శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా సుమారు 50 మంది శామీర్‌పేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని గురువారం సందర్శించా రు. ఈ సందర్భంగా సహకార సంఘం కార్యకలాపాలను డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి వివరించారు. రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ఎరువుల సరఫరా, నాణ్యమైన విత్తనాల పంపిణీ, రైతులకు అనుగుణంగా అందిస్తు న్న వివిధ సేవలను శిక్షకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ సహకార శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ ప్రసాద్, వైస్ చైర్మన్ ఐలయ్య, డైరక్టర్లు నర్సింలు, బిక్షపతి, సంఘం కార్యదర్శి రవిందర్, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా బిజ్జ ఆనంద్‌రాజ్‌గౌడ్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్ పెద్ద చర్లపల్లికి చెందిన బిజ్జ ఆనంద్ రాజ్‌గౌడ్‌ను మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా జిల్లా కాంగ్రెస్ నియమించింది.పార్టీలో ఏ పదవి ఉన్న లేకున్నా అధికారం,ఓటములతో సంబంధం లేకుండా కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండి 45 ఏళ్లు పార్టీకి పని చేస్తున్న ఆయనకు గుర్తింపునిచ్చింది.తనకు ఇచ్చిన కార్యదర్శి పదవి న్యాయం చేస్తానని ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి,జిల్లా పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్,పరమేశ్వర్ రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



## మద్యం నిల్వ చేస్తున్న స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** విదేశీ మద్యం, గోవా నుండి అనుమతులు లేకుండా తీసుకొని వచ్చి అక్రమంగా నిల్వ చేస్తున్న స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొన్నారు. డిటిఎఫ్ మల్కాజిగిరి, ఎస్‌హెచ్‌ఓ కాప్రాకు చెందిన వేర్వేరు బృందాలు సంయుక్తంగా ఈ దాడుల్లో పాల్గొన్నారు. జవహర్‌నగర్ సమీపంలోని వెంకటేశ్వర కాలనీలో అక్రమంగా నిల్వ చేసిన రెడ్డిశెట్టి మహేష్‌ను అదుపులోకి తీసుకొని అతడి నుండి 51.55 లీటర్ల వివిధ సైజులతో ఉన్న 59 సీసాల అన్‌పెయిడ్ గోవా, విదేశీ మద్యం స్వాధీనం చేసుకొన్నారు. బాలాజినగర్‌లోని మోహనరావు కాలనీలో రెడ్డిశెట్టి శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని అతడి నుండి 75.75 లీటర్ల వివిధ సైజులతో ఉన్న 112 సీసాల అన్‌పెయిడ్ గోవా, విదేశీ మద్యంతో పాటు 129.66 లీటర్ల డ్యూటీ పెయిడ్ విస్కీ సీసాలను స్వాధీనం చేసుకొన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి పన్నులు ఎగవేస్తూ అక్రమంగా మద్యం విక్రయించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకొంటామని ఈ సందర్భంగా ఎక్సైజ్ పోలీసులు హెచ్చరించారు.

## బిఎల్‌ఒలు, బిఎల్‌ఎలకు అవగాహన కార్యక్రమం





**ప్రజాపక్షం/నవాబుపేట్:** నవాబుపేట్ మండల కేంద్రం లోని రైతు వేదికలో గురువారం డిప్యూటీ ఎమ్మార్వో నవీన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బూత్ లెవల్ అధికారులు (బిఎల్‌ఒలు), బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్‌ఎలు) అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ ఎమ్మార్వో నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో బిఎల్‌ఒలు, బిఎల్‌ఎలు కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. ఓటరు జాబితాల రూపకల్పన, సవరణలు, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాల తొలగింపు వంటి అంశా ల్లో నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ఓటరు జాబితా స్వచ్ఛత, పారదర్శకత కోసం ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ప్రజలకు ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మండలంలోని బిఎల్‌ఒలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బిఎల్‌ఎలు, రెవెన్యూ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బలహీన వర్గాలకు ఇందిరమ్మ ఇళ్లు ఓ వరం

### మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహయాదవ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** బడుగు బలహీన వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ పథకం ప్రవేశపెట్టిందని, ఈ పథకం పేదలకు వరంగా మారిందని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపాలిటి కొల్తూర్‌లో కొండ భాగ్య రాజులకు మంజూరైన నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఎంసి చైర్మన్ నర్సింహాయాదవ్ మాట్లాడుతూ తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి నిరుపేదల కొరకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ సహకారంతో మేడ్చల్‌కు మరిన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అనంతరెడ్డి, జైపాల్‌రెడ్డి, నల్ల యాదగిరి, నర్సింలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాండరి, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు



## బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపల్ కొల్తూర్‌కు ఆర్టిసి బస్సు సౌకర్యం కల్పించాలని ఎఎంసి మాజి వైస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి గురువారం హకింపేట డిపో మేనెజర్ సరితకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్తూర్ గ్రామం నుంచి ఉదయం వేళల్లో నగరానికి వెళ్లడానికి సరైన బస్సు సౌకర్యం లేదని అన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు బస్ సర్వీస్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. హకింపేట డిపో మేనెజర్ సానుకూలంగా స్పందించారని త్వరలోనే గ్రామానికి ఆర్‌టిసి బస్సు మంజూరు చేస్తారని ఆశాబావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దత్తుగౌడ్, గిరిపల్లి రమేష్, తదితరులు ఉన్నారు.

## పాఠశాలలో నోట్‌బుక్స్ పంపిణీ చేసిన సర్పంచ్



**ప్రజాపక్షం/నవాబుపేట:** వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలోని ఎల్లకొండ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కొండల్ యాదవ్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేసి విద్యపట్ల తన నిబద్ధతను చాటుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొండల్ యాదవ్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలంటే విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు అవసరమైన సహాయ సహ కారాలు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకుని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలను గుర్తించి నోట్‌బుక్స్ పంపిణీ చేసిన సర్పంచ్ కొండల్ యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నోట్‌బుక్స్ అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ సర్పంచ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాంచంద్రయ్య, పాఠశాల ఉపాధ్యాయు లు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.



## ముమ్మర కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

### భారీగా వాహనాలు, మద్యం సీజ్

**ప్రజాపక్షం/పరిగి:** ఎస్‌పి స్నేహమెహ్రా ఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పరిగి డివిజన్ పరిధిలో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా నేడు తెల్లవారుజామున 5గంటల నుండి పరిగి మండలం మల్లేమోనిగూడ గ్రామంలో పరిగి డిఎస్‌పి శ్రీనివాస్ ప్రత్యక్ష పర్యవేక్షణలో భారీ కమ్యూనిటీ కాంటాక్ట్ ఆపరేషన్ నిర్వహించారు. దాదాపు 160మంది అన్నిరకాల ర్యాంకుల పోలీసు అధికారులు బలగంతో ఈ తనిఖీలు ముమ్మరంగా సాగాయి. గ్రామంలోని ప్రతి ఇంటిని, అనుమానాస్పద ప్రాంతాలను క్షుణ్ణంగా సోదా చేశారు. ఈ విస్తృత తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేని 45 ద్విచక్ర వాహనాలు, 3ఆటోలు, ఒక కారుతోపాటు, నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన 39లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించిన 31చల్లాన్లు నమోదు చేసి రూ.12,245 జరిమానా విధించారు. అనుమమానాస్పదంగా ఉన్నటువంటి వ్యక్తుల పాస్ లాన్‌డివైస్ ద్వారా తనిఖీలు చేయడం జరిగింది. గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, శాంతిభద్రతలకు విఘతం కలగకుండా ఉండేందుకు ఈ ముందస్తు తనఖీలు చేపట్టినట్లు డిఎస్‌పి తెలిపారు. కేవలం తనిఖీలకే పరిమితం కాకుండా ఈ సందర్భంగా పోలీస్ అధికారులు గ్రామ ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమై వివిధ సామాజిక అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. నేరాల నయంత్రణలతో సీసీటివీ కేమెరాల ప్రాధాన్యతను వివరిస్తూ ప్రతి ఒక్కరు తమ పరిసరాలలో కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత కాలంలో యువతను పట్టి పీడిస్తున్న సైబర్ నేరాలు, డ్రగ్స్ మహమ్మారి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బాల్యవివహాల, నిర్మాలన , పోక్సో చట్టం, మహిళల భద్రత, ఆస్తిపాస్తుల రక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన రహదారి భద్రత నియమాలపై ప్రజలకు, యువతకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పరిగిసిఐ, కొడంగల్ సిఐ, శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## డంపింగ్ యార్డు తనిఖీ చేసిన జెడ్‌సి, డిసి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** డంపింగ్ చేసిన చెత్తను కాల్చితే కఠిన చర్యలు తప్పవని జోనల్ కమిషనర్ రాధిక గుప్తా అన్నారు. గురువారం నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి చర్లపల్లి రోడ్డులో డంపింగ్ వేసిన చెత్తను కాల్చడం పై తనకు వచ్చిన ఫిర్యాదుతో స్పందించిన జెడ్‌సి ఘట్కేసర్ డిప్యూటీ కమిషనర్ వాణి తనిఖీ నిర్వహించారు. డంపింగ్ చేసిన చెత్తను వెంటనే తొలగించాలని ఆదేశించారు. బహిరంగ ప్రాంతాలతో వేసిన చెత్తను వేయడం, కాల్చడం జరగకుండా చూడాలని సిబ్బంది, అధికారులకు సూచించారు. డంపింగ్ యార్డు చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట డివిజన్ దేవరయాంజాల్ జిల్లా పరిషత్ పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు దాతల సహకారంతో నోట్ పుస్తకాలను గురువారం జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలేష్ లు పంపిణీ చేశారు. అనంతరం జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ నోట్ పుస్తకాల దాత నాగిరెడ్డి వెంకటరంగారెడ్డి గత 15 సంవత్సరాలుగా నిరంతరంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నారని, విద్యకు ప్రాధాన్యమిస్తు విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు కష్టపడి దాతలు అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దాత నాగిరెడ్డి వెంకటరంగారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డైమండ్ షేక్ కుటుంబాన్ని ఆదుకుంటాం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఆత్మహత్యకు పాల్పడిన బిఆర్‌ఎస్ నేత డైమండ్ షేక్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకొంటామని ఎంబిసి కార్పొరేషన్ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ హామీ ఇచ్చారు. గురువారం పార్టీ సీనియర్ నేత మేకల రాము యాదవ్‌తో కల్సి ఆయన షేక్ ఇంటికి వెళ్లి సంయుక్తంగా రూ. 30 వేల ఆర్థిక సాయాన్ని అందచేసారు. అదే విధంగా అతడి కుమార్తె విద్యకు అయ్యే ఖర్చు పూర్తిగా భరిస్తానని హామీ ఇచ్రాఉ. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు బైరు అనిల్, సూర్యప్రకాష్, ఎస్వీఆర్ వెంకట్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.



## వనమహోత్సవంలో కలెక్టర్ దీపక్, ఎస్‌పి స్నేహమెహ్రా

**ప్రజాపక్షం /వికారాబాద్:** వనమహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి, జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా, గురువారం అనంతగిరి రిజర్వు ఫారెస్టు ఏరియాలో పర్యావరణ పరిరక్షణ, హరితాభివృద్ధే లక్ష్యంగా నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎస్‌పి, మున్సిపల్ చైర్‌పర్సన్ అనన్య, అదనపు కలెక్టర్ వెంకటచారి, ట్రైనింగ్ కలెక్టర్ సచిన్ బస్వరాజ్‌లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని పెంచి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలమని అన్నారు. జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ, పచ్చదనం పెంపొందించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అవలంబించవచ్చన్నారు. ప్రతి పౌరుడు కనీసం ఒక మొక్కను నాటి దానికి సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily

హైదరాబాద్
శుక్రవారం
19-06-2026
www.prajapaksham.in

మహానగరి
GREATER HYDERABAD

## సచివాలయం వద్ద ఉద్రిక్తత

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం బిసి సంఘాల ఆధ్వర్యంలో సచివాలయం ముట్టడి జరిగింది. బిసి సంఘాల నేతలు నాలుగు దఫాలుగా సచివాలయం ముట్టడికి యత్నించారు. ముట్టడిని అడ్డుకున్న పోలీసులు బిసి సంఘాల నేతలను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. పాత పద్ధతిలోనే ఫీజు రియంబర్స్‌మెంట్ అమలు చేయాలని, ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేయాలని కుట్ర చేస్తుందని ఈ సందర్భంగా నిరసనకారులు ఆరోపించారు. గత నాలుగు ఏండ్లుగా ఫీజుల బకాయిలు ఇవ్వకుండా ప్రభుత్వం బిసి విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తుందని మండిపడ్డారు. తక్షణమే ఫీజుల బకాయిలు విడుదల చేయకపోతే సిఎం, మంత్రుల పర్యటనలను అడ్డుకుంటామని హెచ్చరించారు. సచివాలయం ముట్టడిలో బిసి సంఘాల నేతలు కుల్కచర్ల శ్రీనివాస్, విక్రమ్ గౌడ్, కనకల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/నల్లకుంట:** పేదింటి యువతుల వివాహం కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంలో భాగంగా అంబర్‌పేట్ మండలానికి సంబంధించిన 298 మంది లబ్ధిదారులకు గురువారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చెక్కులను పంపిణీ చేశారు. అలీ కేఫ్ చౌరస్తాలోని ఎస్ఆర్‌జి ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపి, ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంతరావు,అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ముఖ్యఅతిథులుగా పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌లు ఇ.విజయ్‌కుమార్‌గౌడ్, పద్మ, దిడ్డి రాంబాబు, ఎమ్మార్వో అన్వర్ హుస్సేన్, డిప్యూటీ తహసీల్దార్ బల్‌రామ్, డిసిసి అధ్యక్షుడు మోత రోహిత్ ముదిరాజ్, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** బాగ్ అంబర్‌పేట్ వెల్ఫేర్ సొసైటీకి కాలనీలోని 900 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారికంగా కేటాయించింది. ప్రభుత్వ సలహాదారుడు వి.హనుమంతరావు జిహెచ్ఎంసి అధికారులతో కలిసి గురువారం ఈ స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థలం చుట్టూ ఏర్పాటు చేస్తున్న ఫెన్సింగ్ పనులకు విహెచ్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో డిసి మారుతి దివాకర్, మాజీ కార్పొరేటర్ నారాయణస్వామి, కాలనీ ప్రతినిధులు వి.లక్ష్మీపతి, పంజాల గిరిధర్‌గౌడ్, నక్క ప్రదీప్‌గౌడ్, హేమంత్‌కుమార్, అరుణ, పాక దేవేందర్, విజయరెడ్డి, సయ్యద్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లపై సమీక్ష



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా గురువారం ఎమ్మెల్యే నాగేందర్ సంబంధిత హైదరాబాద్ జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అశోక్ చక్రవర్తి, డిప్యూటీ కమిషనర్ శంకర్, ఇతర అధికారులతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఖైరతాబాద్ నియోజకవర్గంలో గుర్తించిన ప్రభుత్వ భూములు, ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ విషయంలో దిశా నిర్దేశాల గురించి చర్చించారు. నిరుపేదలను గుర్తించే విషయంలో జాగ్రత్త వహించి అర్హులు లబ్ధి పొందేలా చూడాలని ఎమ్మెల్యే నాగేందర్ అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. సమీక్షలో మాజీ కార్పొరేటర్ వనం సంగీత, మహాలక్ష్మి గౌడ్, మామిడి నర్సింగ్‌రావు, డివిజన్ ప్రెసిడెంట్ రాములు చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థుల భద్రతే ధ్యేయం



**ప్రజాపక్షం/ఫలక్‌నుమా:** నిబంధనలకు విరుద్ధంగా అధిక సంఖ్యలో విద్యార్థులను తీసుకువెళ్లే వాహనాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తదితరాలపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. పాఠశాల వాహనాలైన బస్సులు, వ్యాన్లు, ఆటో రిక్షాలు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడంపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలను అత్యంత కఠినంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేక తనిఖీలలో భాగంగా, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఇప్పటివరకు స్కూల్ బస్సులు, వ్యాను, ఆటోలతో కలిపి మొత్తం 1,852 వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

## సమస్యలపై సత్వర చర్యలు



**ప్రజాపక్షం/తార్నాక:** జలమండలి హైదరాబాద్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సామ్రాట్ అశోక్ గురువారం సికింద్రాబాద్ జోన్ పరిధిలోని తార్నాక సర్కిల్లో ప్రధాన నీటి లీకేజీలు, సీవరేజ్ ఓవర్‌ఫ్లో ప్రాంతాలు, ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్లు, రిజర్వాయర్లను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తార్నాక ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్లో మిగులు క్లోరిన్ స్థాయిని తనిఖీ చేసి, ఎంసిసి ద్వారా అందుతున్న ట్యాంకర్ ట్రిప్పులను అదే రోజు డెలివరీ చేయాలని ఆదేశించారు. పర్యటనలో జిఎం వినోద్‌కుమార్, డిజిఎంలు, మేనేజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల మహాగర్జన



**ప్రజాపక్షం/ముషీరాబాద్:** తెలంగాణ ఉద్యమకారుల మహాగర్జన ధర్నా ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో జరిగింది. తెలంగాణ ఉద్యమకాల వేదిక ఆధ్వర్యంలో జరిగిన గర్జనకు అన్ని జిల్లాల నుంచి ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల కేకే కమిటీ ప్రతినిధి మోతె శోభన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. రాష్ట్రంలోని అన్ని ఉద్యమకారుల జేఏసీలతో విస్తృత స్థాయిలో చర్చలు జరుపుతామన్నారు. ప్రతి ఉద్యమకారుడికి న్యాయం జరిగేలా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని హామీ ఇచ్చారు. ఉద్యమకారుల నుంచి, ఉద్యమ సంఘాల నుంచి నిరంతరం సూచనలు, వినతులు తీసుకుంటున్నామని తెలిపారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులను పరిశీలిస్తే ఒక్క రోజులోనే ఉద్యమకారులను గుర్తించవచ్చునని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల వేదిక అధ్యక్షుడు నరాల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఉద్యమకారులకు 250 గజాల ఇళ్ల స్థలం, రూ.25 వేల పెన్షన్ తదితర సంక్షేమాలను అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో చలమల నరసింహ, రాజేశం, చిలుక శంకర్, కోడిపుంజుల జ్యోతి, ఉమా, రమాదేవి, అనుముల కళావతి, వేదిక మహిళా అధ్యక్షురాలు సులోచన రావు, భాగ్యమ్మ, నరేష్, ఎస్.కె.ముస్తఫా, నాగేష్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పన్నీర్ స్వాధీనం




**ప్రజాపక్షం/గోషామహల్:** మార్కెట్లో అసలైన పన్నీర్ ముసుగులో విక్రయిస్తున్న చీజ్ అనలాగ్ ఉత్పత్తులపై టాస్క్‌ఫోర్స్ ఉక్కుపాదం మోపింది. వనస్పతి, ఇతర కూరగాయల నూనెలు, నాన్‌మిల్క్ పదార్థాలతో తయారు చేసిన నకిలీ ఉత్పత్తులను పన్నీరుగా అమ్ముతూ వినియోగదారులను మోసం చేస్తున్న ముఠాల గుట్టును పోలీసులు రట్టు చేశారు. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి చీజ్ అనలాగ్‌ను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు, వాటిని పన్నీర్, మలై పన్నీర్ అనే పేర్లతో మార్కెట్లోకి విడుదల చేస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు చేపట్టిన మెరుపు దాడుల్లో 45 అవుట్‌లెట్లు, 8 తయారీ యూనిట్లను తనిఖీ చేయగా, సుమారు 825 కేజీల కల్తీ ఉత్పత్తులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ, కల్తీ ఆహార ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ డిసిపి గైక్వాడ్ రఘునాథ్ హెచ్చరించారు.

## బెదిరింపులకు భయపడేది లేదు



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడి పిలుపులో భాగంగా బిఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు యాద క్రాంతిని ముందస్తుగా పోలీసులు నిర్బంధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న రేవంత్‌రెడ్డి సర్కార్..ఫీ రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం సిగ్గుచేటన్నారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని.. బిఆర్ఎస్ ఎప్పుడూ పేదల పక్షాన నిలుస్తుందన్నారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** రూ.14.21 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసి రియాసత్‌నగర్‌లో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రాజెక్టుల లక్ష్యం పౌర మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం అన్నారు. ప్రాంత నివాసితులకు మెరుగైన సౌకర్యాలను అందించడం కోసం అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

## ఆడపిల్ల భారం కాదు వెలుగునిచ్చే దీపం

### మహిళా సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమం
### తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:** ఆడపిల్ల భారం కాదని, కుటుంబానికి వెలుగునిచ్చే దీపమని తాండూరు ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు ఎంపిడిఒ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన తాండూరు పట్టణానికి చెందిన 164 మంది లబ్దిదారులకు రూ.1,64,19,024వేలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఎల్ఏ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను పాదర్శకంగా అమలు చేస్తోందని, లబ్దిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజా ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని మహిళా సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఆదిశగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. సంక్షేమ పథకాల అమలులో పార్టీలకు అతీతంగా వ్యవహరిస్తున్నామని, అర్హత కల్గిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళా సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమంజూన్ 25 నుంచి సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియ ప్రారంభం కానుందని, అర్హులైన ఓటర్లందరు పాల్గోని సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ నీరాజబాల్‌రెడ్డి, ఎఎంసి చైర్మన్ పట్లోళ నర్సిములు, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, మున్సిపల్ కౌన్సిలర్‌లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిడిఓలు, రెవెన్యూ అధికారులు నాయకులు పాల్గోన్నారు.

# మహానందతీర్థ పాఠశాలకు సహకారం: కెటిఆర్



**ప్రజాపక్షం/బేగంపేట్:** సామాజిక సేవలో భాగంగా తలసాని ట్రస్ట్ ఏర్పాటు చేసి వందల మంది పిల్లలకు నిత్యం భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమని.. నా సహకారం ఎప్పుడూ ఉంటుందని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో బేగంపేట్ బ్రాహ్మణవాడిలోని స్వామి రామానంద తీర్థ విద్యార్థులకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, సికింద్రాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ ఇంచార్జి తలసాని సాయి కిరణ్‌యాదవ్‌లతో కలిసి కేటీఆర్ గురువారం ప్రారంభించారు. అనంతరం సీల్ వెల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సహకారంతో విద్యార్థులకు బుక్స్, బ్యాగ్స్‌ను పంపిణీ చేసి సంస్థ యజమాని సుబ్బారావును కేటీఆర్ సన్మానించి అభినందించారు. స్కూల్ లోని విద్యార్థులతో కలిసి కేటీఆర్ భోజనం చేశారు. కార్యక్రమంలో స్కూల్ నిర్వాహకులు, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, మాజీ కార్పొరేటర్‌లు టి.మహేశ్వరి, నామన శేషుకుమారి, బిఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కొలన్ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ పోస్టులను 20 వేలకు పెంచాలి

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదని తెలంగాణ నిరుద్యోగ సేన గౌరవ అధ్యక్షులు ప్రసన్న హరికృష్ణ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ నిరుద్యోగ సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ప్రకటించిన 5,000 కానిస్టేబుల్ పోస్టులు నిరుద్యోగుల సంఖ్యకు ఏమాత్రం సరిపోవని, యువత అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పోస్టుల సంఖ్యను 20,000కు పెంచాలని డిమాండ్ చేశారు. గ్రూప్1, గ్రూప్2 ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, అభ్యర్థుల్లో నమ్మకం కలిగించేలా తక్షణమే సమగ్ర జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.మీడియా సమావేశంలో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ నాయకులు జనార్ధన్, మోతీలాల్, అస్మా, ఝాన్సీ లతో పాటు ప్రజా సంఘాల నాయకులు కిరణ్ కుమార్ మెండం, డాక్టర్ నరసింహ మాదుగుల, ప్రభాకర్ చోటి, జర్నలిస్ట్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## లాల్‌దర్వాజ ఆలయం ముస్తాబు



**ప్రజాపక్షం/చార్మినార్:** బోనాల పండుగ సందర్భంగా లాల్ దర్వాజా అమ్మవారి ఆలయాన్ని సుందరీకరణ చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ జి.అరవింద్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆలయంలో హుండీ ఏర్పాటు చేయడం జరిగిందని, ఆలయం ఆవరణలో ప్రతి శుక్రవారం మహా హారతి ఉంటుందన్నారు. జులై 20, 21, 22 తేదీలలో ఢిల్లీలో లాల్ దర్వాజా బోనాలు ఉంటాయని.. లాల్ దర్వాజా ఆలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ చైర్మన్ కాశినాథ్‌గౌడ్, బద్రినాథ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సతీష్‌ముదిరాజ్, కోశాధికారి హరీష్‌గౌడ్‌లతో కలిసి అరవింద్‌కుమార్‌గౌడ్ వివరాలు వెల్లడించారు.

## పారదర్శకంగా గిరిజన విద్యార్థుల ఎంపిక

### కలెక్టర్ ప్రియాంక ఆల



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్లలో ప్రవేశానికి గిరిజన విద్యార్థులను పారదర్శకంగా ఎంపిక చేశామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. జిల్లాల వారీగా ఎంపికైన విద్యార్థుల నుంచి రాష్ట్ర స్థాయిలో గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో లాటరీ పద్ధతిన ఎంపిక చేశారు. జిల్లా స్థాయిల్లో మొత్తం 130 మంది గిరిజన విద్యార్థులు ఒకటవ తరగతిలో చేరేందుకు ఎంపిక కాగా వీరి నుంచి ఉపకులాల వారీగా 30మందిని ఎంపిక చేయడం జరిగిందని ఆమె తెలిపారు. వీరి నుంచి బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్‌లో ప్రవేశానికి 13మందిని, రామంతపూర్‌లోని పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశానికి ఏడుగురిని ఎంపిక చేశామన్నారు. వీరిలో ఎవరైనా చేరకపోతే వారి స్థానంలో వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న వారిని ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఆమె అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జితేందర్‌రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి కోటాజి, హాస్టల్ వెల్ఫేర్ అధికారి గోపాల్, ప్రధానోపాధ్యాయురాలు అముక్త మాల్యద , బి.లాలు, జి.యాదయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఫైర్ సేఫ్టీ తనిఖీలు



**ప్రజాపక్షం/అమీర్‌పేట్:** తరచుగా చోటుచేసుకుంటున్న అగ్ని ప్రమాదాల నివారణలో భాగాంగా ప్రధాన ప్రాంతాల్లో రద్దీగా ఉండే బహుళ అంతస్తుల భవనాల్లో చేపడుతున్న చర్యలను ఫైర్ అధికారులు సమీక్షిస్తున్నారు. ఈ క్రమంలోనే డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లా ఫైర్ ఆఫీసర్2 ఆధ్వర్యంలో అమీర్‌పేట్‌లోని విద్యా సంస్థలు, వాణిజ్య సముదాయాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్య ఎన్‌క్లేవ్‌లోని అన్నపూర్ణ బ్లాక్ 2, నీలగిరి బ్లాక్‌తో పాటు శ్రీ చైతన్య కళాశాలలో అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా పైప్‌పిట్టింగ్ పరికరాల లభ్యత, వాటి పనితీరు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఎవాక్యుయేషన్ సదుపాయాలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అయితే ఆదిత్య ఎన్‌క్లేవ్ భవనంలో ఏర్పాటు చేసిన అగ్నిమాపక పరికరాలు పనిచేయని స్థితిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీనిపై నిబంధనల ప్రకారం యాజమాన్యంపై తగిన చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా ఫైర్ ఆఫీసర్2 వెల్లడించారు. అగ్నిమాపక భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ అవసరమైన లోపాలను వెంటనే సరిదిద్దాలని ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ విక్రమ్‌సింగ్‌మాన్ ఆదేశించారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవం... ఆయుష్ సభ్యుల సమావేశం

### పాల్గొన్న మాజీ కౌన్సిలర్ పీసరి బాలమణి కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/దుండిగల్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని బోరంపేట గ్రామంలో ఆయుష్ సభ్యులు సమావేశం ఏర్పాటు చేశారు అనంతరం దుండిగల్ సర్కిల్ బిజెపి అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, బౌరంపేట్ గ్రామం లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆయుష్ పథకం కింద హోమియోపతి, ఆశా ఆరోగ్య కేంద్రం,యోగా సెంటర్ నిర్వహించడం జరుగుతుందనీ బౌరంపేట్ లోయోగా సెంటర్ ప్రారంభించి 2 సంవత్సరాలు అవుతుందనీ ప్రస్తుతం 30 మంది వరకు శిక్షణ పొందుతు వచ్చే సంవత్సరం కల్లా 100 మంది పైగా హాజరు ఉండాలని తెలియజేశారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత భారతీయ సంపద అయిన యోగాను విశ్వస్థాయిలో గుర్తింపు తీసుకు వచ్చి జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ఐక్యరాజ్యసమితిలో ప్రకటించడం చాలా సంతోషించే విషయమని ప్రతి భారతీయునికి గర్వకారణం గత పదేళ్లు గా నాటి నుండి నేటి వరకు ఎంతో మందికియోగా మీద జీవనశైలి మీద ఆలోచన వచ్చి చాలామందియోగా సాధనకు కోరుకోవడం ఎంతోమందికి యోగా టీచర్లుగా ప్రభుత్వము, ప్రైవేటుగా జీవనోపాధిగా కాగలిగిందనీ ప్రస్తుత దైనందిన జీవితంలో పట్టణీకరణ పెరిగి శారీరక శ్రమ తగ్గడంయోగా తప్పనిసరి యొక్క అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కళావతి, డాక్టర్ రాజమోహన్, ఫార్మసిస్ట్ భాగ్యలక్ష్మి, యోగా టీచర్లు సాయి కృష్ణ, శిరీష బిజెపి నాయకులు నల్ల రాజిరెడ్డి మహిళలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి బాటలో రైతు విజయం

### ఏనుగు సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ప్రకృతి వ్యవసాయంతో చిన్న రైతులు కూడా అధిక ఆదాయం సాధించవచ్చని అంకుషాపూర్‌లోని పిట్టల ఆర్గానిక్ ఫాం నిరూపిస్తోందని భారతీయ జనతాపార్టీ నాయకులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాల సుపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు బుధి శ్రీనివాస్, ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏనుగు సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు ఫాంను సందర్శించారు. ప్రకృతి వ్యవసాయం, దేశీ నాటు కోళ్ల పెంపకం మైక్రోగ్రీన్స్ ఉత్పత్తి,జీవామృతం వినియోగం వంటి విధానాలను పరిశీలించిన నాయకులు రైతులకు ఆదాయం పెంచే నమూనాగా పిట్టల శ్రీశైలం కృషిని అభినందించారు.ప్రకృతి వ్యవసాయం రైతుల ఖర్చులను తగ్గించి ఆత్మనిర్భర్ భారత్ వికసిత భారత్ లక్ష్యాల సాధనకు దోహదపడుతుందని ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు.కార్యక్రమంలో ఏనుగు రాజిరెడ్డి,కాలేరు రామోజీ కొలిచెలిమి కృష్ణ,బస్వరాజు గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో పెద్ద చెరువు సుందరీకరణ పనులు పూర్తి

### ఎమ్మెల్యే బండారి ఆదేశం



**ప్రజాపక్షం/ఉప్పల్ :** సకాలంలో హెచ్ఎంటి నగర్‌లోని పెద్ద చెరువు సుందరీకరణ పనులు పూర్తి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశించారు. రూ.37.5 లక్షల వ్యయంతో కొనసాగుతున్న ఈ పనులను స్థానిక మాజీ కార్పొరేటర్ సాయిజన్ శేఖర్‌తో కల్సి ఆయన గురువారం పరిశీలించారు. హెచ్ఎంటి నగర్ చెరువు కట్ట నుంచి ఇందిరానగర్ చెరువు కట్ట వరకు పనుల కోసం వినియోగిస్తున్న భారీ యంత్రాలు ప్రధాన రహదారి మార్గంలోనే వెళ్లవలసి వస్తున్నందున ఏర్పడుతున్న ఇబ్బందుల కారణంగా పనుల్లో జాప్యం ఏర్పడుతోందని, దీనికి పరిష్కారంగా హెచ్ఎంటి నగర్, ఇందిరానగర్ ప్రాంతాలను అనుసంధానించే ప్రత్యేక మార్గాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యేకు తెలిపారు. చెరువు సుందరీకరణ పనులు పూర్తయిన తర్వాత ఈ పరిసర ప్రాంతాల్లో కెల్లా ఓ ప్రత్యేక విహార కేంద్రంగా మారుతుందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ శ్రేణులు మేడల మల్లికార్జునగౌడ్, మేకల ముత్యంరెడ్డి, విఠల్ యాదవ్, కట్టు బుచ్చన్న గౌడ్, చంద్రశేఖర్, రాంచందర్, నరసింహ, రఫిక్, శ్రీనివాస్, యూసూఫ్, మక్బూల్, పెంటయ్య, రోహిత్, శివ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధాలతో అతలాకుతలమైన ప్రపంచంలో...

### శాంతి సామరస్యాలకు మూల సూత్రం ఆదివాసీల జీవనశైలిలోనే ఇమిడిఉంది : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**బేతుల్ (మధ్యప్రదేశ్):** ప్రస్తుతం ఉద్రిక్తతలు, సంఘర్షణలు, యుద్ధాలతో సతమతం అవుతున్న ప్రపంచంలో శాంతి, సామరస్యాలకు మూల సూత్రం ఆదివాసీల జీవనశైలిలోనే ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ప్రకృతితో ముడిపడి ఉంటూ, దానిని అత్యంత గౌరవభావంతో చూసేదే వారి జీవనశైలి అని రాష్ట్రపతి తెలిపారు. విదేశీ రసాయన పురుగు మందులు సారవంతమైన భూములను నిస్సారంగా మారుస్తున్నాయని ద్రౌపది ముర్ము చెబుతూ సేంద్రీయ వ్యవసాయానికి మద్దతుగా ఆమె తన గొంతుక విప్పారు. మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లాలో గురువారం బ్రహ్మకుమారీస్ అనే ఆధ్యాత్మిక సంస్థ నిర్వహించిన 'ఆధ్యాత్మిక జాగృతి ద్వారా గిరిజన సమాజ సాధికారిత' అనే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. అటవీవాసుల జీవితాలు, సంప్రదాయాలు, శాంతి, సామరస్యాలకు నిదర్శనమని, గిరిజనవర్గాలు భూమిని, నీరు, చెట్లను, సూర్యుడిని పూజిస్తాయని తెలియజేశారు. ప్రస్తుతం ఉద్రిక్తతలు, కలహాలు, యుద్ధాలతో సతమతమవుతున్న మన సమాజంలో శాంతి సామరస్యాలకు వారి జీవన విధానమే కీలకమని ముర్ము అన్నారు. ఉద్రిక్తత, యుద్ధాలతో పీడితమైన నేటి ప్రపంచంలో, చరిత్రలో మరెన్నడూ లేనంతగా ఇటువంటి విలువల అవసరం ఉందని, అందువల్ల ఇటువంటి సమావేశాలు, ప్రయత్నాల ప్రాముఖ్యత మరింత పెరుగుతుందని వివరించారు. భూమికి ఏదైనా హాని కలిగించినప్పటికీ, గిరిజన సమాజాలు గౌరవాన్ని అందిస్తాయని రాష్ట్రపతి ముర్ము చెప్పారు. ప్రకృతి పట్ల ఆదివాసీ ప్రజలకు ఉన్న ప్రగాఢమైన గౌరవాన్ని నొక్కిచెబుతూ వారు చెట్లను పూర్తిగా ఎండిపోయిన తర్వాత మాత్రమే వంట చెరుకుగా ఉపయోగిస్తారని, వాటిని నరికేముందు ప్రార్థనలు కూడా చేస్తారని వివరించారు. గిరిజన సమాజం ఆత్మగౌరవం, సహనంతో జీవిస్తుందని, తమ సమస్యల గురించి మాట్లాడదని రాష్ట్రపతి అన్నారు. వారెప్పుడూ ఏమీ అడగరని, ప్రకృతితో మమేకమై కాలక్రమేణా అన్నీ లభిస్తాయనే ఆశతో జీవిస్తారని, వారు ప్రశాంతంగా జీవించడానికి ఇష్టపడతారని ఆమె చెప్పారు. గిరిజన సమాజాల జీవనశైలి సహజంగానే ఆధ్యాత్మికత సంబంధిత మౌలిక ప్రేరణలకు దగ్గరగా ఉంటుందని ద్రౌపది ముర్ము వివరించారు. నేటి వేగవంతమైన ప్రపంచంలో వినియోగ సంస్కృతితో నడిచే సమాజంలోని ప్రతీ విభాగంలో ఆధ్యాత్మిక అవగాహన చాలా కీలకం అవుతుందని ఆమె చెప్పారు. స్వదేశీ సంఘాలకు మద్దతు ఇచ్చినందుకు రాష్ట్రపతి ముర్ము బ్రహ్మకుమారీలను కూడా ప్రశంసించారు. మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ పటేల్, గిరిజన వ్యవహారాల శాఖ కేంద్ర సహాయ మంత్రి దుర్గాదాస్ ఉయికే హాజరయ్యారు. రాష్ట్రపతి ముర్ము గురువారం 5 రోజుల పర్యటన నిమిత్తం మధ్యప్రదేశ్‌కు చేరుకున్నారు.

# వరుసగా మూడో సంవత్సరం ఇపిఎఫ్ వడ్డీ 8.25 శాతం

### అధికారికంగా ఆమోదించిన కేంద్రం

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల భవిష్యనిధి (ఇపిఎఫ్) డిపాజిట్లపై 2025–26 ఆర్థిక సంవత్సరానికి కూడా 8.25 శాతం వడ్డీ రేటును అధికారికంగా ఆమోదించింది. దీనితో వరుసగా మూడో సంవత్సరం కూడా ఇపిఎఫ్ ఖాతాదారులకు అదే వడ్డీ రేటు అమలు కానుంది. దేశవ్యాప్తంగా ఇపిఎఫ్‌కు క్రమం తప్పకుండా చందాలు చెల్లిస్తున్న ఏడు కోట్లకు పైగా సభ్యుల ఖాతాల్లో ఈ నెలలోనే, ఈ వడ్డీ జమయ్యే అవకాశం ఉందని గురువారం ఒక అధికారి వెల్లడించారు. పిటిఐ వార్తా సంస్థను అనుసరించి, ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఇపిఎఫ్ఓ) నిర్ణయించిన వడ్డీ రేటుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపిన తరువాతే ఆ వడ్డీని సభ్యుల ఖాతాల్లో జమ చేస్తారు. ఇపిఎఫ్ఓ అత్యున్నత నిర్ణయాధికార సంస్థగా వ్యవహరిస్తున్న కేంద్ర ధర్మకర్తల మండలి (సిబిటి) నిర్ణయించిన 8.25 శాతం వడ్డీ రేటుకు ఆర్థిక మంత్రిత్వ శాఖ సమ్మతి తెలిపింది. ఇంతకుముందు 2026 మార్చి 2న కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ అధ్యక్షతన జరిగిన సిబిటి సమావేశంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఇపిఎఫ్ డిపాజిట్లపై 8.25 శాతం వడ్డీ రేటును కొనసాగించాలని నిర్ణయించారు. వరుసగా మూడో ఏడాది కూడా ఇదే వడ్డీ రేటు అమలులో ఉండడం విశేషం. ఈ నిర్ణయం అనంతరం, ఇపిఎఫ్‌కు భారత ప్రభుత్వం హామీదారుగా ఉన్నందున, ఆమోదం కోసం ప్రతిపాదనను ఆర్థిక మంత్రిత్వ శాఖకు పంపించారు. ప్రతిపాదనను పరిశీలించిన అనంతరం ఆర్థిక మంత్రిత్వ శాఖ దానికి ఆమోదం తెలిపిందని సమాచారం. కార్మిక మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఇపిఎఫ్ఓ 2025–26 సంవత్సరానికి సంబంధించిన 8.25 శాతం వడ్డీని ఈ నెలలోనే సభ్యుల ఖాతాల్లో జమ చేసే అవకాశముంది. అంతేకాకుండా, ఇపిఎఫ్ఓ అభివృద్ధి చేసిన కొత్త డిజిటల్ వ్యవస్థ కింద ఇకపై ఇపిఎఫ్ వడ్డీ సభ్యుల ఖాతాల్లో మరింత వేగంగా, తక్షణమే జమయ్యేలా ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. గత సంవత్సరం ఫిబ్రవరిలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి కూడా ఇపిఎఫ్ వడ్డీ రేటును 8.25 శాతంగానే కొనసాగించారు. అంతకుముందు 2023–24 సంవత్సరానికి వడ్డీ రేటును 8.15 శాతం నుంచి 8.25 శాతానికి స్వల్పంగా పెంచారు. 2021–22 సంవత్సరానికి ఇపిఎఫ్ఓ వడ్డీ రేటును 8.50 శాతం నుంచి 8.10 శాతానికి తగ్గించింది. ఇది నాలుగు దశాబ్దాలకు పైగా కాలంలో నమోదైన కనిష్ఠ స్థాయి. 1977–78 సంవత్సరంలో ఇపిఎఫ్ వడ్డీ రేటు 8 శాతంగా ఉండగా, దాని తరువాత అత్యల్ప స్థాయి 8.10 శాతమే. అలాగే 2019–20 సంవత్సరానికి వడ్డీ రేటును 8.65 శాతం నుంచి 8.50 శాతానికి తగ్గించారు. 2016–17లో 8.65 శాతం, 2017–18లో 8.55 శాతం, 2015–16లో 8.80 శాతం వడ్డీని ఇపిఎఫ్ఓ అందించింది. అంతకుముందు 2013–14, 2014–15 ఆర్థిక సంవత్సరాల్లో ఇపిఎఫ్ డిపాజిట్లపై 8.75 శాతం వడ్డీ చెల్లించగా, 2012–13లో అది 8.50 శాతంగా ఉంది. 2011–12 సంవత్సరంలో వడ్డీ రేటు 8.25 శాతంగా నమోదైంది. ప్రస్తుత నిర్ణయంతో ఉద్యోగుల పదవీ విరమణ పొదుపులపై 8.25 శాతం వడ్డీ వరుసగా మూడో ఏడాది కొనసాగనుంది. దీంతో కోట్లాది మంది ఇపిఎఫ్ సభ్యులకు స్థిరమైన రాబడి లభించనుంది.

# నీట్ విద్యార్థి ఆత్మహత్య

**అహ్మదాబాద్ :** మరొక నీట్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈనెనల 21వ తేదీన జరగాల్సిన నీట్ పునఃపరీక్షకు హాజరు కావాల్సిన 17 ఏళ్ల బాలుడు, గురువారం తెల్లవారుజామున అహ్మదాబాద్‌లోని ఒక భవనంలోని ఆరో అంతస్తులో ఉన్న ఫ్లాట్ నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. ఘటనాస్థలిలో ఎలాంటి ఆత్మహత్య లేఖ లభించలేదని వారు చెప్పారు. 'తెల్లవారుజామున సుమారు 2.55 గంటలకు, నీట్ పరీక్ష రాస్తున్న ఆ బాలుడు, అహ్మదాబాద్‌లోని త్రాగడ్ ప్రాంతంలో ఉన్న అరిస్టో ఆనందం ఫ్లాట్‌లోని బి బ్లాక్‌లో గల తన అపార్ట్‌మెంట్‌లోని ఆరో అంతస్తు బాల్కనీ నుంచి దూకాడు' అని సబర్మతి ఇన్‌స్పెక్టర్ వై.ఆర్. వాఘేలా పిటిఐకి తెలిపారు. సొసైటీ సెక్యూరిటీ గార్డు గమనించి నివాసితులను అప్రమత్తం చేశాడని, ఆ బాలుడిని ఆసుపత్రికి తరలించగా, అక్కడ వైద్యులు అతను మరణించినట్లు ప్రకటించారని ఆ అధికారి తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం పంపారు. మృతుడు నీట్ పునఃపరీక్షకు హాజరు కావాల్సి ఉందని, అతను తన గత పరీక్షలలో మంచి మార్కులు సాధించాడని వాఘేలా తెలిపారు. విద్యార్థి తల్లిదండ్రులు విడిపోయిన తర్వాత, ఆ బాలుడు అహ్మదాబాద్‌లో తన తల్లి, తమ్ముడితో కలిసి నివసిస్తుండగా, న్యాయవాది అయిన అతని తండ్రి సూరత్‌లో ఉంటున్నారని ఆయన తెలిపారు. అతను ఎలాంటి మానసిక ఒత్తిడిలో ఉన్నట్లు కుటుంబ సభ్యులు సూచించలేదని, సంఘటనా స్థలంలో ఎలాంటి ఆత్మహత్య లేఖ లభించలేదని వాఘేలా తెలిపారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని ఆయన అన్నారు. పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 3న జరిగిన పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ రద్దు చేయడంతో, జూన్ 21న కొత్త నేషనల్ ఎలిజిబిలిటీకమ్‌ఎంట్రన్స్ టెస్ట్ (నీట్‌యుజి) జరగనుంది.

# అమిత్ షా, యుఎస్ రాయబారి గోర్ భేటీ

### ఉగ్రవాదం, మాదకద్రవ్యాల నిరోధం వంటి అంశాలలో సహకారం బలోపేతంపై చర్చ



**న్యూఢిల్లీ :** భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ గురువారం కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిశారు. భద్రతా రంగంలో, ముఖ్యంగా ఉగ్రవాద నిరోధం, మాదకద్రవ్యాల నిరోధం వంటి అంశాలలో సహకారాన్ని బలోపేతం చేయడంపై ఇద్దరూ చర్చించారు. ఫ్రాన్స్‌లోని ఎవియాన్‌లెస్ బైన్స్‌లో జరిగిన జి7 శిఖరాగ్ర సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ల మధ్య సమావేశం జరిగిన మరుసటి ఈ పరిణామం చోటుచేసుకుంది. 'గురువారం న్యూఢిల్లీలో భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్‌ను కలిశాను. భద్రతా రంగంలో, ముఖ్యంగా ఉగ్రవాద నిరోధం, మాదకద్రవ్యాల నిరోధం వంటి అంశాలలో భారత్–అమెరికా మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై వివరంగా చర్చించాము' అని అమిత్ షా ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో, భారత్–అమెరికా సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి, ఈ ద్వైపాక్షిక సంబంధాల ద్వారా ఇరు దేశాల ప్రజలు ప్రయోజనం పొందేలా చూడటానికి భారత్ దృఢంగా కట్టుబడి ఉందని ఆయన అన్నారు. అదే విధంగా అమిత్ షాతో జరిగిన సమావేశం అద్భుతం అని ఎక్స్ వేదికగా సెర్గియో గోర్ అభివర్ణించారు. 'ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి సహకారాన్ని పెంపొందించుకోవడం, మాదకద్రవ్యాలు, అక్రమ డ్రగ్స్ నుండి మన ప్రజలను కాపాడటం, మన సరిహద్దులను సురక్షితం చేయడం, ఇరు దేశాలలో నేరస్థులను సంయుక్తంగా న్యాయస్థానం ముందు నిలబెట్టడం వంటి అంశాలపై మేము ఫలవంతమైన చర్చ జరిపామన్నారు. 'ఫ్రాన్స్‌లోని జి7 సదస్సుకు గొప్ప పర్యటన తర్వాత న్యూఢిల్లీకి తిరిగి వచ్చాను. అమెరికా, భారత్ మధ్య ఎన్నో సానుకూల ఫలితాలు వచ్చాయి' మరో పోస్ట్‌లో గోర్ పేర్కొన్నారు.

# 20న బెంగాల్ నుంచి పిఎం కిసాన్ నిధులు విడుదల

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 20న పశ్చిమ బెంగాల్ నుండి పిఎం కిసాన్ పథకం కింద 23వ విడతను బదిలీ చేయనున్నారు. దేశవ్యాప్తంగా 9.44 కోట్లకు పైగా రైతు లబ్ధిదారులకు రూ. 18,880 కోట్లు నేరుగా పంపిణీ చేయనున్నారు. తూర్పు రాష్ట్రమైన పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో ఆయన పర్యటన సందర్భంగా ఈ బదిలీ జరగనుంది. పశ్చిమ బెంగాల్‌లోనే 45.35 లక్షలకు పైగా రైతులకు సుమారు రూ. 907 కోట్ల విడతలు అందనున్నాయని వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. దీంతో రాష్ట్రంలో ఈ పథకం కింద మొత్తం పంపిణీ రూ. 15,055 కోట్లు దాటుతుందని, 2019లో ఈ పథకం ప్రారంభమైనప్పటి నుండి జాతీయ స్థాయిలో మొత్తం పంపిణీ రూ. 4.46 లక్షల కోట్లను అధిగమిస్తుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులను ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డిబిటి) ద్వారా పంపిణీ చేస్తామని, తద్వారా చిన్న, సన్నకారు రైతుల ఆదాయ భద్రతను బలోపేతం చేస్తామని చౌహాన్ అన్నారు. మోదీ పశ్చిమ బెంగాల్‌లో సుమారు రూ. 12,200 కోట్ల సంయుక్త వ్యయంతో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, పునర్‌వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకలను కూడా ప్రారంభించనున్నారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. 2026–27లోగా 30 లక్షల హెక్టార్లలో సుమారు 1.10 కోట్ల మంది రైతులకు పంటల బీమా కవరేజీని విస్తరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీని ద్వారా దాదాపు రూ. 28,140 కోట్ల విలువైన పంటలకు బీమా కల్పించబడుతుంది. డిజిటల్ వ్యవసాయ మిషన్ కింద, ప్రధాన మంత్రి రాష్ట్రంలో ఒక అగ్రిటెక్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించనున్నారు. ఇది ఎరువుల పంపిణీ, కిసాన్ క్రెడిట్ కార్డులు, టిబిటిసేవలు, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ఆధారిత ప్రభుత్వ కొనుగోళ్ల కోసం ఒక సమీకృత ఇంటర్‌ఫేస్‌ను అందిస్తుంది. మోదీ జాతీయ సహజ వ్యవసాయ మిషన్‌ను ప్రారంభించనున్నారు. దీని కింద 2026–27లోగా పశ్చిమ బెంగాల్‌లో 17,300 హెక్టార్లలో 346 సహజ వ్యవసాయ క్లస్టర్‌లను ఏర్పాటు చేయనున్నారు. జీవ వనరుల కేంద్రాలు మరియు 'కృషి సఖిల' మద్దతుతో, జీవ ఆధారిత ఉత్పాదకాలు, శిక్షణ, మార్కెట్ అనుసంధానాల ద్వారా ఈ కార్యక్రమం 43,250 మంది రైతులకు ప్రయోజనం చేకూరుస్తుందని అంచనా. ఆయన పురూలియా, డార్జిలింగ్, అలీపుర్‌దువార్ మరియు ఝార్‌గ్రామ్ జిల్లాలలో ప్రధాన మంత్రి ధన్‌ధన్య కృషి యోజనను కూడా ప్రారంభించనున్నారు.


SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS05UB-5598 | NEERATI SAI TEJA | TATA INDICA V2-P | 2016 |
| 2 | TS07UJ-1019 | Banoth Rathan Nayak | TATA ZEST DIESEL-P | 2019 |
| 3 | TS15EC-6146 | Mirza Mujahid Baig | SWIFT DZIRE VDI DIESEL 5 SEATER | 2014 |
| 4 | TS05UB-7003 | Ramana Chary Kasthuri | AL DOST | 2016 |

AUCTION DATE : 20-06-2026

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED

1st Floor, H.No.6-159, Above DCC Bank, Reddy Colony, Bhupalpally Jayashnakar Bhupalpally - 506169, Cell : 9849981545, 9949340057


# విద్యా సంస్కరణలకు సంతకాల ఉద్యమం

### 'ఛత్రోన్ కీ గూంజ్' ఉద్యమంలో చేరాలని విద్యార్థులకు రాహుల్‌గాంధీ పిలుపు



**న్యూఢిల్లీ :** దేశ విద్యా వ్యవస్థకు సంబంధించిన పేపర్ లీక్‌లు, అధిక ఫీజులు వంటి సమస్యలపై ప్రజల్లోకి దూసుకెళ్లేందుకు కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ గురువారం ఒక సంతకాల సేకరణ ఉద్యమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వానికి నేరుగా తమ డిమాండ్లను తెలియజేయడానికి ఇది విద్యార్థులకు ఒక వేదిక అని ఆయన పేర్కొన్నారు. ఎక్స్‌లో రాహుల్‌గాంధీ ఈ ఉద్యమానికి సంబంధించిన లింక్‌ను పోస్ట్ చేశారు. దీని ద్వారా విద్యార్థులు తమ ఆలోచనలను పంచుకోవచ్చు, వినతిపత్రంపై సంతకం చేయవచ్చు. 'పేపర్ లీక్‌లు, పరీక్షల సమస్యలు, లేదా అధిక ఫీజుల వల్ల మీరు బాధపడి ఉంటే, ఈ విద్యా వ్యవస్థ మీ కలలను నాశనం చేసి ఉంటే, మీ కుటుంబం మీ చదువు కోసం జీవితకాల పొదుపును పెట్టుబడిగా పెట్టి ఉంటే, అప్పుడు 'ఛత్రోన్ కీ గూంజ్' మీ గొంతుక అవుతుంది' అని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు ఆ పోస్టులో పేర్కొన్నారు. ఈ చొరవ కేవలం ఒక ఉద్యమం మాత్రమే కాదని, సరసమైన విద్య, నిష్పక్షపాత పరీక్షలు, గౌరవప్రదమైన ఉపాధి అవకాశాల ఆవశ్యకత వంటి సమస్యలను విద్యార్థులు లేవనెత్తడానికి ఇది ఒక వేదిక అని పేర్కొన్నారు. 'ఈ ఉద్యమంలో చేరండి: కింద ఉన్న లింక్ క్లిక్ చేయండి. మీ పేరును నింపి, మీ ఆలోచనలను పంచుకోండి. వినతిపత్రంపై సంతకం చేయండి అంతే' అని రాహుల్‌గాంధీ యువతను ఈ ఉద్యమంలో చేరమని కోరారు. సంతకాలు ఎంత ఎక్కువగా ఉంటే, నినాదాలు అంత బిగ్గరగా వినిపిస్తాయన్నారు. రాజస్థాన్‌లోని కోటాలో జరిగిన ఒక సదస్సులో విద్యార్థులతో మాట్లాడిన మరుసటి రోజే, ఈ ప్రచారంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సంభాషణ సందర్భంగా, ఆయన భారతదేశ విద్యా వ్యవస్థను ఒక ఎంపిక వ్యవస్థగా కాకుండా 'తిరస్కరణ వ్యవస్థ'గా అభివర్ణించారు. ఇది విద్యార్థులు, మధ్యతరగతి కుటుంబాలపై అధిక ఆర్థిక భారాన్ని మోపుతుందని, తీవ్రమైన ఒత్తిడికి కారణమవుతుందని ఆయన పేర్కొన్నారు. కోచింగ్ సెంటర్లకు ప్రసిద్ధి చెందిన కోటాలో జరిగిన సభలో ప్రసంగిస్తూ, ప్రస్తుత విద్యా నిర్మాణం అత్యంత ఒత్తిడితో కూడుకున్నదని, అన్యాయమైనదని రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. ఇది దేశానికి మంచిది కాదన్నారు. ఈ అమ్మాయి అనుభవించిన బాధను ఈ దేశంలోని ఏ విద్యార్థి కూడా ఎప్పటికీ అనుభవించకుండా చూసేందుకు మనమందరం కలిసి పనిచేయాలని నేను కోరుకుంటున్నానని ఆయన కోటాలో జరిగిన 'ఛత్రోన్ కి గూంజ్' మహా ర్యాలీలో అన్నారు. అక్కడ ఆయన పేపర్ లీక్‌లు, నిరుద్యోగం వంటి వివిధ సమస్యలపై విద్యార్థులతో సంభాషించారు.

# నీట్ రీటెస్ట్‌లో సమగ్రత, పారదర్శకత పాటించాలి : ప్రధాన్



**న్యూఢిల్లీ :** వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్‌యుజి పరీక్ష ఈ ఏడాది మే 3న జరిగింది. అయితే ప్రశ్నపత్రం లీకైందన్న ఆరోపణల నేపథ్యంలో పరీక్షను రద్దు చేశారు. ప్రస్తుతం ఈ విషయంపై సిబిఐ దర్యాప్తు చేస్తోంది. ఈనెల జూన్ 21న పునఃపరీక్ష నిర్వహించనున్నారు. ఈ సన్నద్ధతను సమీక్షించేందుకు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అధ్యక్షతన గురువారం విద్యా మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వాలు, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ), ఉన్నత విద్యా సంస్థల సీనియర్ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధాన్ మాట్లాడుతూ పరీక్షా ప్రక్రియలో అత్యున్నత స్థాయి సమగ్రత, పారదర్శకత, సామర్థ్యాన్ని పాటించే ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. పునఃపరీక్షను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులందరూ అప్రమత్తంగా, పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు. పునఃపరీక్ష ప్రక్రియకు సంబంధించిన కార్యకలాపాలను సమన్వయం చేయడానికి, మంత్రిత్వ శాఖ నియమించిన అధికారులు అన్ని రాష్ట్రాలకు చేరుకుని, ఎన్‌టిఎ డైరెక్టర్ జనరల్ నేతృత్వంలోని కమాండ్ సెంటర్‌కు నివేదిస్తారని మంత్రి తెలిపారు. విద్యార్థులు ఒత్తిడి లేని వాతావరణంలో పునఃపరీక్షకు హాజరయ్యేందుకు వీలుగా వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాల నియమిత నోడల్ అధికారులను ప్రధాన్ కోరారు. ఈ సమావేశానికి పాఠశాల విద్య, అక్షరాస్యత కార్యదర్శి సంజయ్ కుమార్, ఉన్నత విద్యా కార్యదర్శి వినీత్ జోషి, ఎన్‌టిఎ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ తదితరులు హాజరయ్యారు. పునఃపరీక్ష సజావుగా జరిగేలా చూసేందుకు, జిల్లా మేజిస్ట్రేట్ల నేతృత్వంలోని జిల్లా స్థాయి సమన్వయ కమిటీలు, రాష్ట్ర పోలీసు విభాగాలు, నిఘా సంస్థలతో సహా సంబంధిత భాగస్వాములందరితో కలిసి ఎన్‌టీఏ పనిచేస్తోందని ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ తెలిపారు.

# పార్టీ ఖాతాలు స్తంభింపజేయండి

### ఓ ప్రైవేటు బ్యాంక్‌కు.. టిఎంసి నేత అరూప్ బిశ్వాస్ లేఖ



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. పార్టీపై అధికారం, నియంత్రణకు సంబంధించిన వివాదాన్ని ప్రస్తావిస్తూ, పార్టీ ఖాతాల నిర్వహణపై తక్షణమే ఆంక్షలు విధించాలని కోరుతూ సీనియర్ తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) నాయకుడు అరూప్ బిశ్వాస్ ఒక ప్రైవేట్ బ్యాంకుకు లేఖ రాశారని సంబంధిత వర్గాలు తెలిపాయి. కోల్‌కతాలోని సెంట్రల్ ప్లాజా బ్రాంచ్ మేనేజర్‌కు రాసిన రెండు పేజీల లేఖ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. అయితే లేఖ ప్రామాణికతపై స్పష్టత కోసం బిశ్వాస్‌కు చేసిన ఫోన్ కాల్స్, పంపిన సందేశాలకు కూడా ఎటువంటి సమాధానం లభించలేదని పిటిఐ కథనం పేర్కొంది. ఈనెల 12న రాసిన లేఖ ప్రకారం... టిఎంసి కోశాధికారి హోదాలో ఉన్న బిశ్వాస్, వివాదం పరిష్కారమయ్యే వరకు 'యథాతథ స్థితి'ని కొనసాగించాలని, ఎటువంటి డెబిట్ లావాదేవీలను లేదా నిర్వహణ విధానాల్లో మార్పులను అనుమతించవద్దని బ్యాంకును కోరారు. 2026 అసెంబ్లీ ఎన్నికల తర్వాత పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో అత్యంత కీలక పరిణామంగా మారిన టిఎంసి అంతర్గత తిరుగుబాటు నేపథ్యంలో ఈ లేఖ రాసినట్లు తెలుస్తోంది. రాష్ట్ర అసెంబ్లీలో, రీటాబ్రత బెనర్జీ నేతృత్వంలోని 58 మంది అసమ్మతి టిఎంసి ఎమ్మెల్యేల బృందం పార్టీ నాయకత్వం నుండి విడిపోయింది. వీరు స్పీకర్ నుండి ప్రధాన శాసనసభ బృందంగా గుర్తింపు పొందడంతో పాటు, బెనర్జీని ప్రతిపక్ష నాయకుడిగా ఎన్నుకున్నారు. అదే సమయంలో, ఈ చీలిక పార్లమెంటుకు కూడా విస్తరించింది. సుదీప్ బందోపాధ్యాయ, కాకోలి ఘోష్ దస్తీదార్‌లతో సహా 20 మంది తిరుగుబాటు టిఎంసి ఎంపిలు పార్టీ కేంద్ర నాయకత్వం నుండి దూరమయ్యారు. తమకు మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ మంది టిఎంసి లోక్‌సభ సభ్యుల మద్దతు ఉందని పేర్కొంటూ, 'నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా' (ఎన్‌సిపిఐ)లో విలీనం కావాలని వారు కోరారు.

### ప్రతిపక్షనేతగా రీటాబ్రతాను కొనసాగిస్తూ కోర్టు నిర్ణయం

మరో వైపు మమతా బెనర్జీకి కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. టిఎంసి రెబల్ నేత రీటాబ్రతా బెనర్జీని అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా గుర్తిస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు సమర్థించింది. ఇప్పటికిప్పుడు ఈ విషయంలో ఎలాంటి మార్పునకు ఆదేశించలేమని కోర్టు తెలిపింది. ఈ మేరకు కోల్‌కతా హైకోర్టు జడ్జి జస్టిస్ క్రిష్ణా రావ్ ఈ కేసుపై నిర్ణయం తీసుకున్నారు. కాగా, అసెంబ్లీ స్పీకర్ తిరుగుబాటు ఎమ్మెల్యేను అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా గుర్తించడాన్ని సవాలు చేస్తూ మమతా బెనర్జీ కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై తాజాగా జస్టిస్ క్రిష్ణా రావ్ ఆధ్వర్యంలోని బెంచ్ విచారణ జరిపింది. అసెంబ్లీ స్పీకర్ నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని, ఇప్పటికిప్పుడు ప్రతిపక్ష నేతగా రితబ్రతను మార్చలేమని కోర్టు తెలిపింది. ఈ అంశంపై స్పందించాలని స్పీకర్‌తోపాటు, ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఈ అంశంలో తమ స్పందన తెలియజేయాలని కోరింది. దీనిపై స్పందించిన ప్రతివాదులు.. తాము అఫిడవిట్ సమర్పించేందుకు మూడు వారాల గడువు కావాలని కోరారు. అయితే, కోర్టు రెండు వారాల సమయం ఇచ్చింది. అలాగే, తదుపరి విచారణ జూలై 28కి వాయిదా వేసింది. అప్పటివరకు పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ప్రతిపక్ష నేతగా రీటాబ్రతా బెనర్జీనే కొనసాగుతారని స్పష్టం చేసింది.

# లోయలోకి దూసుకెళ్లిన ఎస్‌యువి

### ఏడుగురు మృత్యువాత, హిమాచల్ ప్రదేశ్‌లో చంబాలో ఘటన

**చంబా :** హిమాచల్‌ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. గురువారం తెల్లవారుజామున మస్రూంహమల్ రహదారిపై ఛత్రుండ్ సమీపంలో ఎస్‌యువి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతులలో ముగ్గురు మహిళలు ఉన్నారు. వారు మహల్ గ్రామానికి తిరిగి వస్తున్నారు. డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో ఎస్‌యువి అదుపుతప్పి రహదారి పక్కకు వెళ్లి లోయలో పడిపోయిందని పోలీసులు తెలిపారు. వాహనంలో ఉన్న ఆరుగురు అక్కడికక్కడే మరణించగా, మరొకరు గాయాలతో తర్వాత మరణించారని, మృతులను ఇంకా గుర్తించాల్సి ఉందని వారు తెలిపారు. సహాయక బృందాలు తీవ్ర శ్రమించి శిథిలాల నుంచి మృతదేహాలను వెలికితీశాయని పోలీసులు తెలిపారు. ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసు బృందం సహాయక చర్యలు చేపట్టిందని చంబా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ విజయ్ సక్లానీ తెలిపారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణం ఇంకా తెలియరాలేదన్నారు. ప్రమాదం జరిగిన ఆ ప్రమాదకరమైన రహదారిపై క్రాష్ బారియర్ లేదని స్థానికులు ఆరోపించారు. ప్రాణనష్టం పట్ల ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు విచారం వ్యక్తం చేశారని, బాధిత కుటుంబాలకు సాధ్యమైనంత సహాయం అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారని ఇక్కడ జారీ చేసిన ఒక ప్రకటన తెలిపింది.



# ద్రవిడ సిద్ధాంతాలకు టివికె కట్టుబడి ఉంది

### ద్విభాషా విధానాన్ని అనుసరిస్తోంది

### నీట్, ఎన్‌ఇపిలను వ్యతిరేకిస్తోంది : అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం



**చెన్నై :** తమిళనాడు శాసనసభ గురువారం సమావేశమైంది. సభనుద్దేశించి గవర్నర్ ఆర్.వి. ఆర్లేకర్ ప్రసంగించారు. టివికె ప్రభుత్వ విధానాలను వివరించారు. ఇందులో 69 శాతం రిజర్వేషన్ల పరిరక్షణకు కట్టుబడి ఉండటం, ద్విభాషా విధానాన్ని అనుసరించడం, అలాగే ఎన్‌ఇపి(జాతీయ విద్యా విధానం), నీట్‌లను వ్యతిరేకించడం వంటి అంశాలను ప్రస్తావించారు. సి.ఎన్. అన్నాదురై కాలం నుంచే తమిళనాడులో ద్విభాషా విధానం అమలవుతోందని, ప్రజలు దీనిని ఆమోదించినందున ప్రభుత్వం ఈ విధానాన్ని కొనసాగిస్తుందని గవర్నర్ ఆర్లేకర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. 'మద్రాస్ హైకోర్టు, దాని మదురై బెంచ్‌లో వాదనల భాషగా తమిళాన్ని ఉపయోగించాలని, అలాగే చెన్నైలో సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలని ఈ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతుందని గవర్నర్ పేర్కొన్నారు. ప్రతి వర్గానికి తగిన ప్రాతినిధ్యం లభించడమే నిజమైన సామాజిక న్యాయం అనేది ప్రభుత్వ ప్రాథమిక విధానమన్నారు. 'ఈ విధానాన్ని, హామీని నెరవేర్చడానికి, ప్రస్తుతం జరుగుతున్న జనాభా గణనతో పాటు కుల గణనను కూడా వేగంగా పూర్తి చేయాలని మేము కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతాము. కేంద్ర ప్రభుత్వం కుల గణనను పూర్తి చేసిన తర్వాత, తమిళనాడు ప్రభుత్వం సామాజిక న్యాయ సర్వేను నిర్వహిస్తుంది' అని ఆయన చెప్పారు. జాతీయ విద్యా విధానం 2020ని ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. 'సమగ్ర శిక్షా అభియాన్' (ఎస్ఎస్ఎ) కింద తమిళనాడుకు రావాల్సిన రూ. 3,458 కోట్ల నిధులను, ఎన్‌ఇపిలోని త్రిభాషా విధానాన్ని అమలు చేస్తేనే విడుదల చేస్తామన్న కేంద్ర ప్రభుత్వ వైఖరి ఆమోదయోగ్యం కాదన్నారు. ఇది తమిళనాడుపై త్రిభాషా విధానాన్ని రుద్దడంతో సమానమని, నిధుల కేటాయింపుతో త్రిభాషా విధాన అమలును ముడిపెట్టే తన వైఖరిని పునఃపరిశీలించాలని, తమిళనాడుకు రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతామని ఆర్లేకర్ అన్నారు. రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలో విద్య అనే అంశం ఉండటం వల్ల నీట్, ఎన్‌ఇపి, త్రిభాషా విధానం రుద్దడం వంటి సమస్యలు తలెత్తాయని, అందువల్ల, రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితా నుండి విద్యను రాష్ట్ర జాబితా లోకి మార్చడానికి ఈ ప్రభుత్వం అన్ని అవసరమైన ప్రయత్నాలు చేస్తుందని గవర్నర్ పేర్కొన్నారు.

# నాటో మిత్ర దేశాలపై విరుచుకుపడిన హెగ్సెత్

## యుద్ధంలో సాయం చేయకపోవడం సిగ్గుచేటు



**బ్రస్సెల్స్:** ఇరాన్‌పై యుద్ధానికి సహకరించని నాటో మిత్రదేశాలపై అమెరికా యుద్ధమంత్రి హెగ్సెత్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వారి ప్రవర్తన సిగ్గుచేటని విమర్శించారు. యూరప్‌లో అమెరికా దళాలకు సంబంధించిన ఆరునెలల సమీక్షను ఆయన గురువారం ప్రకటించారు. యూరప్‌దేశాలు తమ సొంత భద్రతను ఎంత త్వరగా సమకూర్చుకుంటాయో ఎంత వేగంగా తమ భద్రతకు బాధ్యత వహిస్తాయో వారిపైనే ఆధారపడి ఉందని హెగ్సెత్ అన్నారు. ఇరాన్ యుద్ధ సమయంలో నాటో మిత్రదేశాలు తమ వైమానిక స్థావరాలను అమెరికా ఉపయోగించుకోవడానికి అనుమతించలేదు. దీంతో అప్పటినుండీ అమెరికా–నాటో మిత్రదేశాలమధ్య విభేదాలు ప్రారంభమయ్యాయి. తమ ఆర్థిక వ్యవస్థలను పణంగా పెట్టి యుద్ధంలో చేరలేమని, తమ భద్రతకు ముప్పు కలిగించే నిర్ణయాలు తీసుకోలేమని బ్రిటన్ సహా పలు దేశాలు స్పష్టంగా చెప్పడంతో యుద్ధంలో ట్రంప్ ఒంటరి పోరాటం చేశారు. యూరప్‌లో వలసలు, దానిపై అనుసరిస్తున్న విధానం,స్త్రీ పురుష సమానత్వంపై విధానాలను కూడా ఆయన విమర్శించారు. ఇకమీదట యూరప్‌లో మిత్రదేశాలపై ఎవరు దాడి చేసినాగానీ అమెరికా నుండి సహాయం లభించదని, ఒక యుద్ధ నౌక,యుద్ధ విమానం తాము ఇవ్వబోమని కొద్దివారాల క్రితం అమెరికా నుండి ప్రకటన వెలువడిన తర్వాత హెగ్సెత్ ఈ విమర్శలు చేశారు. కానీ హెగ్సెత్ విమర్శలకు భిన్నంగా యూరప్ చర్యలున్నాయి. యూరప్ ఈనాడు రక్షణపై ఎక్కువ ఖర్చుపెడుతోంది. కెనడా కూడా భారీ ఎత్తున రక్షణ బడ్జెట్ పెంచింది. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే గురువారం మాట్లాడుతూ, గత ఏడాది యూరప్ రక్షణ రంగంపై 90 బిలియన్ డాలర్లకు పైగా ఖర్చు పెట్టిందన్నారు.

# మాస్కో పరిసర ప్రాంతాలపై ఉక్రేన్ భారీ దాడులు

**రిఫైనరీ, షాపింగ్ మంటల్లో దగ్ధం : ఒకరు మృతి**

**విమానాశ్రయాలు మూసివేత**

**200 లక్ష్యాలను దెబ్బతీసిన డ్రోన్లు**

**1000 డ్రోన్లు, నాలుగు క్రూయిజ్ క్షిపణులను కూల్చేశాం : రష్యా ప్రకటన**

**ఉక్రేన్ తగలబడితే మాస్కో తగలబడుతుంది : జెలెన్స్కీ**



**కీవ్ :** రష్యాపై మొట్టమొదటిసారి ఉక్రేన్ భారీ స్థాయిలో దాడులు చేసింది. రష్యా రాజధాని మాస్కో ఆ పరిసర ప్రాంతాలపై దాడులు జరిగాయి. దీంతో మాస్కోలో విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేశారు. 500 విమానాలను రద్దు చేశారు. మాస్కో పరిసరాలపై దాదాపు 200 డ్రోన్లు దాడులు చేయడంతో ఆ ప్రాంతం దట్టమైన పొగలతో నిండిపోయింది. ఆగ్నేయ మాస్కోలోని కపోత్న్యా జిల్లాలో రిఫైనరీపై ఒక్కనెలలోనే మూడోసారి దాడి జరిగింది. ఈ రిఫైనరీలో మంటలు ఎగసిపడ్డాయి. చమురు నిల్వల మూతలు డజన్లకొదీ మీటర్ల ఎత్తున గాలిలో ఎగిరి పడటం వీడియోల్లో కనిపించింది. పేలుడు ధాటికి మంటలు చెలరేగి ఆకాశం నల్లబడిపోయింది. డ్రోన్ శకలాలు పడి సమీపంలోని ఒక షాపింగ్ మాల్ కూడా మంటల్లో దగ్ధమైంది. ఈ ప్రాంతంలో ఒకరు మరణించగా 17 మంది పౌరులు గాయపడ్డారు. దక్షిణ రోస్టోవ్ ప్రాంతంలో చమురు డిపోపై జరిగిన దాడిలో ఒక వ్యక్తి మరణించాడు. తాము కోరుకున్న లక్ష్యాలను దెబ్బతీశాయని ఉక్రేన్ ప్రకటించింది. మరోసారి మాస్కోపై తాము దాడి చేశామని జెలెన్స్కీ ప్రకటించారు. ఇక ఈ యుద్ధాన్ని ముగించాల్సిన సమయం వచ్చింది, దౌత్యపరంగా రష్యా అవసరమైన ముగింపు చర్యలు తీసుకోవాలి అని ఆయన అన్నారు. ఉక్రేన్ తగలబడితే మాస్కో కూడా మంటల్లో తగలబడుతుందని హెచ్చరించారు. అదేవిధంగా రష్యా కూడా ఈ భారీ దాడుల చర్యను ధృవీకరించింది. గడచిన 24 గంటల్లో ఉక్రేన్‌కు చెందిన 1000 డ్రోన్లు నాలుగు క్రూయిజ్ క్షిపణులను కూల్చివేశామని రష్యా రక్షణశాఖ ప్రకటించింది.ఫ్రాన్స్‌లో మంగళ, బుధవారాలలో జరిగిన జి–7 సదస్సులో యూరప్‌కు చెందిన సభ్యదేశాలు ట్రంప్ సమక్షంలో ఉక్రేన్–రష్యా యుద్ధం గురించి చర్చించాయి. సభ్యదేశాలుగా ఉక్రేన్‌కు పూర్తి అండదండలు ఇస్తామని ప్రకటించాయి. రెండు దేశాల యుద్ధాన్ని నివారించేందుకు శాంతి చర్చలపై దృష్టిసారిస్తానని ట్రంప్ ప్రకటించారు. ఈ పరిణామాలలో యూరప్ దేశాలను జెలెన్స్కీకి గట్టి భరోసా లభించిన మరునాడే ఈ దాడులు జరిగాయి. 2022 ఫిబ్రవరిలో ఉక్రేన్‌పై రష్యా పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించిన తర్వాత ఇప్పటివరకూ ఉక్రేన్ తలెత్తి ఈ స్థాయిలో రష్యాపై ఏనాడూ దాడులు చేయలేదు. ఉక్రేన్ ప్రయోగించిన డ్రోన్లు అన్నింటినీ తిప్పికొట్టామని రష్యా సైన్యం ప్రకటించింది. గురువారం తెల్లారకముందే రాత్రికి రాత్రే ఈ దాడులను ఉక్రేన్ పూర్తిచేసింది.

# ఎబోలా సోకిన 26 వేలమంది జాడ గల్లంతు : సిడిసి

**బునియా :** డి.ఆర్.కాంగోలో గతనెల విజృంభించిన ఎబోలా మహమ్మారి క్రమంగా చరిత్రలోనే అత్యంత వినాశకరమైన పరిణామదశకు చేరుకుంటున్నదని ఆఫ్రికా సి.డి.సి డైరెక్టర్ జనరల్ జీన్ కసేయా హెచ్చరించారు. కాంగోలో వ్యాధి సోకిన 26,000 మంది ఆచూకీ తెలియడంలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కడ ఉన్నారో తెలియక, వారిని గుర్తించడం చాలా కష్టంగా మారిందని, దీనివల్ల అపరిశుభ్రతవల్ల వ్యాధి విస్తరించి తీవ్ర వినాశకర పరిస్థితులు తలెత్తుతాయన్నారు. ఐతే వ్యాధిసోకినవారు,మరణించిన వారి మృతదేహాలను ప్రభుత్వం బంధువులకు అప్పగించకపోవడంతో కాంగోలోఓ ఈ సమస్య తలెత్తింది. ఈ వ్యాధి విస్తరించడంవల్ల పది సంవత్సరాలక్రితం 11,000 మంది మరణించారని, కానీ ఇప్పుడు అంతకంటే ఎక్కువస్థాయిలో ఎబోలా బుండిబుగ్యు వైరస్ ప్రాణాంతకంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ఆఫ్రికా నాయకులు,అంతర్జాతీయ దాతలతో ఆయన దృశ్యమాధ్యమ విధానంలో సమావేశమయ్యారు. ఈ వ్యాధిని త్వరగా అరికట్టకపోతే పశ్చిమ ఆఫ్రికా,తూర్పు డిఆర్‌సిలలో గతకాలపు పరిస్థితిని మించిపోతుందన్నారు. కాగా ఈ వ్యాధి కాంగోలో ఇంకా గరిష్ఠస్థాయికి చేరుకోలేదని రెడ్‌క్రాస్ అధికారి వ్యాఖ్యానించారు. ఈ వ్యాధిని అరికట్టడానికి ఒక సంవత్సరకాలం పట్టవచ్చని తాము భయపడుతున్నట్లు ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్‌క్రాస్ అండ్ రెడ్ క్రెసెంట్ సొసైటీస్ ఆపరేషన్స్ మేనేజర్ బ్రూనో మిచోన్ అన్నారు. ఈ వ్యాధివల్ల గడచిన 45 రోజుల్లో 196 మంది మరణించారు. మరో 837 కేసులను అధికారికంగా ధృవీకరించారు. వేలాదిమందికి ఈ వ్యాధి సోకిందని అధికారులు అంచనావేస్తున్నారు. కానీ ఈ మూలాలను తెలుసుకోలేకపోతున్నారు. ఈ వ్యాధి బయట పడటానికి కనీసం 15 రోజులు ఎదురుచూడాలి. ఆ తర్వాతగానీ వ్యాధి లక్షణాలు బయటపడవు. విపరీతమైన తలనొప్పి,కడుపునొప్పి,వాంతులు,విరోచనాలు, తీవ్రమైన జ్వరం,ఒళ్ళునొప్పుడు వంటివన్నీ దీని సంకేతాలు. ఈ బుండిబుగ్యు వైరస్‌కు ఇప్పటివరకూ కాంగోలో ఒక అధికారికంగా గుర్తింపు పొందిన టీకా మందు లేదు. అంతర్జాతీయ సంస్థలు ఈ వ్యాధి సోకిన దేశాలకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ద్వారా సహాయం చేస్తున్నాయి. మొదట కాంగోలోని ఇటూరీ ప్రాంతంలో ఈ వ్యాధి ప్రారంభమైంది. పొరుగున ఉగాండాకు కూడా ఈ వ్యాధి విస్తరించింది.

# ఎంఒయు సందడి

(మొదటి పేజీ తరువాయి)

''ఇస్లామాబాద్ ఎంఓయు''పై ఎలక్ట్రానిక్ పద్ధతిలో అమెరికా–ఇరాన్ అధ్యక్షుల మధ్య సంతకాలు జరిగాయని గురువారం తెల్లవారుజామున షరీఫ్ ప్రకటించారు. ఆయన కూడా ఇస్లామాబాద్‌లో ఈ ఎంఓయుపై సంతకం చేశారు. దీనికి సంబంధించిన చిత్రాలను కూడా షరీఫ్ సోషల్ మీడియా ద్వారా షేర్ చేశారు. గడచిన ఆదివారం ఈ ఎంఓయుపై జె.డి.వాన్స్‌తోపాటు ఇరాన్ తరపున చర్చల్లో ప్రధాన అనుసంధానకర్త మహ్మద్ భాఘేర్ ఘాలిబాఫ్ సంతకాలు చేయగా ఆ తర్వాత ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ సంతకం చేశారు. ఆ తర్వాత బుధవారం వెర్సైల్స్‌లో ఫ్రాన్స్ అధ్యక్షుడితో విందు సందర్భంగా ట్రంప్ ఈ ఎంఓయుపై సంతకం చేశారు. జెనీవాలో శుక్రవారం లాంఛనపూర్వక ఒప్పంద సమావేశం జరుగుతుందని, ఈ సమావేశంలో మరోసారి సంతకాలు చేసే ప్రక్రియ లేదని షరీఫ్ పేర్కొన్నారు. డోనాల్డ్ ట్రంప్–మసూద్ పెజెష్కియన్ (ఇరాన్ అధ్యక్షుడు) మధ్య ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారా సంతకాల ప్రక్రియ పూర్తయిందని, మధ్యవర్తిగా తానుకూడా ఈ ఒప్పందాన్ని ఆమోదించానని చెప్పారు. ఆయా ప్రభుత్వాల ఉన్నతస్థాయి నాయకులు ఈ ఒప్పందంపై సంతకాలు చేయడం దౌత్యపరమైన పరిష్కారానికి రెండు దేశాలకూ ఉన్న నిబద్ధతను, చిత్తశుద్ధిని తెలియజేస్తుందని పేర్కొన్నారు. ఈ ఒప్పందం తక్షణం అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. ఇరుదేశాలకు ఆయన అభినందనలు తెలియజేశారు.

ఈ పోస్టింగ్‌లో తొలుత పేర్కొన్న ''సిగ్నేచర్ సెర్మనీ'' అనే పదాన్ని షెహబాజ్ షరీఫ్ తొలగించారు. అదేవిధంగా ఈ ఒప్పందంలో పాకిస్థాన్‌తోపాటు మరో కీలక మధ్యవర్తిగా ఉన్న ఖతర్ విదేశీమంత్రిత్వశాఖ ఒక ప్రకటన చేస్తూ, ఈ ఒప్పందం తదుపరి చర్చలకు పటిష్టమైన పునాదిగా ఉపయోగపడుతుందని పేర్కొంది. ఇదిలా ఉండగా ఈ చర్చలో ఇరాన్ తరపున ప్రధాన అనుసంధాన కర్తగా వ్యవహరించిన ఆ దేశ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ భాఘేర్ ఘాలిబాఫ్ వ్యాఖ్యానిస్తూ, ఈ ఒప్పందాన్ని అమెరికా వైఫల్యాల చిట్టా గా అభివర్ణించారు.

ఈ ఒప్పందానికి ఇరాన్ చిత్తశుద్ధితో కట్టుబడి ఉండాలని, అప్పుడే అవసరమైన అన్ని ప్రయోజనాలు లభిస్తాయని ట్రంప్ మరోసారి హెచ్చరించారు. ఇక ఇజ్రాయెల్‌పై అణుదాడి జరగదని నెతన్యాహూకు తాను చెప్పానని అన్నారు. ఇరాన్‌తో కుదిరిన ఒప్పందం చూసి ఇజ్రాయెల్ ఎంతో సంతోషించాలని, ఇకవారిపై అణుదాడి జరగదని వెర్సైల్స్‌లో పాత్రికేయులకు చెప్పారు. మరోవైపు ఈ ఒప్పందంలో ఎలాంటి పాత్రా లేకుండా ఏకాకిగా మారిపోయిన ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూపై ఆ దేశంలో తీవ్ర విమర్శలు,అసంతృప్తి పెరిగిపోతున్నది. ఈ దశలో అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ఒక ప్రకటన చేస్తూ, ఈ ఒప్పందంలో ఇజ్రాయెల్ కూడా భాగస్వామిగా చేరుతుందని ఆశాభావంతో ఉన్నామన్నారు. అదేసమయంలో ఇజ్రాయెల్ ఒక ప్రకటన చేస్తూ, లెబనాన్‌లో 10 కి.మీ లోపలకు చొచ్చుకువెళ్ళిన తమ బలగాలు అక్కడ ఏర్పాటు చేసుకున్న భద్రతా జోన్ల వద్దనే పనిచేస్తున్నాయని, హెజ్బొల్లా ఎలాంటి దాడులు చేసినా ఎదుర్కొంటామని స్పష్టం చేసింది. కాగా గురువారం దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో ముగ్గురు మరణించారు.

కఫర్ టెబ్నిట్ పట్టణంలో ఒక కారుపై జరిపిన దాడిలో ఇద్దరు మరణించగా, జెబ్దిన్ పట్టణంపై దాడిలో మరొకరుమరణించారు.

**ఒప్పందంలో ఉన్న 14 అంశాలివే**

1.అన్ని రంగాలలో సంఘర్షణ ముగింపు.

పశ్చిమాసియా అంతటా, గల్ఫ్‌లో, లెబనాన్ సహా ఇతర ప్రాంతాలలో అమెరికా–ఇరాన్‌తో పాటు వారి మిత్రులందరూ యుద్ధ దాడులను తక్షణం, శాశ్వతంగా నిలిపివేస్తారు. ఈ ఒప్పందం ప్రకారం ఇరు పక్షాలలో ఏ ఒక్కరూ యుద్ధ దాడులు ప్రారంభించరు, బెదిరింపులకు పాల్పడరు. తుదిఒప్పందం ఈ సంఘర్షణ శాశ్వత ముగింపునకు దారితీస్తుందని ఎంఓయు పేర్కొంది.

2.అమెరికా–ఇరాన్ దేశాలు ఈ ఒప్పందం ద్వారా తమ తమ దేశాల సార్వభౌమాధికారాలను, ప్రాదేశిక సమగ్రతలను గౌరవించుకుంటూ మెలగుతాయి.

3.హోర్ముజ్ జలసంధిని వాణిజ్య నౌకల రాకపోకలకు వీలుగా తెరచినందుకు ప్రతిగా ఇరాన్ ఓడరేవులపై విధించిన దిగ్బంధనాన్ని అమెరికా 30 రోజుల వ్యవధిలో ఎత్తివేస్తుంది. దీంతో పూర్వస్థాయిలో ఇరాన్ నౌకల రాకపోకలు ఉంటాయి. అంటే నెలరోజుల్లో ఇరాన్ సమీపం నుండి అమెరికా బలగాలు వైదొలగి వెళ్ళిపోతాయి.

4.తుది ఒప్పందం చేసుకోవడానికి 60 రోజులపాటు రెండు దేశాలు చర్చలు కొనసాగిస్తాయి. అవసరానికి అనుగుణంగా పరస్పర అంగీకారంతో ఈ చర్చల గడువు పొడిగించే అవకాశం ఉంటుంది.ఎంఓయుపై సంతకాలు చేసిన వెంటనే 60 రోజులకు సంబంధించిన గడియారం ముల్లు–స్టాప్‌వాచ్–కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుంది.

5.శుక్రవారం జెనీవాలో ఒప్పందంపై నాయకుల మధ్య కార్యక్రమం ముగిసిన వెంటనే హోర్ముజ్ జలసంధిని ఇరాన్ తెరుస్తుంది. హోర్ముజ్ జలసంధిలో 60 రోజుల పాటు వాణిజ్య నౌకలు ఎలాంటి సుంకాలు చెల్లించకుండా స్వేచ్ఛగా రాకపోకలు సాగించడానికి వీలుగా ఇరాన్ పూర్తి భద్రత,రక్షణ సమకూరుస్తుంది.

6.ఇరాన్ పునర్నిర్మాణానికి వీలుగా గల్ఫ్ దేశాలలోని మిత్రదేశాలతో కలిసి అమెరికా 300 బిలియన్ డాలర్లు (224 బిలియన్ పౌండ్లు) నిధులు సేకరిస్తుంది. ఐతే ఇందులో అమెరికా తన వాటా సొమ్మును మాత్రం సమకూర్చదు.(గల్ఫ్‌లోని కార్పొరేట్ శక్తుల సహాయంతో ఇప్పటికే ఈ నిధుల్లో 150 బిలియన్ డాలర్ల మేరకు సేకరణ ప్రక్రియ కూడా పూర్తయింది.)60 రోజుల్లో తుది ఒప్పందం కుదరగానే ఇరాన్ ఆర్థిక అంశాలకు సంబంధించిన అనుమతులు,లైసెన్సులు, రద్దు చేయాల్సినవి ఉంటే రద్దులూ అన్నీ జరుగుతాయి. ఇరాన్ ప్రవర్తన సక్రమంగా ఉంటే అమెరికా ఆశీర్వాదాలతో ఎమిరటస్ ఇరాన్‌లో విద్యుత్ ప్లాంటు నిర్మిస్తారు.

7.ఇరాన్‌పై ఏకపక్షంగా ఎవరి ప్రమేయం లేకుండా అమెరికా అమలు చేస్తున్న ఆంక్షలను తొలగిస్తుంది. భద్రతామండలి, అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఎఇఎ) సహా అంతర్జాతీయంగా వివిధ సంస్థలు అమలు చేస్తున్న ఆంక్షలను తొలగించేందుకు అమెరికా బాధ్యత వహించి సంపూర్ణ చర్యలు తీసుకుంటుంది.దీనికి సంబంధించిన కాలపరిమితిపై స్పష్టత లేదు.

8.ఇరాన్ అణ్వస్త్రాలను అభివృద్ధి చేయకూడదు. అణ్వస్త్రాలను తయారు చేయడం లేదా మరోచోట నుండి కొనుగోలు చేయడం వంటి చర్యలు చేపట్టకూడదు. ఇందుకు ఇరాన్ కూడా అంగీకారం తెలియజేసింది. అదేవిధంగా ఇరాన్ అభివృద్ధి చేసిన అత్యంత నాణ్యమైన శుద్ధిచేసిన యురేనియంపై రెండు దేశాలు పరస్పర అంగీకారంతో ఉమ్మడి చర్యలు తీసుకుంటాయి. ఈ యురేనియం ద్వారా అణుబాంబు తయారు చేయడానికి వీలులేకుండా దీని నాణ్యతను నీరుగారుస్తారు. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఎఇఎ) పర్యవేక్షణలో అత్యంత సాధారణస్థితికి ఈ యురేనియం నాణ్యతను దిగజారుస్తారు. దీనిని ఎందుకూ కొరగాకుండా చేసేందుకు ఇరు దేశాలు నిర్ణయం తీసుకుంటాయి. ఈ విధంగా అణుపదార్థాన్ని నీరుగార్చడం (సాధారణ ప్రామాణికత) అమెరికాకు ఒక పెద్ద విజయంగా వైట్ హౌస్ సీనియర్ అధికారి పేర్కొన్నారు. ఈ ఏడాది ఆరంభంలో ఎపిక్‌ఫ్యూరీని ప్రారంభించడానికి గల కారణం ఇరాన్ వద్ద 99.9 శాతం మేరకు అణ్వాయుధం, సంబంధిత పదార్థం లేకుండా చేయడమేనని, ఈ విషయంలో విజయం సాధించామని ట్రంప్ అన్నారు.

9–10. వీటి ప్రకారం అత్యంత నాణ్యతతో తయారుచేసిన యురేనియంపై ఒక నిర్ణయం తీసుకునేవరకూ రెండు దేశాలు యథాతథస్థితిని పాటిస్తాయి. అణుకార్యక్రమం విషయంలో ఇరాన్ తన యథాతథ స్థితిని పాటించాలి. అంటే ఇరాన్‌పై అమెరికా కొత్తగా ఎలాంటి ఆంక్షలు విధించదు. ఈ లోపు పెట్రోలు, చమురు ఎగుమతులకు, ఇతర బ్యాంకింగ్ లావాదేవీలకు అనుమతులు మంజూరు చేస్తుంది.

11.అమెరికా స్తంభింపజేసిన ఆస్తులు. ఈ విషయం చర్చల్లో అతిపెద్ద అడ్డంకిగా ఉంది. ప్రాథమిక ఒప్పందంపై సంతకాలు జరిగిన తర్వాత తదుపరి చర్చల ప్రక్రియలో దీనిపై ఒప్పందాలు కుదురుతాయి. అమెరికా అధికారుల సమాచారం ప్రకారం దాదాపు 12 బిలియన్ డాలర్ల మేరకు కొన్ని ఆస్తులను అమెరికా విడుదల చేస్తుంది.

12.13.14 అంశాలలో పర్యవేక్షణ, తుది ఒప్పందం గురించిన నిబంధనలు ఉన్నాయి. ఈ ఒప్పందం ఎలా ముందుకు తీసుకువెళ్ళాలనే విషయంపై కార్యనిర్వహణా విధానాలను పొందుపరిచారు.అవగాహన ఒప్పందం అమలు, భవిష్యత్ ఒప్పంద పర్యవేక్షణ, ఆచరణలకు అమెరికా–ఇరాన్ దేశాలు ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తాయి.

# ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పాఠశాల విద్యాశాఖ పరిధిలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థల్లో (డిఐఇటి) ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టుల భర్తీకి టిజిపిఎస్‌సి గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 86 డైట్ లెక్చరర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో సీనియర్ లెక్చరర్ పోస్టులు 23, లెక్చరర్ పోస్టులు 63 ఉన్నాయి. ఈ పోస్టులకు జూన్ 24 నుంచి జూలై 29 వరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 2026 జులై 1 నాటికి కనీసం 18 ఏళ్ల నుంచి గరిష్ఠ వయ పరిమితిని 44 ఏళ్లు ఉన్న వారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా తెలిపింది. మరిన్ని పూర్తి వివరాలను వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించిది.

# వడగాడ్పులు..వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

మార్పు ఉండకపోయినప్పటికీ, ఆ తర్వాత మూడు రోజుల పాటు ఉష్ణోగ్రతలు క్రమంగా 2 నుండి 3 డిగ్రీల వరకు తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. శుక్రవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

**ఉత్తర తెలంగాణలో వడగాలుల హెచ్చరిక :** ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అక్కడక్కడ వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు చెప్పారు. శుక్ర, శనివారం కూడా ఈ జిల్లాలతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో వడగాలుల పరిస్థితులు కొనసాగే అవకాశముందన్నారు.

**ఉరుములు, మెరుపులతో వర్షాలు :** శుక్ర, శనివారం పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచడంతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. అదే సమయంలో ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. శనివారం నుంచి వచ్చే గురువారం వరకు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్– మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని చెప్పారు.

# అమలు ఇంకెప్పుడు?

(మొదటి పేజీ తరువాయి)

వారిలో అత్యధికులు బలహీనవర్గాల వారే ఉన్నారు. ఇందులో 47.2 శాతం(బిసిలు), 26.9 శాతం (ఎస్‌సి)లు, 13.9శాతం (ఎస్‌టి)లు. భూమి లేకపోవడం, చాలా తక్కువ భూమి ఉన్న నిరుపేదలు భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బిఆర్‌ఎస్ 'రైతు బంధు' కాంగ్రెస్ 'రైతు భరోసా' పథకాలను అమలు చేయడం మరోవైపు రాష్ట్రంలో కౌలు ధరలు ఎకరాకు సగటున రూ.14,000 కాగా, గరిష్టంగా రూ.53,000 వరకు చేరినట్లు సర్వే స్పష్టం చేస్తోంది. దీంతో కౌలు రైతులకు కౌలు భారంగా మారడం, మరోవైపు సాగు ఖర్చులు కూడా విపరీతంగా పెరగడం, నికర ఆదాయం తగ్గిపోతుండటంతో పాటు ప్రభుత్వం నుంచి ఏలాంటి సహాయం అందకపోవడంతో కౌలు రైతులు అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు.

**యాప్‌తో కౌలు రైతులకు యూరియా తిప్పలు :** ఎరువులకు సంబంధించి గత రబీ సీజన్‌లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సరికొత్త 'యాప్‌ఆధారిత' విధానం వల్ల కౌలు రైతులకు శాపంగా మారింది. ఈ యాప్‌లో భూ యజమాని ఫోన్‌కు వచ్చే ఒటిపి తప్పనిసరి చేయడంతో, కౌలు రైతులకు సబ్సిడీ యూరియా లభించని పరిస్థితి ఏర్పడింది. దీంతో సర్వే వివరాల ప్రకారం 1,816 మందిలో కేవలం 412 మంది (22.8 శాతం) మాత్రమే సబ్సిడీ యూరియా పొందగలిగారు. మిగిలిన వారంతా బ్లాక్ మార్కెట్‌లో రూ.260 బస్తాను రూ.500 లకు కొనాల్సి వచ్చినట్లు స్పష్టమైంది.

**సొంతంగా పంటను అమ్ముకోలేని కౌలు రైతులు :** మరోవైపు ప్రభుత్వ కొనుగోలు యాప్‌ల నిబంధనల (పట్టాదారు పాస్‌బుక్, బయోమెట్రిక్ లేదా ఒటిపి)వల్ల కౌలు రైతులు తమ పంటను అమ్ముకోలేకపోతున్నారు. పత్తి పండించిన 1,137 మందిలో కేవలం 6.7శాతం (77 మంది) మాత్రమే తమ సొంత పేరుతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కి అమ్ముకోగలిగారు. వరి పండించిన వారిలో ఖరీఫ్‌లో 20శాతం, రబీలో 17.2శాతం మంది మాత్రమే నేరుగా ప్రభుత్వానికి అమ్ముకున్నారు. మిగతా వారు దళారులను ఆశ్రయించి, లేదా భూయజమానులకు రూ. 10,000 వరకు భారీ కమీషన్లు ఇచ్చుకోవాల్సి వచ్చినట్లు నివేదిక వెల్లడించింది. దీంతో కౌలు రైతులు మద్దతు ధర అందక భారీగా ఆర్థిక నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది.

**కౌలు రైతుకు దక్కని పంట నష్ట పరిహారం :** ప్రకృతి వైపరీత్యాల (వరదలు, వడగండ్ల వానలు) వల్ల 85.2 శాతం మంది కౌలు రైతులు తీవ్ర పంట నష్టాన్ని చవిచూశారు. నష్టపోయిన 1,573 మందిలో కేవలం 11 మంది (0.7శాతం)మందికి మాత్రమే వారి సొంత అకౌంట్లలో నష్టపరిహారం జమైంది. 116 మందికి మాత్రమే కౌలు రైతుల పేరిట నమోదు కాగా, 45 కేసుల్లో భూయజమానులకు పరిహారం అందినా వారు కౌలు రైతులకు ఇవ్వవనట్లు నివేదిక వెల్లడించింది.

**బ్యాంకు రుణాలకు కౌలు రైతు దూరం :** భూయజమానులకు సున్నా వడ్డీకే రుణాలు లభిస్తుంటే, భూములను సాగు చేస్తున్న కౌలు రైతులకు మాత్రం బ్యాంకులు పైసా రుణం కూడా ఇవ్వడం లేదు. ఫలితంగా 24శాతం నుంచి 36 శాతం వరకు భారీ వడ్డీలకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తెస్తున్నారు. ఒక్కొక్కరికి సగటున రూ.2 లక్షల నుండి రూ.10లక్షల వరకు ప్రైవేట్ అప్పులు ఉన్నాయి. కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించపోవడంతో రుణమాఫీ పథకం వర్తించకపోవడంతో కౌలు రైతులు అప్పుల ఊబిలోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో 2011 చట్టం ప్రకారం ప్రతి సంవత్సరం ప్రారంభంలోనే కౌలు రైతులకు గుర్తింపు కార్డులను (రుణ అర్హత కార్డులు) వెంటనే జారీ చేయడం.

ఈ కార్డు ద్వారానే అన్ని ప్రభుత్వ పథకాలు, మద్దతు ధరలు లభించేలా చేయడం,కౌలు రైతు గుర్తింపు కార్డుల ఆధారంగా, ఈ-క్రాప్ బుకింగ్‌తో ప్రారంభించి, అన్ని రకాల పథకాలకు మరియు పంటలకు ఒకే విధమైన పారదర్శక విధానాన్ని తీసుకురావాలి. ఈ కార్డును కౌలు రైతు బ్యాంకు ఖాతాకు, పంట రుణాలకు అనుసంధానిస్తే తప్ప కౌలు రైతులకు మేలు జరగదని సర్వే స్పష్టం చేస్తోంది.

# 30 నుంచి రైతు భరోసా

(మొదటి పేజీ తరువాయి)

ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్‌లో ఉత్పత్తి అవుతున్న యూరియాలో అధిక భాగాన్ని తెలంగాణ రైతులకు కేటాయించాలని మంత్రుల సమావేశం డిమాండ్ చేసిందన్నారు. ఉత్పత్తి అవుతున్న ఎరువులను రాష్ట్ర రైతులకు అందించడం ద్వారా రవాణా వ్యయాలు తగ్గడంతో పాటు వ్యవసాయ సీజన్‌లోఎరువుల కొరతను నివారించవచ్చన్నారు.

**వ్యవసాయ శాఖ సూచనలమేరకే విత్తనాలు వేయాలి**

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండటం, మధ్య మధ్యలో పొడి వాతావరణ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు తొలి వర్షాలు పడగానే విత్తనాలు వేయడానికి తొందరపడవద్దని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సూచించారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి, నేలలో తగినంత తేమ ఏర్పడినతర్వాత మాత్రమే విత్తనాలువేయాలన్నారు. సాధారణంగా మొలకెత్తడానికి, పంట ప్రారంభ వృద్ధికి కనీసం 7మిల్లీమీటర్ల చొప్పున రెండు దఫాల వర్షపాతం అవసరమవుతుందని పేర్కొంది. వర్షాలు పడగానే తొందరపడి విత్తనాలు వేస్తే, అనంతరం పొడి వాతావరణం ఏర్పడిన పక్షంలో పంట నష్టపోయే ప్రమాదం హెచ్చరించారు.

**ఎంజిఎన్‌ఆర్‌ఈజిఎస్ మార్పులపై అధ్యయనానికి మంత్రివర్గ ఉపసంఘం**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్‌ఆర్‌ఈజిఎస్)లో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మార్పుల ప్రభావాన్ని అధ్యయనం చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చెప్పారు. ఈ ఉపసంఘంలో మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, ధనసరి అనసూయ సీతక్క సభ్యులుగా ఉంటారని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న పరిణామాలను అధ్యయనం చేసి, తెలంగాణపై పడే ఆర్థిక భారం ఎంత ఉంటుందో అంచనా వేసి, రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై సిఫారసులు చేయనుందని తెలిపారు. ఉపసంఘం అన్ని వర్గాల అభిప్రాయాలను సేకరించి త్వరలోనే నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణకు అవసరమైన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు తెలిపారు. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సి) ద్వారా ప్రతిపాదించిన రుణానికి ఆమోదం తెలపాలని కేంద్రాన్ని కోరనున్నట్లు చెప్పారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, బిజెపి ఎంపిలు కూడా హైదరాబాద్ ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఈ ప్రాజెక్టుకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించడానికి, ప్రజల రవాణా అవసరాలను తీర్చడానికి మెట్రో విస్తరణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. రాష్ట్రంలో పండించిన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మంత్రివర్గ సమావేశం కేంద్రానికి విజ్ఞప్తి చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో రైతులు ఈ ఏడాది దేశంలోనే రికార్డు స్థాయిలో అత్యధిక ధాన్యం పండించారని, గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సీజన్‌లో ప్రభుత్వం రికార్డు స్థాయిలో ఇప్పటికే దాదాపు 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే కేంద్ర ప్రభుత్వం తెలంగాణ నుంచి తక్కువ ధాన్యాన్ని సేకరించటంపై మంత్రుల సమావేశం ఆందోళన వ్యక్తం చేసిందన్నారు. కేంద్రం నిర్ణయించిన విధి విధానాల ప్రకారం రాష్ట్రంలో పంట ఉత్పత్తులను కొనుగోలు చేయటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా రైతులకు ఇబ్బంది లేకుండా పంట ఉత్పత్తుల కొనుగోలుకు కేంద్రం నిర్దేశించిన కోటాను అనుసరించాలని భావించినట్టు మంత్రి తెలిపారు.

**కేంద్ర కొనుగోలు విధానంపై ఆందోళన**

తెలంగాణలో పండుతున్న పంటలను కేంద్ర సంస్థలు తగిన స్థాయిలో కొనుగోలు చేయకపోవడంపై మంత్రివర్గ సమావేశం ఆందోళన వ్యక్తం చేసిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం భారీ స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయడమే కాకుండా, సుమారు 15 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కూడా కొనుగోలు చేసినప్పటికీ, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) వ్యవస్థలో కేంద్ర సంస్థలు ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు చేయడం లేదని పేర్కొన్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ) ద్వారా ధాన్యం, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ద్వారా పత్తి, నాఫెడ్ ద్వారా ఇతర పంటలను కొనుగోలు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వం తన రాజ్యాంగ, విధానపరమైన బాధ్యతలను నిర్వర్తించాలని మంత్రి డిమాండ్ చేశారు. పంటల కొనుగోలు అంశంపై కేంద్ర ప్రభుత్వ దృష్టిని ఆకర్షించేందుకు తెలంగాణకు చెందిన మంత్రులు, ఎంపిలు త్వరలోనే న్యూఢిల్లీకి వెళ్లి కేంద్రాన్ని కలవనున్నట్లు తెలిపారు. దేశ ఆహార ధాన్య నిల్వలకు తెలంగాణ ప్రధాన సహకార రాష్ట్రంగా అవతరించిందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులను రైతుల బ్యాంకు ఖాతాల్లో 48 గంటల వ్యవధిలోనే నేరుగా జమ చేయడం ద్వారా పారదర్శకతను, రైతుల ఆర్థిక భద్రతను ప్రభుత్వం నిర్ధారించిందన్నారు. తాజా కొనుగోలు సీజన్‌లోనే సుమారు రూ.18,000 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ప్రస్తుత వ్యవసాయ చక్రంలో మొత్తం దాదాపు రూ.39,000 కోట్ల వరకు రైతులకు చెల్లింపులు జరిగాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర ఏళ్ల కాలంలో కొనుగోలు కార్యకలాపాల ద్వారా రైతులకు దాదాపు రూ.1 లక్ష కోట్లకు పైగా చెల్లింపులు జరిగాయని, ఇదే సమయంలో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో సుమారు రూ.1.30 లక్షల కోట్లు చెల్లించబడినట్లు వివరించారు.

**నీట్ విద్యార్థులకు ఉచిత ప్రయాణం**

రానున్న నీట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి) బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం ప్రకటించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.95 లక్షల మంది విద్యార్థులు 2,008 కేంద్రాల్లో పరీక్ష రాయనున్నట్లు అంచనా వేశామన్నారు. హాల్ టికెట్ చూపించిన విద్యార్థులకు ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, వారి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించడమే ఈ నిర్ణయ లక్ష్యమని చెప్పారు.

# నిలిచిన 'నైరుతి'

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాల వారీ వర్షపాత లోటు పటం ప్రకారం, మధ్య భారతదేశం, తూర్పు, ఈశాన్య భారత దేశం, దక్షిణ ద్వీపకల్పం, వాయువ్య భారతదేశంలో వర్షపాత లోటు వరుసగా 67 శాతం, 42 శాతం, 22 శాతం, 6 శాతంగా ఉంది. గత కొన్ని రోజులుగా నైరుతి రుతుపవనాలు మహారాష్ట్రలోని మిగిలిన ప్రాంతాలకు ముందుకు సాగలేకపోవడానికి అనుకూలమైన భారీ వాతావరణ పరిస్థితులు లేకపోవడమే కీలక కారణమని వాతావరణ శాఖ గురువారం తెలిపింది. రుతుపవనాల ఉత్తరాది పురోగతి మందగించడానికి ఐదు ప్రధాన కారణాలు ఉన్నాయి. మొదటగా... ప్రస్తుత రుతుపవన ప్రవాహంలో అరేబియా సముద్రం నుండి బలమైన ఉప్పెన లేదు. 'సాధారణంగా ఇటువంటి ఉప్పెనలే తేమ అధికంగా భూమిలోకి ప్రవేశించడానికి, విస్తృత వర్షపాతానికి కారణమవుతాయి, ఇది రుతుపవనాలు మరింత ముందుకు సాగడానికి దారితీస్తుంది' అని వాతావరణ శాఖ తెలిపింది. రెండవది... రుతుపవన ప్రసరణతో సంబంధం ఉన్న అల్పస్థాయి నైరుతి గాలులు అరేబియా సముద్రంపై బలహీనపడ్డాయి. దీనివల్ల మహారాష్ట్ర తీరం, లోతట్టు ప్రాంతాలకు తేమ రవాణా తగ్గింది. మూడవది... నైరుతి రుతుపవనాలకు తేమ మూలంగా పనిచేసే పశ్చిమ హిందూ మహాసముద్రం, అరేబియా సముద్రం మీదుగా వీచే భూమధ్యరేఖను దాటే ప్రవాహం ఇటీవలి కాలంలో బలహీనపడిందని, దీని ఫలితంగా రుతుపవన కార్యకలాపాలు తగ్గాయని ఐఎండి తెలిపింది. నాల్గవది... అరేబియా సముద్రం, బంగాళాఖాతంపై అల్పపీడన ప్రాంతాలు లేదా తుఫాను ప్రసరణలు, లేదా రుతుపవనాల పురోగతికి దోహదపడే పశ్చిమ తీరం వెంబడి తగినంత తీవ్రత కలిగిన తీరప్రాంత ద్రోణి (విశాల ప్రాంతానికి విస్తరించి ఉన్న అల్పపీడన పట్టీ) వంటి రుతుపవన వాతావరణ వ్యవస్థలు ప్రస్తుతానికి లేవు. చివరి అంశం.. మ్యాడెన్‌జూలియన్ ఆసిలేషన్ (ఎంజెఒ) బలహీన దశ. ఇది భూమధ్యరేఖ చుట్టూ పరిభ్రమిస్తూ వర్షాన్ని కురిపించే గాలి, మేఘాలు, పీడనంతో కూడిన ఒక చలన వ్యవస్థ. ఇది చురుకైన దశలో ఉన్నప్పుడు, దక్షిణ భారతదేశానికి మరిన్ని మేఘాలను తీసుకువస్తుంది. దీని ఫలితంగా, రాబోయే 45 రోజులలో మహారాష్ట్రలోని చాలా ప్రాంతాలలో వర్షపాతం అక్కడక్కడా మాత్రమే కురిసే అవకాశం ఉందని, భారత వాతావరణ శాఖ తెలిపింది.

# కాస్త ముందుగానే ఐపిఎల్ – 2027



వేసవిలో క్రీడా వినోదం పంచే ఇండియన్ ప్రీమియర్ లీగ్ విషయంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక నిర్ణయానికి సిద్ధమవుతోంది. ప్రతి సీజన్‌ను మార్చి నెలాఖరులో ప్రారంభించే బీసీసిఐ.. 2027 ఎడిషన్ విషయంలో ముందు చూపుతో వ్యవహరించాలనుకుంటోంది. సీజన్ మధ్యలో మండు టెండలు, అకాల వర్షాలతో తలెత్తుతున్న ఇబ్బందులకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో ఐపిఎల్ 2027ను కాస్త ముందుగానే జరపాలని భావిస్తోంది. ఈ విషయమై ఐపిఎల్ వచ్చే సీజన్ షెడ్యూల్‌పై గురువారం బిసిసిఐ సెక్రటరీ దేవజిత్ సైకియా హింట్ ఇచ్చేశాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2027ను ముందుగానే మొదలెట్టాని బిసిసిఐ భావిస్తోంది. సెక్రటరీ దేవజిత్ సైకియా ఇదే అంశంపై మాట్లాడుతూ.. 'ఈ ఏడాది ఐపిఎల్ మార్చి 29(28)వ తేదీన ప్రారంభమైంది. అయితే.. మే రెండో వారం టోర్నీ సమయంలో వర్షాలు పడుతున్నాయి. ముందుస్తు వానల కారణంగా టోర్నీకి అంతరాయం కలుగుతోంది. అలానే ఎండ తీవ్రతకు ఆటగాళ్లు, అభిమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని బిసిసిఐ, ఐపిఎల్ కార్యనిర్వాహణ మండలి కీలక ఆలోచన చేస్తోంది. ఐపిఎల్ 2027ను మార్చి నెలాఖరున కాకుండా ముందుగానే జరపాలని భావిస్తున్నాం. మార్చి 10 నుంచి మార్చి 15 మధ్య సీజన్‌ను ఆరంభించే అవకాశముంది' అని దేవజిత్ సైకియా వెల్లడించాడు. అంతేకాదు షెడ్యూల్ ముందుకు జరిపాలని అభిమానుల నుంచి అభ్యర్థనలు వస్తున్నాయి. దాంతో, మే 15 కల్లా టోర్నీని ముగించాలని భావిస్తున్నట్టు బిసిసిఐ కార్యదర్శి పేర్కొన్నాడు. నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కారణంగా ఐపిఎల్ 19వ సీజన్ కాస్త ఆలస్యమైన విషయం తెలిసిందే.

## కాంగోతో పోర్చుగల్ మ్యాచ్ డ్రా నిరాశపరిచిన రోనాల్డో

ఫిఫా వరల్ కప్ 2026 గ్రూప్–కె ఓపెనింగ్ మ్యాచ్‌లో బలమైన పోర్చుగల్ జట్టుకు ఊహించని షాక్ తగిలింది. టెక్సాస్లోని హియూస్టన్ వేదికగా డీఆర్ కాంగోతో జరిగిన ఈ మ్యాచ్ 1–1 తో డ్రాగా ముగిసింది. వరల్ కప్‌లో కాంగో జట్టుకు ఇదే మొట్టమొదటి పాయింట్ కావడం విశేషం. మ్యాచ్ ప్రారంభమైన 6వ నిమిషంలోనే పోర్చుగల్ యువ ఆటగాడు జోవావ్ నెవెస్ పెడ్రో నెటో అందించిన అద్భుతమైన క్రాస్ను హెడర్ ద్వారా గోల్‌గా మలిచి పోర్చుగల్‌కు 1–0 ఆధిక్యాన్ని అందించాడు. అయితే తొలి సగం ముగిసే సమయానికి కాంగో ఆటగాడు యోవాన్ విస్సా లభించిన అవకాశాన్ని చక్కగా ఉపయోగించుకుని హెడర్ ద్వారా గోల్ చేసి స్కోరును 1–1 తో సమం చేశాడు. దీంతో వరల్డ్ కప్ చరిత్రలో కాంగోకి తొలి గోల్ నమోదు అయ్యింది. ఇక తన కెరీర్‌లో రికార్డు స్థాయిలో 6వ వరల్డ్ కప్ ఆడుతున్న పోర్చుగల్ స్టార్ స్ట్రైకర్ క్రిస్టియానో రోనాల్డో ఈ మ్యాచ్‌లో తీవ్రంగా నిరాశపరిచాడు. రోనాల్డో ఈ మ్యాచ్‌లో కేవలం 29 టచ్‌లు మాత్రమే సాధించాడు. అతని వరల్డ్ కప్ కెరీర్లోనే ఒక మ్యాచ్‌లో అత్యంత తక్కువగా ఇన్వాల్వ్ అయిన సందర్భాలలో ఇది ఒకటి. మ్యాచ్ సెకండ్ హాఫ్‌లో రోనాల్డోకు రెండు సులువైన గోల్స్ చేసే అవకాశాలు వచ్చినప్పటికీ, వాటిని అతడు గోల్‌గా మలచలేకపోయాడు. కాంగో డిఫెన్స్ అతడిని విజయవంతంగా కట్టడి చేసింది. ఇక పోర్చుగల్ జట్టు తదుపరి మ్యాచ్‌లో ఉజ్బెకిస్తాన్తో తలపడనుంది.





## భారత్ అదుర్స్.. నెదర్లాండ్స్‌పై భారీ విజయం

లీడ్స్‌లో జరుగుతున్న మహిళల టి–20 ప్రపంచకప్ తొలి పోరులో దాయాది పాకిస్థాన్ భరతం పట్టిన భారత్ మలి మ్యాచ్‌లో చిన్న జట్టు నెదర్లాండ్స్‌ను చిత్తుగా ఓడించింది. బుధవారం లీడ్స్‌లో ఏకపక్షంగా సాగిన లీగ్ పోరులో 95 పరుగుల తేడాతో భారత్ భారీ విజయం సాధించింది. ఓపెనర్లు స్మృతి మంధాన(47 బంతుల్లో 74), షెఫాలీ వర్మ (55) అర్ధసెంచరీలతో తొలుత భారత్ 20 ఓవర్లలో 209/5 స్కోరు చేసింది. ఈ టోర్నీలో భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. మంధాన, షెఫాలీ తొలి వికెట్కు 115 పరుగులు జోడించగా, రీచా ఘోష్(8 బంతుల్లో 20 నాటౌట్) ధనాధన్ ఆటతీరుతో భారత్ 200 మార్క్ అందుకుంది. లక్ష్యఛేదనలో తెలుగు స్పిన్నర్ శ్రీచరణి(4/19) ధాటికి డచ్ టీమ్ 17.3 ఓవర్లలో 114 పరుగులకు ఆలౌటైంది. చరణికి తోడు షెఫాలీ(3/20), నందినిశర్మ(2/22) దెబ్బకు నెదర్లాండ్స్ కెప్టెన్ డీ లీడె(28), హీథర్ సీజర్స్(21) మినహా అందరూ స్వల్ప స్కోర్లకు పెవిలియన్ చేరారు. మంధానకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

## పోటీ కోసం జీకే

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

# వారణాసి క్షేత్రం ఏ రాష్ట్రంలో ఉంది?

- ఐఆర్ఎన్ఎస్ఎస్ 1 డి ఉపగ్రహాన్ని ఇస్రో ఏ రోజున విజయవంతంగా ప్రయోగించింది?
  2015 మార్చి 28
- ఇమాగో దీని జీవిత చరిత్రలో ఉంటుంది
  ఈగ
- ప్రజాపంపిణీ నిర్వహణకు పౌర సరఫరాల కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సంవత్సరం
  1974
- దక్షిణ రొడీషియా యొక్క నూతన నామము
  కెన్యా
- జామకాయలలో లభించే విటమిన్ ఏది?
  విటమిన్ 'C'
- పారాదీప్ ఓడరేవు ఏ రాష్ట్రానికి చెందినది?
  ఒడిశా
- ప్రవాహ విద్యుత్ శాస్త్రం ఎవరి ప్రయోగంతో అభివృద్ధి చెందడం మొదలైంది?
  వోల్టా
- రష్యాలో బోల్షివిక్ విప్లవం జరిగిన సంవత్సరం ఏది?
  1917
- రాతినార ఉత్పత్తికి పేర్గాంచిన జిల్లా ఏది?
  కడప
- హైదరాలీ వీరిని ఓడించాడు.
  మహారాష్ట్రులు, నిజాం నవాబు
- 1990 నుండి 2000 శతాబ్దాన్ని దేని యుగంగా పరిగణిస్తారు?
  మెదడు యుగము
- దక్షిణ, పశ్చిమ యూరప్‌లో పండే ప్రధాన పంట
  గోధుమ
- అడవులు ఎక్కువగా ఉన్న రాష్ట్రం
  మధ్యప్రదేశ్
- పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు ఉద్దేశించబడినది
  పుర
- డాస్ కాపిటల్ గ్రంథ రచయిత :
  కారల్ మార్క్స్
- ఆకుల ద్వారా శాఖీయ ప్రత్యుత్పత్తి ఈ మొక్కలలో జరుగుతుంది?
  రణపాల ఆకు
- ఎలక్ట్రిక్ హీటర్ లో వేడిచెందేది.
  నిక్రోమ్
- 'ది లాస్ట్ జడ్జిమెంట్' చిత్రకారుడు
  మైకేలాంజిలో
- SITRA అనగా
  గ్రామీణ ప్రాంతాలలోని చేతివృత్తిదారులకు ఆధునిక పనిముట్ల సరఫరా
- అభ్రకమును వేటిని తయారుచేయుటకు ఎక్కువగా వాడతారు?
  విద్యుత్ పరికరాలు
- పిల్లలని తమ పొట్టకు అంటిపెట్టుకునేది
  ఆడ ప్లాటిపస్
- డాల్ఫిన్ నోస్ కొండలవల్ల రక్షణ పొందుతున్న ఓడరేవు
  విశాఖపట్టణం రేవు
- హిందువుల ప్రముఖ పుణ్యక్షేత్రమగు వారణాసి ఏ రాష్ట్రంలో ఉంది?
  ఉత్తరప్రదేశ్
- చర్మాన్ని గూర్చి తెలియజేసే శాస్త్రం?
  డెర్మటాలజీ
- 2011 సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి ఏ సంవత్సరంగా ప్రకటించినది
  అంతర్జాతీయ రసాయన శాస్త్ర సంవత్సరం
- న్యూక్లియర్ పవర్ జనరేషన్ మీద ఏ దేశంలో నిషేధం ఉంది
  ఆస్ట్రేలియా
- అన్న యోజన' ఎప్పుడు ప్రారంభించబడింది 2000 డిసెంబర్ 5న
- మొదటిసారిగా స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగిన సంవత్సరం
  1884
- గుప్తులకాలంనాటి రాతి ఆలయం ఎక్కడ ఉంది?
  సారనాథ్
- ఎలక్ట్రిక్ బల్బ్ కనుగొన్నది ఎవరు?
  థామస్ ఆల్వా ఎడిసన్
- మొలాసిస్ లో చక్కర శాతము
  50 శాతము
- ప్రపంచ ప్రఖ్యాత గ్రీకు విజేత
  అలెగ్జాండర్
- TRYSEM అనగా
  గ్రామీణ యువకుల స్వయం ఉపాధిలో శిక్షణ
- బెంగాల్ నవాబు
  ఆలీవర్ధిఖాన్
- ఆల్కహాలు కెలోరిఫిక్ విలువ
  27
- కలకత్తా రేవు వెనుక భూమిలో ఏ పంట అధికంగా పండుతుంది?
  జనుము
- అపారదర్శక పదార్థం :
  రబ్బరు
- పొడవుకు M.K.S ప్రమాణము
  మీటర్
- గ్రీకు నగర రాజ్యాలలో ఒకటి
  స్పార్టా
- అభ్రకం ఉత్పత్తిలో ప్రపంచంలో ప్రథమ స్థానంలో ఉన్న దేశం
  భారతదేశం
- ఎట్నా అగ్నిపర్వతం గల ప్రాంతం
  సిసిలీ
- ఎలక్ట్రిసిటీ అను పదం ఎవరి ప్రయోగంతో బయటకు వచ్చింది?
  థేల్స్
- 'సంపూర్ణ గ్రామీణ రోజ్ గార్ యోజన' ఎప్పుడు ప్రారంభించబడింది?
  2001
- చిరుకప్ప వేటితో శ్వాసిస్తుంది?
  ఊపిరితిత్తులు
- మూసీనది దీనిగుండా ప్రవహించును
  హైదరాబాద్
- పిల్లలు నిద్రించవలసిన గంటలు
  8
- షియోవాంగ్లి నిర్మాణం
  చైనా గోడ
- 'కాసినో' లకు ప్రసిద్ధి చెందినది
  మొనాకో
- చిట్టడవులలో పెరిగే వృక్షజాతి
  రేగు



## అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులను ప్రజలకు చేరువ చేసేందుకే 'ముఖాముఖీ'

ఎమ్మెల్యే కూనంనేని
ప్రజలతో ముఖాముఖీ
కార్యక్రమానికి అపూర్వ స్పందన






**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు అధికార యంత్రాంగాన్ని, ప్రజాప్రతినిధులను ప్రజలకు చేరువ చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. 'మన కోసం–మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా గురువారం పాల్వంచ మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో ప్రజలలో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. ప్రజలు పెద్దఎత్తున పాల్గొని తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. అక్కడే ఉన్న అధికారులు వాటిని తక్షణమే పరిష్కరించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ అధికారులను ప్రజల చెంతకు చేర్చేందుకు తాము ముఖాముఖీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. దీని ద్వారా ప్రజా సమస్యలు నేరుగా తెలుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. మౌలిక వసతుల కల్పనతోనే బస్తీలు, గ్రామాలు సమగ్రాభివృద్ధి చెందుతాయని, ఆ దిశగా నియోజకవర్గ వ్యాప్తంగా మౌలిక సదుపాయాలు కొరత లేకుండా చూసేందుకు నిరంతరం పర్యవేక్షిస్తామని భరోసా ఇచ్చారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని, ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో నిజమైన లబ్ధిదారులకు చేరినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని, ప్రజలు ఆశలు నెరవేరుతాయన్నారు. ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా దర్బార్ తరహాలో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కూనంనేని కోరారు. కార్యక్రమంలో సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితకుమారి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, తహసీల్దార్ దారా ప్రసాద్, ఇన్‌చార్జ్ కమిషనర్ విజయానంద్, ఎలక్ట్రికల్ ఎడిఇ అబ్దుల్ రెహమాన్, ఎస్ఐ తోట నాగరాజు, అబ్కారీ సిఐ ప్రసాద్, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, నామా కీర్తి, గొర్లె అన్నపూర్ణ, చెరుకు భాగ్యలక్ష్మి, కాల్వ భాస్కర్, దున్నపోతుల మణి, వి.భవిత, దంతబోయిన నరేష్, వి.పద్మజ, డి.సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, శెనగారపు శ్రీనివాసరావు, ఎఎస్ఎ రెహమాన్, వైఎస్.గిరి, గౌస్‌పాషా, మస్తాన్, అహ్మద్ జానీ, కరీం, గొర్లె నరేష్, నామ పండు, ఆలపాటి ప్రసాద్, అల్లి వెంకటేశ్వర్లుతో పాటు వివిధ శాఖల అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పాఠశాలల్లో అల్పాహారం పథకాన్ని.. 'ఎండిఎం' వర్కర్లకే ఇవ్వాలి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి
ఓమయ్య డిమాండ్

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** పాఠశాల విద్యార్థులకు అల్పాహారాన్ని, మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు ఇచ్చే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకొని, మధ్యాహ్న భోజన కార్మికులకే అప్పగించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య డిమాండ్ చేశారు. గురువారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో ఎండిఎం కార్మికుల జిల్లా సమితి సమావేశాన్ని జిల్లా కార్యదర్శి చక్రపాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో ఓమయ్య మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకానికి విద్యార్థులకు సరిపడా బడ్జెట్ కేటాయించకుండా, బిల్లులు ప్రతి నెలా చెల్లించకుండా కార్మికులకు అప్పుల పాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వాలకు విద్యార్థుల పట్ల, విద్య పట్ల చిత్తశుద్ధి ఉంటే విద్యార్థుల మెను చార్జీలు మార్కెట్లో ధరలకు అనుగుణంగా పెంచి ప్రతినెల చెల్లిస్తే కార్మికులు నాణ్యమైన భోజనం అందిస్తారన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్ర, హరే రామ హరేకృష్ణ సంస్థలకు ఇవ్వాలని ప్రభుత్వం చూస్తుందన్నారు. అల్పాహారాన్ని, మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు ఇచ్చే ఆలోచనను ప్రభుత్వం ఉపసంహరించుకొని మధ్యాహ్న భోజన కార్మికులకు అప్పగించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి తోపునూరు చక్రపాణి, యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు సాయమ్మ, గంగామణి, సబిత, వీరేశం, గంగాధర్, సాయమ్మ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.




## విబి–జి రామ్ జి చట్టాన్ని రద్దుచేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి
బొల్గూరి నర్సింహ్మా డిమాండ్

**ప్రజాపక్షం/చండూరు :** కొత్తగా తీసుకొచ్చిన విబి–జి రామ్ జి చట్టాన్ని రద్దు చేసి పాత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చటాఇ్టన్ని అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్గూరి నర్సింహ్మా డిమాండ్ చేశారు. గురువారం చండూరులోని సిపిఐ కార్యాలయం మాదగోని నర్సింహ్మ భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో బొల్గూరి నర్సింహ్మా మాట్లాడారు. ఉపాధి హామీ చట్టంతో పాటు అటవీ హక్కుల చట్టం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) పిలుపు మేరకు విబిజి రాం జీ చట్టాన్ని రద్దు చేసి జాతీయ ఉపాధి హామీ పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు ఎండి జానీమియా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ ఊషయ్య, సంఘం నాయకులు ఇరిగి సంజీవ, పల్లపు పెంటయ్య, దోటి భిక్షం తదితరులు పాల్గొన్నారు.




## కార్మిక చట్టాలు ఎత్తేసే కుట్రలో కేంద్రం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు
ఎం.బాల నరసింహ్మా




**ప్రజాపక్షం/నాగర్ కర్నూల్ :** కార్మిక చట్టాలను ఎత్తేసే కుట్రలో కేంద్రం ఉందని, కార్మిక హక్కులను కాపాడుకునేందుకు కార్మిక లోకం పోరాటాలకు సిద్ధమవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ్మా, ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహులు పిలుపునిచ్చారు. గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మణాచారి భవన్, ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా నరసింహ్మా, బాల నరసింహులు హాజరై మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లు తీసుకువచ్చి కార్మికులకు తీవ్ర అన్యాయాన్ని మిగిలిస్తుందన్నారు. కార్మిక చట్టాలను పూర్తిగా తీసేసి కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 1925 అక్టోబర్ 31న ఆవిర్భవించిన ఎఐటియుసి పొత్తిలోనే ఎన్నో ఎన్నో కష్టాలను ఎన్నో ప్రాణ త్యాగాలను చేసిందన్నారు. ఎఐటియుసి కార్మిక సంఘినికి నేటికి 106 సంవత్సరాలు నిండినప్పటికి ఆనాటి నుండి నేటి వరకు కార్మికులు, కర్షకులు అసంఘటిత రంగాల కార్మికుల కోసం ఎన్నో పోరాటాలు ఉద్యమాలు చేస్తుందన్నారు. ఎన్నో హక్కులను చట్టాలను సాధించిన చరిత్ర ఎఐటియుసికే దక్కిందన్నారు. నేడు కేంద్రంలో బిజెపి ఎన్‌డిఎ ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కార్మికుల పొట్ట కొడుతూ బడా పారిశ్రామికవేత్తల కడుపులు నింపడానికి కార్మిక చట్టాలను రద్దు చేస్తుందన్నారు. ఉపాధి హామీ కూలీలకు అన్యాయం చేసేందుకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేస్తుందన్నారు. ఇప్పటికైనా కార్మిక లోకం ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించి కార్మిక 44 కార్మిక చట్టాలను సాధించుకోవాలని బాలనరసింహ్మా, నరసింహులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్, ఎఐటియుసి కార్యవర్గ సభ్యులు హెచ్64 జన్కో రామయ్య, వెంకటస్వామి, శ్రీనివాసులు, కోశాధికారి పి.రవీందర్, కల్వకోలు కృష్ణ, సువర్ణ, మొగిల్ల శ్రీను, బండి లక్ష్మి పతి, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## హక్కుల సాధనకు పోరాటాలు

మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి మనోహర్

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ప్రభుత్వ వైద్యరంగంలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న వైద్య సిబ్బంది రక్షణ సామాజిక భద్రత కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే అని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి మైఖేల్ మనోహర్ అన్నారు. ఎఐటియుసి అనుబంధం తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ( టిజిఎంఇయు) 12వ వ్యవస్థాపక దినోత్సవాలను పురస్కరించుకొని గురువారం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో కార్మిక జెండాను ఉమ్మడి జిల్లా కార్యదర్శి మైఖేల్ మనోహర్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఉద్యోగుల హక్కుల సాధనకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న రెండో పిఆర్సి తక్షణమే అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేసి కార్పొరేషన్ ద్వారా నేరుగా ప్రభుత్వమే వేతనాలు అందించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందించాలని, కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపర్‌డెంట్ డాక్టర్ శివరామ్, విష్ణు, యశోదబాయి, టిజిఎంఇయు కల్వకుర్తి బ్రాంచి అధ్యక్షులు భారతి, రహీమ్, కోశాధికారి శ్రీకాంత్, రమేష్, శిరోమణి, సిపిఐ నాయకుడు పులిజాల పరశురాములు తదితరులు పాల్గొన్నారు.



## కేంద్రానికి రాష్ట్రాలు ఉమ్మడిగా నిరసన వ్యక్తం చేయాలి

- 'విబిజి రామ్‌జీ' అమలుపై ఇతర రాష్ట్రాలతో చర్చించాలి
- ఉమ్మడి కార్యాచరణ రూపొందించాలి
- జార్ఖండ్ మంత్రి దీపికా పాండేతో మంత్రి సీతక్క చర్చ



ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం 'విబిజి రామ్‌జీ పథకం' అమలు చేయనున్న నేపథ్యంలో గ్రామీణపేదలు, కార్మికులకు కలుగుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇతర రాష్ట్రాలతోనూ చర్చించి ఉమ్మడి కార్యాచరణను రూపొందించాల్సిన అవసరం ఉన్నదని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జార్ఖండ్ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దీపికా పాండే సింగ్ అభి ప్రాయపడ్డారు. గ్రామీణ పేదల హక్కులు, ఉపాధి అవకాశాల పరిరక్షణ కోసం అవసరమైతే కేంద్ర ప్రభుత్వానికి ఉమ్మడిగా నిరసన తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. విబిజి రామ్‌జీ పథకాన్ని కేంద్ర ప్ర భుత్వం జూలై 1వ తేదీ నుంచి అమలు చేయాలని ప్రతిపాదిస్తున్న నేపథ్యంలో తలెత్తుతున్న అంశాలు, పేదలకు ఎదురయ్యే ఇబ్బందుల విషయ మై రాష్ట్ర అనసూయ సీతక్క గురువారం జార్ఖండ్ మంత్రి దీపికా పాండే సింగ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. 'విబిజి రామ్‌జీ పథకం' అమలు వల్ల గ్రామీ ణ ప్రాంతాల్లోని పేదలు, కార్మికులు, ఉపాధి హామీ పథకంపై ఆధారపడిన కుటుంబాలు ఎదుర్కొనే ఇబ్బందులపై ఈ సందర్భంగా వారు విస్తృతంగా చర్చించారు. ఈ పథకం వల్ల నష్టపోయే అవకాశం ఉన్న వర్గాల ఆందోళనలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ పథకంలోని పలు నిబంధనలపై రాష్ట్రాలకు ఉన్న అభ్యంతరాలను సమగ్రంగా సేకరించి కేంద్రానికి తెలియజేయాలని,గ్రామీణ పేదల ప్రయోజనాలకు భంగం కలగకుండా తగిన మార్పులు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని మంత్రు లు సీతక్క, దీపికా పాండే అభిప్రాయపడ్డారు. రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా పథకాన్ని అమలు చేయడం సముచితం కాదన్నారు.

# కార్మికుల హక్కుల కోసం ఎఐటియుసి ఉద్యమం

- ఎఐటియుసి రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం చీఫ్ ప్యాట్రన్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి
- కరపత్రం ఆవిష్కరణ



ప్రజాపక్షం/కరీంనగర్ :దేశంలోని అన్ని రంగాల కార్మికులకు అండగా నిలుస్తూ, కార్మిక వర్గ శ్రేయస్సు కోసం, వారి వేతనాల పెంపు హక్కు లు, చట్టాలను కాపాడేందుకు నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తుంది ఎఐటియుసి అని, ఎఐటి యుసి రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం చీఫ్ ప్యాట్రన్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఎఐటియుసి రాష్ట్ర మహాసభల విజయవంతం కోసం కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల ఎఐటియుసి ఆఫీస్ బేరర్స్, దాని అనుబంధ సంఘాల ముఖ్య నేతల సమావేశం ఆహ్వాన సంఘం అధ్యక్షుడు పంజాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఎఐటియుసి, సిపిఐ రాష్ట్ర నాయకులు వి.ఎస్.బోస్, కలవేణి శంకర్, ఎస్.బాల రాజు, పంజాల శ్రీనివాస్, టి.శ్రీనివాస్, సమ్మ య్యతో కలిసి మహాసభల కరపత్రంను చాడ వెంకటరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ భారతదేశ కార్మిక సంఘాలలో మొట్టమొదటి కార్మిక సంఘంగా ఎఐటియుసి ఉందని, కార్మిక వర్గాన్ని, ఉద్యోగ వర్గాన్ని ఐక్యం చేసి, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నదని, సంఘటిత అసంఘటిత రంగాలకు చెందిన కార్మిక వర్గానికి ఆశాజ్యోతిగా నిలిచిందని శ్రమకు తగ్గ ఫలితం కావాలని, పని గంటలు తగ్గించాలని, వేతనాలు పెంచాలని, కనీస వేతనాల కోసం నాటి నుంచి నేటి వరకు అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించి ఎంతో మంది కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపి అనేక చట్టాలు తీసుకువచ్చిన కార్మిక సంఘమని చట్టాలు, హక్కులను కూడా కాపాడిన సంఘం ఎఐటియుసి అన్నారు. ఎన్నో ఏళ్లుగా కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను, చివరికి సమ్మె చేసే హక్కునుకూ డా కాలరాయడానికి బిజెపి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తుందని, కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల, కర్షకుల వ్యతిరేకిగా కేంద్ర ప్రభుత్వం ఉందని, ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను సంస్కరణల పేరుతో రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లుగా చేసి ప్రధాని మోడీ కార్మికులకు తీరని అన్యాయం చేశాడని వెంకటరెడ్డి విమర్శించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పద్మనాయక కళ్యాణ మండపంలో సెప్టెంబర్ 6,7,8 తేదీలలో జరిగే తెలంగాణ రాష్ట్ర ఎఐటియుసి నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలని, అందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మిక వర్గం, నాయకత్వం పనిచేయాలని ఎఐటియుసి రాష్ట్ర ఇంచార్జీ, ప్రధాన కార్యదర్శి వి.ఎస్.బోస్, ఎస్.బాల రాజు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మహాసభల ప్యాట్రన్ కలవేన శంకర్,ఆహ్వాన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్, టి.శీనివాస్ సమ్మయ్య, కోశాధికారి కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, సిపిఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, ఎఐటియుసి పెద్దపల్లి, జగిత్యాల , రాజన్న సిరిసిల్ల జిల్లాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కదారి సునీల్, ఏం.డి. ముక్రం, సుతారి రాములు, అజ్జ వేణు, కదారి రాములు, ఆహ్వాన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుబీమాపై బిఆర్ఎస్ అసత్య ప్రచారం

రూ.1,359 కోట్ల ప్రీమియం చెల్లించాం: మంత్రి తుమ్మల



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో రైతుబీమా పథకాన్ని నిలిపివేసినట్లు బిఆర్ఎస్ చేస్తున్న ప్రచారాలు పూర్తిగా అసత్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మ ల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత రెండున్నరేళ్ల కాలంలో మొత్తం రూ.66,038 రైతు కుటుంబాలకు రూ. 3,301.90 కోట్ల బీమా సొమ్మును అందించినట్లు ఆయన తెలిపారు. 2025–26 సంవత్సరానికి గానూ పథకంలో నమోదైన 42.16 లక్షల మంది రైతుల కు వర్తించేలా, ఎల్ఐసికి చెల్లించాల్సిన వార్షిక ప్రీమియం రూ. 1,359.56 కోట్లను ప్రభుత్వం ఇప్పటికే పూర్తిగా చెల్లించిందని మంత్రి వెల్లడించారు.గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ యాంత్రీకరణ, సబ్సిడీ విత్తనాలు వంటి పథకాలను నిలిపివేసి రైతులను ఇబ్బంది పెట్టారని విమర్శించారు. తమ ప్రభుత్వం పాత పథకాలను పునరుద్ధరిస్తూ రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నాలు మానుకోవాలని ఆయన బిఆర్ఎస్ నేతలకు హితవు పలికారు.

## పెన్నా సిమెంట్ యాజమాన్యంతో ఎఐటియుసి కార్మిక ఒప్పందం



ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్‌లోని రీజనల్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) కార్యాలయంలో పెన్నా సిమెంట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి), పెన్నా సిమెంట్ యాజమాన్యంతో గురువారం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. కన్సిలేషన్ ఆఫీసర్ జె. శరవణన్ సమక్షంలో జరిగిన ఈ చర్చల్లో కార్మికుల డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్, యూనియన్ ప్రధాన కార్యదర్శి దశరథ్ గౌడ్ తెలిపారు. ఇందులో ప్రధానంగా కార్మికులకు బోనస్, గ్రాట్యుటీ చెల్లింపు, నెలకు 26 రోజుల పని దినాల కల్పన, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం కనీస వేతనాల అమలు, సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్, సేఫ్టీ షూస్, సేఫ్టీ ఎక్విప్‌మెంట్స్ పంపిణీ, కార్మికులకు నూనె, బెల్లం, టీ సౌకర్యంతో పాటు ఎర్న్డ్ లీవ్స్ మంజూరుతదితర అంశాలకు సంబంధించి ఒప్పందం జరిగిందని ఎఐటియుసి నేతలు తెలిపారు. ఈ ఒప్పందం పట్ల పెన్నా సిమెంట్ కార్మికులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేసినట్లు వారు వెల్లడించారు. ఈ చర్చలలో మేనేజ్‌మెంట్ తరఫున ప్లాంట్ హెచ్.ఆర్. మంజునాథ, ఉమామహేశ్వర రావు, మల్లికార్జున్, జావేద్ పాల్గొనగా.. యూనియన్ తరఫున రాజేశ్వర్ రెడ్డి, పాండు, రబ్బాని, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలోని మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. 'ఉర్దూ అకాడమీ' గోల్డెన్ జూబ్లీ(స్వర్ణోత్సవాల) పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ఎల్.బి స్టేడియంలో, అన్ని జిల్లా కేంద్రాల్లో ఉర్దూ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా పెద్ద ఎత్తున 'ముషాయిరా' (కవి సమ్మేళనాలు) నిర్వహించనున్నామని వెల్లడించారు. దీనికి సంబంధించి తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 'మైనార్టీల సంక్షేమం, వివిధ అభివృద్ధి పనుల పురోగతి'పై డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అన్ని రకాల ఆధునిక హంగులు, వసతులతో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామని, ప్రస్తుతం 20 రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని, మరో 17 పాఠశాలలు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. అసంపూర్తిగా మిగిలిన మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల భవనాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్ణీత కాలపరిమితిలోపు పనులు పూర్తయ్యేలా పర్యవేక్షించాలని సూచించారు. మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు ,వారిని ఆర్థికంగా నిలబెట్టడానికి రాజీవ్ యువ వికాసం' పథకం ద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. కాగా హైదరాబాద్ నగరంలో జరగబోయే మొహర్రం వేడుకల సందర్భంగా 9వ రోజున నిర్వహించే ప్రత్యేక కార్యక్రమానికి హాజరుకావాలని భట్టి విక్రమార్కను రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ ఆహ్వానించారు.

### వక్ఫ్,ఇతర భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షణ చర్యలు..

వక్ఫ్,ఇతర భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు తగిన చట్టపరమైన రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను భట్టి విక్రమార్క ఆదేశించారు. మైనార్టీల స్మశానవాటికల చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకు తక్షణమే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న జిల్లా, డివిజన్ కేంద్రాల్లో స్మశాన వాటికల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను సేకరించి కేటాయించాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ ముఖ్యకార్యదర్శి గౌరవ ఉప్పల్, కార్యదర్శి సిక్తా పట్నాయక్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్, మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్, ప్రెసిడెంట్ ఫహీమ్ ఖురేషీ, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హమ్దాన్, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాను, మైనార్టీ వెల్ఫేర్ సెక్రెటరీ షఫీ ఉల్లా తదితరులు పాల్గొన్నారు.



## రాజకీయ పార్టీ స్థాపన ఆలోచనే లేదు

- మాజీ మావోయిస్టు దేవ్‌జీ • ( సిపిఐ(ఎం) నేతలను కలిసిన మాజీ మావోయిస్టు అగ్రనేతలు

ప్రజాపక్షం/హైదరాబాద్: కొత్తగా రాజకీయ పార్టీ పెట్టే ఆలోచన లేదని, తాము ఏ రాజకీయ పార్టీలో చేరడంలేదని మాజీ మావోయిస్టు నేత దేవ్‌జీ చెప్పారు. ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకించి, తమకు మద్దతుగా నిలిచిన రాజకీయ పార్టీల నాయకులను కలవడంలో భాగంగానే ఇటీవలే సిపిఐ కార్యాలయాన్ని సందర్శించామని, నేడు సిపిఐ(ఎం) నాయకులను కలిశామని తెలిపారు. వారితో కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం 'ఎంబీ భవన్' లో గురువారం సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, పార్టీ నాయకులను మాజీ మావోయిస్టులు దేవ్‌జీ, రాజిరెడ్డి, చంద్రన్న, పద్మక్క, సంజీవ్, బండి ప్రకాశ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో ఎలాంటి రాజకీయ కోణాలు లేవని దేవ్‌జి, జాన్ వెస్లీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలపై సుమారు రెండు గంటలకు పైగా విస్తృతంగా వారు చర్చించారు. సమావేశం అనంతరం జాన్ వెస్లీ మీడియాతో మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న ప్రజాసమస్యలు, పెట్టుబడిదారుల దోపిడీకి వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. మావోయిస్టు పార్టీ నుండి బయటకు వచ్చిన వారు ప్రజా ఉద్యమాల్లో నిలవాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మావోయిస్టులను ఏరివేయడానికి 'ఆపరేషన్ కగార్' పేరుతో నిరంకుశంగా నరమేధాన్ని కొనసాగిస్తోందని విమర్శించారు. వారిపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయాలని, మిగిలిన మావోయిస్టులపై నిర్బంధాన్ని కొనసాగించకుండా సామరస్యపూర్వక చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

## వాతావరణ మార్పులకు పంటల మార్పిడే పరిష్కారం

నాబార్డ్ సలహా కమిటీ



ప్రజాపక్షం/హైదరాబాద్ : వాతావరణ మార్పుల ప్రభావాన్ని తట్టుకునేందుకు పంటల మార్పిడి ద్వారా వ్యవసాయాన్ని వాతావరణ అనుకూలంగా మార్చాలని నాబార్డ్ ప్రాంతీయ సలహా కమిటీ స్పష్టం చేసింది. గురువారం హైదరాబాద్‌లోని నాబార్డ్ తెలంగాణ సిజిఎం బి. ఉదయ్ భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి, బ్యాంకర్లు, ఇక్రిసాట్, వ్యవసాయ వర్సిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాబార్డ్ సిజిఎం ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ, వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు వరి సాగు కోసం 'రైస్360' పైలట్ ప్రాజెక్టును, ప్రకృతి వ్యవసాయం కోసం 'జీవా' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు చిన్న రైతులకు షేడ్‌నెట్ హౌస్‌లు, 'మా తోట' కింద 20 వేల పండ్ల తోటల అభివృద్ధి, సూక్ష్మ సాగునీటి వసతులు, ఆయిల్‌పామ్ విస్తరణకు ఎఫ్‌పిఓలకు మద్దతు అందిస్తున్నట్లు వివరించారు.కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి మాట్లాడుతూ, పంటల మార్పిడిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలన్నారు. కూరగాయల సాగుకు కోతుల బెడద ఎక్కువగా ఉన్నందున సోలార్ ఫెన్సింగ్‌కు సబ్సిడీ ఇవ్వాలని కోరారు. కార్మికుల కొరతను అధిగమించడానికి చిన్న వ్యవసాయ యంత్రాలకు సబ్సిడీతో పాటు కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. క్రాప్ కాలనీలను ప్రోత్సహిస్తూ, నూనెగింజలు, పప్పుధాన్యాల సాగును విస్తరించి, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందిస్తే రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## నేడు గురుకుల విద్యార్థులకు 'విద్యార్థి హక్కుల కిట్ల' పంపిణీ

ప్రజాపక్షం/హైదరాబాద్: విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్యా వాతావరణం, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి చాటిచెబుతూ శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్.బి. స్టేడియంలో 'రాష్ట్ర స్థాయి ప్రత్యేక కార్యక్రమాన్ని' నిర్వహించనుంది. రెసిడెన్షియల్ విద్యాసంస్థల విద్యార్థులకు 'విద్యార్థి హక్కుల కిట్ల'ను పంపిణీ చేయనుంది. విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమం, వసతి సదుపాయాల కల్పనలో భాగంగా 20 రకాల వస్తువులతో ఈ కిట్లను అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా విద్యార్థులతో కలిసి 'మాదకద్రవ్య రహిత పాఠశాలలు ,కళాశాలలు' లక్ష్యంతో సామూహిక ప్రతిజ్ఞ చేయిస్తారు. ఈ ప్రతిజ్ఞ ద్వారా విద్యార్థుల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపైన అవగాహన పెంపొందించనున్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 15 వేల మంది విద్యార్థులు పాల్గొంటారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల సంక్షేమం, మాదకద్రవ్యాల నిర్మూలన, విద్యా రంగ బలోపేతానికి ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవనుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

## వన సంరక్షణలో విశిష్ట సేవలకు ప్రత్యేక పతకాలు, నగదు ప్రోత్సాహకాలు

ప్రజాపక్షం /హైదరాబాద్: అటవీ సంపద పరిరక్షణలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తిస్తున్న అటవీశాఖ సిబ్బందిని ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వనమహోత్సవం2026 ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని 'తెలంగాణ రాష్ట్ర వన సంరక్షణ ప్రతిభా పురస్కార పతక నియమావళి2026'ను అమల్లోకి తీసుకొచ్చింది. ఈ మేరకు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కృషి ఫలించిందని ప్రభుత్వం తెలిపింది. రజత, వెండి, బంగారు పతకాలతో పాటు ముఖ్యమంత్రి వన శౌర్య పతకాన్ని ప్రవేశపెట్టి, అవార్డు గ్రహీతలకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు నగదు బహుమతులు, నెలవారీ ప్రోత్సాహకాలు అందించనున్నట్లు వెల్లడించింది. అటవీ సిబ్బంది సేవలకు గుర్తింపు కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను స్వాగతిస్తున్న ప్రజలు

- ఓర్వలేక విమర్శలు చేస్తున్న బిఆర్ఎస్, బిజెపి • ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ విమర్శలు



ప్రజాపక్షం/హైదరాబాద్: సిఎం రేవంత్ రెడ్డి నిరుపేద కుటుంబాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్య అందించాలనే లక్ష్యం తో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేశారని, ఈ నిర్ణయాన్ని ప్రజలు స్వాగతిస్తుండగా, బిఆర్ఎస్ నేతలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని తెలంగా ణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ అ న్నారు. గాంధీ భవన్‌లో గురువారం ఆయన మీడియా తో మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు తర్వాత బిఆర్ఎస్ రాజకీయంగా ఇబ్బందుల్లో పడిందన్నారు. బిఆర్ఎస్ పాలనలో 'కెజీ టు పిజి' విద్య అం దిస్తామని చెప్పినప్పటికీ, ఆ హామీ అమలు కాలేద ని మె ట్టు సాయి కుమార్ విమర్శించారు. నిరుపేద కుటుంబాలకు నాణ్యమైన విద్య అందించడంలో గత ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది పేద కుటుంబాల పిల్లలకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పిస్తోందన్నారు. నిరుపేద కుటుంబాల ఆశీర్వాదం సిఎం రేవంత్ రెడ్డికి ఉందని, ప్రజల సంక్షేమం కోసం ఆయన పెద్ద అన్నలా పనిచేస్తున్నారని మెట్టు సాయి కుమార్ అన్నారు. బిఆర్ఎస్ నేతలు ఎన్ని ఆరోపణలు చేసినా తెలంగాణ ప్రజలు వాటిని నమ్మరన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు రాష్ట్ర స్థాయి నాయకుడిగా కాకుండా స్థానిక నా యకుడిలా మాట్లాడుతున్నారని విమర్శించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ 100 స్థానాలకుపైగా గెలుస్తుందన్నారు.

# 26 నుంచి 28 వరకు రిజిస్ట్రేషన్‌ల నిలిపివేత!

- సర్వర్ నిర్వహణ పనుల దృష్ట్యా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయం
- ఈనెల 29 నుంచి యథావిధిగా సేవలు
- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజి రాజీవ్ గాంధీ హనుమంతు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో రిజిస్ట్రేషన్‌ల సేవలకు మూడు రోజుల పాటు తాత్కాలిక విరామం కలగనుంది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన వెబ్‌సైట్‌తో పాటు, దానికి అనుబంధంగా ఉన్న అన్ని ఆన్‌లైన్ సేవలు ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు అందుబాటులో ఉండవని ఆ శాఖ ఐజి రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. షెడ్యూల్ చేసిన సర్వర్ నిర్వహణ పనుల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

### ఐదేళ్ల తర్వాత సర్వర్ మెయింటెనెన్స్..

సుమారు ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ సర్వర్ నిర్వహణ పనులను చేపడుతున్నట్లు ఐజి తెలిపారు. సర్వర్ వ్యవస్థలు భవిష్యత్తులో మరింత సజావుగా, వేగంగా పనిచేస్తాయి, సాంకేతిక భద్రతా ప్రమాణాలు మరింత బలోపేతం అవుతాయని, ప్రజలకు అందే సేవల నాణ్యత గణనీయంగా మెరుగుపడుతుందన్నారు. ఈ ప్రయోజనాల దృష్ట్యా సర్వర్‌ల అప్‌గ్రేడేషన్ కోసం ఈ తాత్కాలిక విరామం తప్పనిసరి అయిందని ఆయన చెప్పారు. ఈనెల 26న మొహర్రం పండుగ, ఈనెల 28న ఆదివారం కావడంతో ఎలాగూ ప్రభుత్వ సెలవు దినాలు ఉన్నాయని, మధ్యలో ఉన్న 27వ తేదీన ఒక్కరోజు మాత్రమే ప్రభుత్వ పని దినంలో రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం కలుగుతుందన్నారు. సాధారణ ప్రజలకు తక్కువ అసౌకర్యం కలిగేలానే ఈ షెడ్యూల్‌ను రూపొందించామని రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. ఈ సర్వర్ నిర్వహణ పనుల అనంతరం, ఈనెల 29వ తేదీ నుంచి అన్ని రకాల రిజిస్ట్రేషన్ సేవలు యథావిధిగా పునఃప్రారంభమవుతాయని ఐజి స్పష్టం చేశారు. కావున, ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ రిజిస్ట్రేషన్ సంబంధిత పనులను ముందస్తుగానే ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. శాఖ పరంగా చేపడుతున్న ఈ సాంకేతిక ఆధునికీకరణ పనులకు ప్రజలందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## బిజెపి 'ఓట్ల చోరీ – సీట్ల చోరీ'కి పాల్పడుతోంది

ఎఐసిసి ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ డాక్టర్ బెల్లయ్య నాయక్

ప్రజాపక్షం/హైదరాబాద్: బిజెపి 'ఓట్ల చోరీ సీట్ల చోరీ' కి పాల్పడుతోందని ఎఐసిసి ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ డాక్టర్ బెల్లయ్య నాయక్ తేజావత్ విమర్శించారు. బిజెపి అధికార దుర్వినియోగం, రాజ్యాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా గురువారం గాంధీభవన్‌లో బెల్లయ్య నాయక్ తేజావత్ నేతృత్వంలో చరక సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ నాయకత్వం తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ అభ్యర్థిగా ప్రకటిస్తే, బిజెపి ఒత్తిళ్లకు లొంగి రిటర్నింగ్ అధికారి ఆమె నామినేషన్‌ను అక్రమంగా రద్దు చేశారని బెల్లయ్య నాయక్ ఆరోపించారు. ఈ తప్పును కప్పిపుచ్చుకోవడానికి బిజెపి అనుకూల మీడియా కథనాలను మళ్లించి కాంగ్రెస్ నేతలపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందన్నారు. బిఆర్ఎస్ నేత కెటిఆర్ కనీస అవగాహన లేకుండా సిఎం రేవంత్ రెడ్డి వల్లే మీనాక్షి నటరాజన్ నామినేషన్ రద్దయిందని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. సొంత పార్టీలోని తప్పులను సరిదిద్దుకోలేక, గత పాపాలను కడుక్కోవడం కోసమే ఆయన బిజెపి కనుసన్నల్లో పనిచేయడానికి సిద్ధపడ్డారని ఆరోపించారు.

## 'సర్'పై జర్నలిస్టులకు 22న అవగాహన సదస్సు

తెలంగాణ మీడియా అకాడమీలో ప్రత్యేక కార్యక్రమం
పాల్గొనేవారు 20వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్– సర్) అంశంపై జర్నలిస్టులకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ మీడియా అకాడమీ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ కార్యక్రమం ఈ నెల 22న ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని నాంపల్లి చాపెల్ రోడ్‌లోని మీడియా అకాడమీ ఆడిటోరియంలో జరగనుంది. తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ అధికారుల సహకారంతో నిర్వహించే ఈ సమావేశంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, లక్ష్యాలు, అమలు విధానం, ప్రజల భాగస్వామ్యం, ఓటరు నమోదు, సవరణలు తదితర అంశాలపై సమగ్ర వివరణ ఇవ్వనున్నారు. అలాగే జర్నలిస్టులు తమ సందేహాలను నేరుగా అధికారులను అడిగి నివృత్తి చేసుకునే అవకాశాన్ని కల్పించనున్నారు. కార్యక్రమం మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగనుంది. ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొనదలచిన జర్నలిస్టు లు తమ పేర్లను ఈ నెల 20వ తేదీ మధ్యా హ్నం 1గంటలోపు వాట్సాప్ నెంబర్ 709 3600 77కు పంపి నమోదు చేసుకోవాలని తెలంగాణ మీడియా అకాడమీ కోరింది. కార్యక్రమ నిర్వహణ సౌలభ్యం దృష్ట్యా, నిర్దేశిత గడువులోపు పేర్లు నమోదు చేసుకున్న జర్నలిస్టులకు మాత్రమే పాల్గొనే అవకాశం కల్పించనున్నట్లు అకాడమీ వెల్లడించింది.



## నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

**ప్రజాపక్షం/తుంగతుర్తి** : రైతులను నమ్మించి నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు నమోదు చేస్తామని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ఎంఎస్ఏపి ద్వారా రైతులకు కందులు, పెసర, జీలుగు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుకాలం కష్టపడి పండిస్తేనే మనందరి కడుపు నిండుతాయని వారిని మోసం చేస్తే క్షమించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. గ్రామాల్లో రైతులకు నకిలీ విత్తనాలు లేకుండా సంబంధిత ఏఓ, ఏఈఓలు చొరవ చూపాలని, లేని యెడల శాఖాపరంగా చర్యలు తప్పవన్నారు. నియోజక వర్గ పరిధిలోని నూతనకల్‌లో ఓ వ్యక్తి 20 బ్యాగులు నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిసి తక్షణమే ఫోన్‌లో పోలీసు శాఖను చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణ పరిస్థితులు సరిగా లేనందున, పంట మార్పిడి విధానం ద్వారా పంటలు పండించుకోవాలని కోరారు. గత సంవత్సరం ఆయా మండలాల్లో ఎన్ని టన్నుల యూరియా కొనుగోలు చేశారో అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు రమేష్‌బాబు, రైతు కమీషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, పిఏసిఎస్ ఛైర్మన్ గుడిపాటి సైదులు, పాలెపు చంద్రశేఖర్, నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, మార్కెట్ వైస్ ఛైర్మన్ చింతకుంట్ల వెంకన్న, అనిల్ పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్యం

జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఆయన జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో హెచ్‌వోడీలతో సమీక్ష నిర్వహించారు. ప్రతి వైద్యుడు విధులకు ప్రతి రోజు ఉదయం 10 గంటలలోపు వైద్యులు,సిబ్బంది హాజరు వివరాలను తనకు నివేదిక రూపంలో పంపించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా హాజరు పట్టికను పరిశీలించిన కలెక్టర్, వివిధ విభాగాల హెచ్‌వోడీలను ఆయా విభాగాల్లో చికిత్స పొందుతున్న రోగుల సంఖ్య,అందుతున్న వైద్య సేవలు,ప్రత్యేక కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గైనకాలజీ, జనరల్ మెడిసిన్ తదితర విభాగాల పనితీరును సమీక్షించారు. ఆసుపత్రిలో అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలపై ఆరా తీసిన కలెక్టర్, అవసరమైన పరికరాలను సిఎస్ఆర్ నిధుల ద్వారా సమకూర్చుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే పీహెచ్‌సీలు,సబ్ సెంటర్లకు అవసరమైన నిధులు కేటాయించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రతి వైద్యుడు బాధ్యతతో పనిచేయాలని అన్నారు. సమావేశంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ,ప్రభుత్వ డాక్టర్లు, డాక్టర్ నగేష్,వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

## న్యాయవాదులందరికీ హెల్త్ కార్డులు

ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి వెంకట్ రెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/రామన్నపేట** : తెలంగాణ రాష్ట్రంలోని అన్ని నమోదు చేసుకున్న న్యాయవాదులకు మెడికల్ ఇన్సూరెన్స్ హెల్త్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ( ఐలు ) ఆధ్వర్యంలో జూన్ 20న హైదరాబాద్లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని గురువారం రామన్నపేట బార్ అసోసియేషన్ హాల్లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.డి.మజీద్, కార్యదర్శి యాదాసు యాదయ్య కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకటరెడ్డి మాట్లాడుతూ 2019 తర్వాత నమోదు చేసుకున్న వేలాది మంది న్యాయవాదులు ఇప్పటికీ హెల్త్ కార్డుల ప్రయోజనాలకు దూరంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 20న జరిగే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సంగిశెట్టి బాలరాజు, కూనూరు శ్రీనివాస్, నోముల స్వామి, జెల్ల రమేష్, గడ్డం నరసింహ, గాలి సుదర్శన్, శంకర్, అంకం నరేష్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## రఘుమయ్య కుమారుడు కృష్ణకాంత్ వివాహ వేడుకకు ప్రముఖులు హాజరు

**ప్రజాపక్షం/చింతపల్లి** : సిపిఐ మర్రిగూడ మండల కార్యవర్గ సభ్యుడు, ప్రజాపక్షం మర్రిగూడ మండల విలేకరి,టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా కోశాధికారి ఆకుల రఘుమయ్య కుమారుడు కృష్ణకాంత్ వివాహం మాల్ ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది.ఈ వివాహ వేడుకకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు,ప్రజాపక్షం మేనేజర్ వి.మదన్‌లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.వివాహ కార్యక్రమానికి పల్లా లెనిన్ రవీంద్రచారి,జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.అంజాచారి,జిల్లా కౌన్సిల్ సభ్యుడుఈదుల భిక్షం రెడ్డి,మండల కన్వీనర్ బుర్ర శేఖర్,చెల్లం పాండురంగారావు,ఎరుకల నిరంజన్,కొట్టాల సర్పంచ్ కల్లెట్ల లింగయ్య, ఎరుకల యాదయ్య, మారయ్య తదితరులు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.అలాగే టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి,ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి దోటి శ్రీనివాస్, ప్రజాపక్షం జిల్లా ప్రతినిధి జిల్లా యాదయ్య విలేకరులు తెలగ మల్ల దశరథ,కర్నాటి వెంకటేశం,ఆరేకంటి రాధాకృష్ణ, ఊరుపాక వెంకటయ్య తదితరులు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.



# భారీ వర్షాలు, వరదల పట్ల అప్రమత్తం

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని, ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. విపత్తు నిర్వహణ, సహాయక చర్యలపై అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో గురువారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి శాఖ తమ బాధ్యతలను గుర్తించి, ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వీలుగా జిల్లా యంత్రాంగం పటిష్టమైన కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా గత అనుభవాలు, జరిగిన నష్టాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి ముందస్తు ప్రణాళికతో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. భారీ వర్షాల పట్ల జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా గ్రామ స్థాయిలో పంచాయితీ కార్యదర్శులు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించాలని, అదేవిధంగా మండల స్థాయిలో రెవెన్యూ విభాగం తరపున తహశీల్దార్లు, డిపిఓలు, ఇతర అధికారులు బాధ్యత వహించాలని ఆదేశించారు. మున్సిపాలిటిలు, గ్రామ పంచాయితీల పరిధిలో లోతట్టు ప్రాంతాలు, వరద ముంపునకు గురయ్యే కాలనీలను, ఎక్కువ ఇళ్లు దెబ్బతినే అవకాశం ఉన్న ఏరియాలను ముందుగానే ఐడెంటిపై చేయాలని సూచించారు. అత్యవసర సమయాల్లో అధికారులందరూ ఒకరికొకరు అందుబాటులో ఉండేలా కమ్యూనికేషన్ బుక్‌లెట్ రూపొందించాలని తెలిపారు. విపత్తు నిర్వహణలో భాగంగా అన్ని మున్సిపాలిటిలు, మండలాల్లో ముందస్తుగా మాక్ ఎక్సర్‌సైజ్ కండక్ట్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్‌రాజ్, జడ్‌పి సిఈఓ శిరీష, జిల్లా పంచాయితీ అధికారి యాదగిరి, డిఎంహెచ్‌ఓ వెంకటరమణ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

# అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలి : ఎఐఎస్ఎఫ్






**ప్రజాపక్షం/మోత్కూర్** : యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలోని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని, ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అక్రమంగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున పాఠశాలలను ఉద్దేశించి ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టి ఫీజులు నియంత్రణ చట్టం అమలు చేయాలని, అదేవిధంగా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు తమ ఇష్టానుసారంగా ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి పాఠశాలలోనే పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించాలని, విద్యార్థుల కోసం మూత్ర శాలాలు ఏర్పాటు చేయాలని అన్నారు విద్యా శాఖ అధికారులు పర్యవేక్షణ నిరంతరం ఉండాలని ప్రైవేట్ పాఠశాలల్లో ఎంఈఓ ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అక్రమంగా పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు చిప్పలపల్లి వంశీ, జిట్టా గౌతం, కరుణాకర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/వలిగొండ** : అనుమతి లేని శ్రీ చైతన్య పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్ మండల కేంద్రంలోని అనుమతులు లేని శ్రీ చైతన్య పాఠశాల పై చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి భాస్కర్ వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు మహేష్ మాట్లాడుతూ అనుమతులు లేని శ్రీ చైతన్య పాఠశాల చర్యలు తీసుకోవాలని మండలంలోని ప్రైవేట్ పాఠశాలలలో బుక్స్, యూనిఫామ్ తదితర వస్తువుల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తున్నారు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని వారు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు మారోజు నరసింహాచారి, ఏఎస్ఎఫ్ జిల్లా నాయకులు సూరారం కళ్యాణ్, ఏఐఎస్ఎఫ్ మండలం నాయకులు బాలగోని మచ్చగిరి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో క్షేత్ర స్థాయిలో పోలీసు నిఘా

రూరల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్‌పి



**ప్రజాపక్షం/కోదాడ రూరల్** : వార్షిక తనిఖీల్లో భాగంగా కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌ను గురువారం జిల్లా ఎస్‌పి కె. నరసింహ తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది నిర్వహించిన కవాతును పరిశీలించారు. సిబ్బంది యూనిఫాం, పోలీస్ సామాగ్రిని తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై పలు కీలక సూచనలు చేశారు. సిబ్బంది కలిసికట్టుగా పనిచేస్తూ స్థానిక సమస్యలు, కార్యకలాపాలపై వేగంగా సమాచారం సేకరించి నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. పోలీసు సేవల్లో వృత్తి నైపుణ్యం చూపాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో అత్యంత గౌరవంగా, మర్యాదగా నడుచుకోవాలని, వారికి మెరుగైన పోలీసు సేవలు అందించి భరోసా కల్పించాలని సూచించారు. తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాలకు ముఖద్వారంగా ఉన్నందున అక్రమ రవాణా, అసాంఘీక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచి నేరాలను సమర్థవంతంగా అరికట్టాలని స్పష్టం చేశారు. గ్రామాలలో క్షేత్ర స్థాయిలో పోలీసు నిఘా ఉంచి రాత్రి గస్తీ, పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాల నివారణకు కృషి చేయాలన్నారు. మహిళల భద్రతలో పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తుందని, మహిళలు, విద్యార్థులపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వేధింపులపై డయల్ 100, 112కు సమాచారం ఇవ్వాలని, ఇంటికి వచ్చి ఫిర్యాదులు తీసుకుని ఇంటి నుండే కేసులు నమోదు చేస్తున్నామని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి, సిఐ రామకృష్ణారెడ్డి, డిసిఆర్‌బి సిఐ మగ్దుం అలీ, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, రూరల్ ఎస్ఐ గోపాల్, షీ టీం ఎస్ఐ మల్లేశం, స్టోర్ ఆర్ఎస్ఐ అఖిల్, డిసిఆర్‌పి సిబ్బంది ఏఎస్ఐ అంజన్ రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ శేఖర్ రెడ్డి, ఎస్‌పి సిసి సందీప్ ఉన్నారు.



## పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

సిపిఐ రాష్ట్ర నాయకుడు ఉజ్జిని రత్నాకర్‌రావు డిమాండ్

**ప్రజాపక్షం/చింతపల్లి** : నల్లగొండ జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల ప్రజలకు సాగునీరు అందించాలని సిపిఐ రాష్ట్ర నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశానికి ముఖ్యతిథిగా హాజరయి ప్రసంగించారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశ సంపదను, ప్రజల ఆస్తులను కార్పొరేట్ గుత్త పెట్టుబడిదారులకు దోచిపెడుతూ దేశాన్ని లూటీ చేస్తున్నారని దుయ్యబట్టారు. నిత్యవసర ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవడం కోసం ప్రజలందరు ఏకమై బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న మతోన్మాద రాజకీయాలను తిప్పికొట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చాన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని, ఇందిరమ్మ ఇళ్లను పార్టీలకు అతీతంగా మంజూరు చేసి వాటి నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు అందోజు రవీంద్రాచారి, సీనియర్ నాయకులు ఉజ్జిని యుగెందర్‌రావు, రామారావు, సిపిఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావ్, లక్ష్మయ్య, శ్రీశైలం, ఇద్దిరాములు, బుచ్చయ్య, వెంకటయ్య, శంశొద్దిన్, వీరయ్య, నర్సింహ్మా, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎంజియు టీ-శాట్ మధ్య అవగాహన ఒప్పందం

ఆన్‌లైన్ శిక్షణా సర్టిఫికెట్ కోర్సుల విస్తరణకు శ్రీకారం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : ఉన్నత విద్యను మరింత విస్తృతంగా విద్యార్థులకు చేరవేసే లక్ష్యంతో మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం (ఎంజియు), తెలంగాణ స్కిల్ అండ్ అకాడమిక్ ట్రైనింగ్ (టీ శాట్) మధ్య అవగాహన ఒప్పందం (ఎంఒయు) కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా ఇప్పటికే నిర్వహిస్తున్న ఆన్‌లైన్ తరగతులను విస్తరించడంతో పాటు కొత్త సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించనున్నారు. ఎంజీయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్,టీసాట్ సీఈఓ బొదనపల్లి వేణుగోపాల్ రెడ్డి పాల్గొని ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు.ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం ద్వారా ఎంజీయూ అందిస్తున్న విద్యా అవకాశాలు మరింత విస్తృతంగా విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు,పరిమిత వనరులు ఉన్న ప్రాంతాల్లోని యువతకు మరియు ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించుకోవాలనుకునే వారికి ఈ ఆన్‌లైన్ కోర్సులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. నాణ్యమైన పాఠ్యాంశాలు, వ్యవహారిక శిక్షణా మాడ్యూల్స్ ద్వారా విద్యార్థుల ఉపాధి అవకాశాలు పెరిగేలా కోర్సులను రూపొందించాలని సూచించారు. టీసాట్ సీఈఓ బొదనపల్లి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన విద్యను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకురావడమే టీసాట్ ప్రధాన లక్ష్యమన్నారు.ఆర్థిక,భౌగోళిక పరిమితుల కారణంగా విద్యా అవకాశాలకు దూరమవుతున్న వర్గాలకు ఈ వేదిక ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యం ద్వారా మార్కెట్ అవసరాలకు అనుగుణమైన ప్రత్యేక సర్టిఫికెట్ ప్రోగ్రాములను రూపొందించి విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి టీసాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాదిక్, జనరల్ మేనేజర్ లింగారెడ్డి, ఎంజీయూ మేనేజ్‌మెంట్ డీన్ ఆచార్య అలవాల రవి,ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఆచార్య ఆకుల రవి,డాక్టర్ సభినా హరాల్డ్,డాక్టర్ మిరియాల రమేష్,డాక్టర్ మారం వెంకట రమణారెడ్డి, డాక్టర్ లక్ష్మీప్రభ, ఆచార్య శ్రీలక్ష్మి,డాక్టర్ శ్వేత,డాక్టర్ అనురాధ,డాక్టర్ జక్క సురేష్ రెడ్డి,డాక్టర్ కట్ట కిరణ్మయి, డాక్టర్ జ్యోతి, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

## హాలియా అభివృద్ధే లక్ష్యంగా...



**ప్రజా పక్షం/హాలియా**: హాలియా మున్సిపాలిటీ అభివృద్ధికి సభ్యులందరూ కృతనిశ్చయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. గురువారం హాలియా మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం మున్సిపల్ ఛైర్మన్ చింతల చంద్ర రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి మాట్లాడుతూ హాలియా మున్సిపాలిటీలో ప్రజల సౌకర్యార్థం చేపడుతున్న పనులు ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని చెప్పారు. అమృత స్కీం కింద నిర్మిస్తున్న ట్యాంకులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడాల్సిన బాధ్యత సభ్యులపై ఉందని తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు జీతభత్యాలు చెల్లింపులు రాబోయే వర్షాకాలానికి చేపట్టాల్సిన సౌకర్యాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రజలకు చేపట్టాల్సిన కనీస సౌకర్యాల గురించి సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్, మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి, కౌన్సిలర్లు కుందూరు వెంకటరెడ్డి, నకిరేకంటి అన్నపూర్ణ, కడమంచి ప్రమీల, చిట్టిపోలు శ్రీదేవి, బొంగరాలు యేసు రాజు, గౌహర్ జబిన్, ముత్యాలు పాల్గొన్నారు.

## గుడిసెలు ఉన్న వారికి ఇందిరమ్మ ఇండ్లు

**ప్రజాపక్షం/మునగాల**: మండలంలోని అర్హులైన గుడిసెలు ఉన్న వారికే ఇందిమ్మ ఇండ్లు మంజూరు చేయాలని హౌజింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిద్దార్ధ అన్నారు. గురువారం మండలంలోని ఎంపిడివో కార్యాలయంలో అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేయుటకు గాను గెజిటెడ్ అధికారులు వెటర్నరీ డాక్టర్లు మమత, భాస్కర్, హరిత, డిప్యూటి తహసిల్దార్ సత్యనారాయణ, వ్యవసాయ అధికారి బుంగ రాజు, అసిస్టెంట్ ఇంజనీరు రుతిక్, వినయ్, సిహెచ్ వినోద్ లను నియామకం చేశారు. వీరు గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల వివరాలు యాప్ ద్వారా అప్‌లోడ్ చేయుటకు నియామించినట్లు తెలిపారు. ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్, ఎంపీవో నరేష్, అసిస్టెంట్ ఇంజనీర్ నాగరత్నమ్మ, మూర్తి, ఏపీవో శైలజ పాల్గొన్నారు.

# మామూళ్లు ఇస్తేనే ఫైలు ముందుకు!

సాదా బైనామా కోసం రూ.22 వేల డిమాండ్ చేశారంటూ జిపిఒ అధికారిపై మహిళా రైతు ఆరోపణలు



**ప్రజాపక్షం/నకిరేకల్** : శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామంలో సాదా బైనామా ప్రక్రియ కోసం రూ.22 వేల లంచం డిమాండ్ చేశారంటూ గ్రామ జీపీఓ అధికారిపై ఓమహిళా రైతు చేసిన ఆరోపణలు కలకలం రేపుతున్నాయి.ఈవ్యవహారానికి సంబంధించిన సంభాషణ వీడియో వెలుగులోకి రావడంతో రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.చిత్తలూరుకు చెందిన రైతు సునీత తెలిపిన వివరాల ప్రకారం.. తన తల్లిదండ్రులకు చెందిన రెండు ఎకరాల రెండు గుంటల భూమికి తానే ఏకైక వారసురాలినని పేర్కొంది. ఈ భూమికి సంబంధించి 2020లో సాదా బైనామా కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపింది.ఇటీవల ప్రభు త్వం సాదా బైనామా దరఖాస్తుదారులకు భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడుతున్నట్లు సమాచారం అందడంతో, తన దరఖాస్తు పురోగతిపై తెలుసుకునేందుకు సంబంధిత అధికారులను సంప్రదించినట్లు పేర్కొంది.అనేకసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా తన దరఖాస్తు పెండింగ్‌లోనే ఉందని, ఇటీవల గ్రామ జీపీఓ అధికారిని సంప్రదించగా తొలుత ప్రక్రియ సాధ్యం కాదని చెప్పారని ఆరోపించింది. అనంతరం రూ.22 వేలిస్తే ఫైలు ముందుకు కదులుతుందని, లేదంటే పక్కన పెట్టేస్తామని హెచ్చరించినట్లు తెలిపింది.సాదా బైనామా ప్రక్రియ కోసం ఎమ్మార్వో కార్యాలయంలో డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని జీపీఓ అధికారి రజిత చెప్పినట్లు ఆరోపించింది. తాను ఒక్కరినే కాకుండా, ఇదే విధంగా మరికొందరిని కూడా డబ్బులు ఇవ్వాలని వేధిస్తున్నారని, ఈ వ్యవహారంలో అనేక మంది బాధితులు ఉన్నారని సునీత పేర్కొంది.ఈ ఘటనపై సంబంధిత అధికారులను వివరణ కోరగా, ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని వారు తెలిపారు.

**ఆరోపణలు నిరాధారం: రెవెన్యూ అధికారులు**

చిత్తలూరు సాదా బైనామా వ్యవహారంతో తమకు ఎలాంటి సంబంధం లేదని తహశీల్దార్ మాధవరావు డిప్యూటీ తహశీల్దార్ వరప్రసాద్ అధికారులు స్పష్టం చేశారు.బాధితురాలు గానీ,జీపీఓ అధికారి గానీ ఎక్కడా ఏ అధికారి పేరును ప్రస్తావించలేదని పేర్కొన్నారు. ఎమ్మార్వో కార్యాలయంలో డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని మాత్రమే చెప్పారని, ఆమె అలా ఎందుకు చెప్పిందన్నది తమకు తెలియదన్నారు.

**అధికారిణిపై వేటు..** సాదా బైనామా వ్యవహారంలో రూ.22 వేల లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి చేరిన నేపథ్యంలో సంబంధిత అధికారిణిపై శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశమున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆరోపణలపై జిల్లా యంత్రాంగం ఆరా తీస్తున్నట్లు తెలిసింది. విచారణలో ఆరోపణలు నిజమని తేలితే అధికారిణిపై వేటు పడే అవకాశం ఉందని అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే, దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## టిఫిన్ చేశారా తాతా..?

వృద్ధులకు ఎమ్మెల్యే వేముల ఆత్మీయ ఆతిథ్యం

**ప్రజాపక్షం/నకిరేకల్** : తాతా..బాగున్నావా ఇంత పొద్దుగాల ఏం పని మీద వచ్చారు..టిఫిన్ చేశారా లేదా..రండి..కలిసి తిందాం..కలిసి మాట్లాడుకుందాం అంటూ ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం నోట వచ్చిన ఈఆత్మీయ పలకరింపు అక్కడి వారిని కదిలించింది. హోదాను పక్కన బెట్టి,తనను కలిసేందుకు వచ్చిన ఇద్దరు వయోవృద్ధులను కన్నకొడుకులా ఆదరించిన ఆయన,స్వయంగా టిఫిన్ వడ్డించి మానవత్వాన్ని చాటుకున్నారు.చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన ఇద్దరు వయోవృద్ధులు గురువారం ఉదయం పనిమీద ఎమ్మెల్యే నివాసానికి వచ్చారు.వారిని గమనించిన వేముల వీరేశం ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఇంకా టిఫిన్ చేయలేదని తెలుసుకున్న వెంటనే వారిని ఇంట్లోకి ఆహ్వానించారు.అనంతరం వారితో కలిసి ఒకే వద్ద కూర్చొని టిఫిన్ చేస్తూ,వచ్చిన పనికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలవాలనే తన నిబద్ధతను మరోసారి చాటిన ఆయన తీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలంతా తన కుటుంబ సభ్యులేననే భావనతో వేముల వీరేశం చూపిన నిరాడంబరత,ఆత్మీయతకు ఈ ఘటన నిదర్శనంగా నిలిచిందని పలువురు పేర్కొన్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శుక్రవారం
19-06-2026
www.prajapaksham.in

‘ విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, అనిల్ రావిపూడి కలయికలో కొత్త సినిమా షూటింగ్ షురూ అయింది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మాణం; సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ , శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు. ’

# రీల్



## వెంకటేష్ కొత్త చిత్రం షూటింగ్ షురూ

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, అనిల్ రావిపూడి కలయికలో కొత్త సినిమా షూటింగ్ షురూ అయింది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మాణం; సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ , శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు. ఈ కాంబినేషన్ లో వినోదాత్మక చిత్రాన్ని అందించడానికి సిద్ధమవుతున్నారు. ఈ క్రేజీ కాంబినేషన్ చిత్రం 2027 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. కీర్తి సురేష్ కృతి శెట్టి ఇందులో కథానాయికలుగా నటిస్తున్నారు. చిత్ర బృందం పలువురు ప్రముఖ అతిథుల సమక్షంలో ఘనంగా జరిగిన ముహూర్తం పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం అధికారికంగా ప్రారంభమైంది. దిల్ రాజు, శిరీష్ స్రిప్ట్‌నా దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటికి అధికారికంగా అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ముహూర్తం సందర్భంగా, విక్టరీ వెంకటేష్, కళ్యాణ్ రామ్, కీర్తి సురేష్, కృతి శెట్టిలపై చిత్రీకరించిన మొదటి షాట్‌కు అల్లు అరవింద్ క్లాప్ కొట్టగా, సురేష్ బాబు కెమెరాను స్విచ్ ఆన్ చేశారు. దిగ్గజ దర్శకుడు కె. రాఘవేంద్ర రావు ప్రారంభ షాట్‌కు దర్శకత్వం వహించారు. అనిల్ రావిపూడి శైలిలో సాగే, నిరంతర వినోదం నవ్వులతో కూడిన సంక్రాంతి చిత్రంగా ఉండబోతోంది. వెంకటేష్ , ఆకర్షణను జోడించడంతో, అత్యంత ఆసక్తి కరంగా మారింది. ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటింగ్, ఎ.ఎ స్. ప్రకాష్ ఆర్ట్ డైరెక్షన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్గా వ్యవహరిస్తున్నారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

దివిజ ప్రభాకర్ హీరోయిన్‌గా

## ‘వెంకట్రామయ్య గారి తాలూకా’



ఈటీవి సీరియల్స్ తో పాపులర్ అయిన నటుడు ప్రభాకర్ కుమార్తె దివిజ ప్రభాకర్ వెంకట్రామయ్య గారి తాలూకా సినిమాతో హీరోయిన్ గా పరిచయం అవుతోంది. దినేష్ కుమార్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి సతీష్ ఆవాల దర్శకత్వం వహిస్తున్నారు. కోమలి క్రియేషన్స్ బ్యానర్‌పై కోమలి మహేందర్ తొట్టె, సోమేష్ సారిపల్లి నిర్మించిన చిత్రం ‘వెంకట్రామయ్య గారి తాలూకా‘ ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని జూలై లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత కోమలి మాట్లాడుతూ నేను కోమలి ఫోక్ సింగర్ గానా కంటూ ఒక గుర్తింపు తెచ్చుకుని సినిమా రంగం మీద నాకున్న ఇష్టం తో నేను సినిమా తీయాలి అని చాలా ఒడుదుడుకులని ఎదుర్కొని ‘వెంకట్రామయ్య గారి తాలూకా‘ చిత్రాన్ని పూర్తి చేశాము. ఈ సినిమా మొదలయినప్పటి నుండి ఇప్పటివరకు నేను పడిన కష్టం పడిన మాటలు కంటినిండా నిద్ర కూడా పట్టేది కాదు అన్ని కష్టాలు ఎదుర్కొని జులై లో మూవీ విడుదల చెయ్యడానికి రెడీ చేస్తున్నాము. దర్శకుడు సతీష్ అవాల మాట్లాడుతూ ‘వెంకట్రామయ్య గారి తాలూకా‘ చిత్రన్ని జులై లో విడుదల కానుండి త్వరలోనే డేట్ ఫైనల్ చేస్తామని చెప్పారు. ఒక పల్లెటూరు లో వెంకట్రమయ్య అనే పరువుగల కుటుంబం లోజరిగే ప్రస్తుతం మనుషుల మధ్య ఉన్న బంధాలు డబ్బు తో ముడిపడ్డాయి. మానవీయ సంబంధాలు అన్ని ఆర్థిక సంబంధాలు గా మారిపోయాయి. తల్లి తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలను కడుపు కట్టుకుని ఎన్నో కష్టాలను భరిస్తూ పిల్లలను ఎంతో అల్లారు ముద్దగా నలుగురు పిల్లలను పెంచి పెద్ద చేస్తున్నారు. కానీ తల్లి తల్లిదండ్రుల చివరి దశలో నలుగురు పిల్లలు కలిసి వాళ్ళని పెంచలేకపోతున్నారు. తల్లి తల్లిదండ్రుల గొప్పతనం తెలియచేసే సినిమా అని అన్నారు. ఈ చిత్రానికి కొరియోగ్రాఫర్: సాగర్ మాస్టర్, మ్యూజిక్ డైరెక్టర్: చరణ్ అర్జున్, కెమెరామెన్: బి. అనిల్ కుమార్, ఎడిటర్: మార్తాండ్ కె వెంకటేష్.

## బిజినెస్, సినిమా... రెండూ చేస్తున్నా

హీరోయిన్ రాశీ సింగ్



వడ్డే నవీన్ హీరోగా తెరకెక్కిన తాజా చిత్రం ట్రాన్స్ ఫర్ త్రిమూర్తులు. ఈ సినిమాలో రాశీ సింగ్ హీరోయిన్ గా నటించింది 19న ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో రాశీ సింగ్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఛత్తీస్‌గాఢ కు చెందిన నేను చిన్నప్పటి నుంచి ఏదో ఒకటి చేయాలని అనుకునేదాన్ని. మా నాన్న బిజినెస్ మెన్. అమ్మ ఎన్ జీఓ నడిపిస్తుంది. సోదరుడు హోటల్ మేనేజ్మెంట్ చేశాడు. ఇప్పుడు హైదరాబాద్ లో స్థిర పడ్డాం. నా సోదరుడు నేను కలిసి ఫుడ్ బిజినెస్ చేస్తున్నాం. నేను సినిమాలు, బిజినెస్ రెండు పడవల ప్రయాణం చేస్తున్న. రెండు కూడా హ్యాపీ గానే ఉంది. నాకు పద్నాలుగేళ్ళు ఉన్నప్పుడే మోడలింగ్ రంగంలో అడుగు పెట్టిన. మిస్ ఛత్తీస్‌గాఢ ఎంపికయ్యాను. తెల్లారి పేపర్ లో నా ఫొటో వచ్చాక మా ఇంట్లో తెలిసింది. దీంతో మా అన్న నన్ను బయటికి వెల్లనియ్యకుండా సుమారు మూడు నెలల పాటు హౌస్ అరెస్టు చేశారు. ఫోన్ కూడా లాక్కున్నారు. ఇంట్లోంచి బయటికి వెల్లే పరిస్తితి. ప్రసన్న వదనం లాంటి సినిమాల తరువాత ఇప్పుడు వడ్డే నవీన్ తో ట్రాన్స్ ఫర్ త్రిమూర్తులు అనే సినిమా చేశాను. ఈ సినిమాలో నేను పక్కింటి అమ్మాయిగా నటించాను. నిత్యం ట్రాన్స్ ఫర్ అవుతుంటే సామాన్లు కూడా ప్యాక్ చేయకుండా అలానే ఉంచుతుంది అన్నమాట. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను తెరకెక్కించారు. దర్శకుడు కమల్ తేజ్ చాలా క్లారిటీగా ఉన్న డైరెక్టర్. నవీన్ ను నేను ఫస్ట్ అడిగిన ప్రశ్న ఏంటంటే ఇంతకాలం తరువాత ఎందుకు సినిమా చేస్తున్నారు అని అడిగిన. ఆయన చాలా హార్డ్ వర్కర్. షూటింగ్ స్పాట్ లో మొట్ట మొదటగా వచ్చే వ్యక్తి నవీన్. షూటింగ్ ప్యాకెట్ అయినాక లాస్ట్ కు పోయే వ్యక్తి కూడా నివీనే. నాకు అన్ని రకాల పాత్రలు చెయ్యాలని ఉంది. యాక్షన్ తో పాటు డి గ్లామర్ పాత్రలు కూడా చేయాలనుంది. కొంతకాలం ఎయిర్ హోస్టెస్ గా పని చేశాను. తరువాత సినిమా రంగంలోకి వచ్చాను. తెలుగు భాష నేర్చుకోడానికి నాకు రెండేళ్లు పట్టింది. నేను డబ్బును చాలా బాగా మేనేజ్ చేయగలను. కొన్ని సినిమాలు చేస్తున్నాను. ఒక సినిమాలో గ్లామర్ క్యారెక్టర్ కూడా చేస్తున్న. మా అమ్మ ఎన్‌జిఒ నడిపిస్తుంది కాబట్టి సేవా దృక్పథం నాకు చిన్నప్పటి నుంచే అలవాటు ఉంది. నా బర్త్ డే కు కూడా నేను చిన్నారులకు సహాయం చేస్తునే ఉంటా. కానీ రాజకీయాల్లోకకి వచ్చే ఆలోచన లేదు .

## శ్రీ విష్ణు హీరోగా కామ్రేడ్ కల్యాణ్



శ్రీ విష్ణు తన లేటెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘కామ్రేడ్ కల్యాణ్’తో వస్తున్నారు. ఈ చిత్రాన్ని వెంకట్ ప్రెజెంట్ చేస్తుండగా, జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం హిస్తున్నారు. వెంకటకృష్ణ కర్నాటి, సీతా కర్నాటి స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ ఎల్పి బ్యానర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ సింగిల్ ఒరియా పిల్లా జూన్ 20న రిలీజ్ చేయనున్నారు. సాంగ్ అనౌన్సెమెంట్ పోస్టర్‌లో శ్రీవిష్ణు, మహిమా మధ్య కనిపించిన అందమైన కెమిస్ట్రీ, లవ్ వైబ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో రాధికా శరత్కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమయే కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సాయి శ్రీరామ్ డీవోపీ, విజయ్ బుల్గానిన్ మ్యూజిక్, చోటా కె ప్రసాద్ ఎడిటర్ గా పని చేస్తున్నారు .శ్రీ విష్ణు, మహిమా నంబియార్, రాధిక శరత్కుమార్ హీరోయిన్ లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సమర్పణ: కోన వెంకట్, సంగీతం: విజయ్ బుల్గానిన్, డీఓని: సాయి శ్రీరామ్, ఎడిటర్: ఛోటా కె ప్రసాద్.

## 27న మళ్లీ ప్రేక్షకుల ముందుకు ‘కన్నప్ప’



హీరో విష్ణు మంచు గత ఏడాది ‘కన్నప్ప’ సినిమాతో జనం ముందుకు వచ్చారు. అవా ఎంటర్టైన్‌మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద ‘కన్నప్ప’ మూవీని డా. ఎం. మోహన్ బాబు నిర్మించిన సంగతి తెలిసిందే. ముఖేష్ కుమార్ సింగ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇక ఈ ప్రాజెక్ట్‌లో అక్షయ్ కుమార్, మోహన్ లాల్, ప్రభాస్, కాజల్, బ్రహ్మానందం ఇలా ఎంతో మంది నటీనటులు కీలక పాత్రలను పోషించారు. ఈ సినిమా రిలీజ్ అయి ఏడాది అవుతున్న సందర్భంగా మళ్లీ జూన్ 27న ‘కన్నప్ప’ను రిలీజ్ చేయబోతోన్నారు. ఈ మేరకు రీ రిలీజ్ డేట్ పోస్టర్ విడుదల చేశారు.

## ‘సిప్పు సిప్పు’ పాట రిలీజ్



రవి వర్మ, రాశి సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నా వైభవ్ సినీ స్కల్ప్ట్ స్టూడియోస్ బ్యానర్‌పై యతి నిర్మాతగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం ‘గాసిప్ . వైభవ్ కౌండిన్య రూపొందిస్తున్నారు. ఈ సినిమా నుంచి సిప్పు సిప్పు ఫుల్ లిరికల్ సాంగ్ ని ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదల చేశారు. శక్తి కాంత్ కార్తీక్ స్వరపరిచిన ఈ ఎనర్జెటిక్ పబ్ డాన్స్ ట్రాక్కు కాసర్ల శ్యామ్ సాహిత్యాన్ని అందించగా సింగర్ మాళవిక గాత్రంతో పాటను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. గాసిప్ అనే ఈ సినిమా ఒక మిడిల్ క్లాసు అమ్మాయి చుట్టూ తిరిగే కథతో యూత్ కు మాత్రమే కాకుండా కుటుంబ ప్రేక్షకులకు నచ్చేలా తిర్చితిద్దుతున్నారు. సునీల్ సున్నపు మాస్టర్, ఫల్గుణి బంగెర కొరియోగ్రఫీ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు శక్తికాంత్ కార్తీక్ , డిఓపి సతీష్ , ఎడిటర్ జై కుమార్ , సహ నిర్మాత నరసింహం తెలనాకుల.

## ప్రభుత్వ భూమిపై రుణం ఎలా ఇస్తారు?

**హైదరాబాద్:** ప్రభుత్వం ఇచ్చిన భూమిపై రుణం ఎలా ఇస్తారని ఎస్‌బీఐని హైకోర్టు ప్రశ్నించింది. కంపెనీకి కేటాయించిన భూమిని ప్రభుత్వం తిరిగి తీసుకోవాలనే నిర్ణయం తీసుకున్నా రుణం ఇవ్వడం ఏమిటని ప్రశ్నించింది. విలువ రూ200 కోట్లు ఉంటే రూ.500 కోట్ల రుణం ఇవ్వడం ఏమిటని నిలదీసింది. రుణం మంజూరు చేశారంటూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారుల తీరుపై ఆగ హాన్ని వ్యక్తం చేసింది. ఇలాంటి రుణాల మంజూరు విధానం బ్యాంకుల ఆర్థిక స్థితి ని దెబ్బతీస్తోందని, దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతోందని వ్యాఖ్యానించింది. డబ్బులు దాచుకున్న ప్రజలు నష్టపోతున్నారని కూడా వ్యాఖ్యానించింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల గ్రామంలోని ఫ్యా బ్‌సిటీ సెజ్‌లో సెమ్ ఇండియా ఫ్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన 100 ఎకరాల భూమిని ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవడాన్ని సవాలు చేస్తూ ఎస్‌బీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు.

## వేలంపై హైకోర్టు సే (మొదటి పేజీ తరువాయి)

ఎస్. నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, బ్యాంకు అధికారులు మే 4న జరిగిన సమావేశంలో ప్రత్యామ్నాయంగా 2.57 ఎకరాల భూమి స్వీకరించేందుకు మౌఖికంగా అంగీకరించారని, ఆ తర్వాతే వేలం నోటిఫికేషన్ జారీ చేశామని తెలిపారు. భూమి కేటాయింపు షరతులను ఎస్‌బీఐ పాటించకపోవడంతోనే రద్దు ప్రక్రియ ప్రారంభమైందని, వేలం పారదర్శకంగా జరిగి ప్రభుత్వానికి సుమారు రూ.1,200 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. ఈ భూమిని కొనుగోలు చేసుకున్న వాళ్లు వాళ్లకు ఇష్టమైన రీతిలో ఫాం హౌస్ లాంటివి కూడా నిర్మాణం చేసుకోవచ్చునని చెప్పారు. ప్రభుత్వ తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ రజనీకాంత్‌రెడ్డి వాదిస్తూ, ప్రభుత్వ భూముల వేలం చట్టబద్ధమేనని, 2010లో భూమి కేటాయించినప్పటి నుంచి 16 ఏళ్లుగా ఎస్‌బిఐ ఎలాంటి నిర్మాణ కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. అవసరమైన అన్ని అనుమతులు ఉన్నప్పటికీ ప్రాజెక్టు చేపట్టలేదన్నారు. ఐదు వేల మందికి ఉపాధి కల్పన చేస్తామని చెబితే ప్రభుత్వం భూమి రాయితీపై ఇచ్చిందన్నారు. ఎస్‌బిఐ తరఫున సీనియర్ న్యాయవాదిఎన్. వెంకటరామన్, సీనియర్ న్యాయవాది బి.ఎస్. ప్రసాద్ వాదనలు వినిపిస్తూ, భూకేటాయింపును చట్టబద్ధంగా రద్దు చేయకముందే వేలం ప్రక్రియ చేపట్టారని తెలిపారు. బ్యాంకు విజ్ఞప్తిపై నిర్ణయం తీసుకోకుండానే ప్రభుత్వం వేలం నిర్వహించిందని, హైదరాబాద్‌లో రెండో అతిపెద్ద కార్పొరేట్ కార్యాలయం ఏర్పాటు చేయాలన్న ఎస్‌బీఐ ప్రణాళికను విస్మరించిందన్నారు. వాదనల అనంతరం హైకోర్టు, టిజిఐఐసి వేలం నోటిఫికేషన్, తదనంతర ప్రక్రియపై మూడు వారాల పాటు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

## సెర్ప్ ఆధ్వర్యంలో ‘విద్యార్థుల యూనిఫాం’ల తయారీ

ప్రతిరోజూ లక్షకు పైగా యూనిఫాముల సరఫరా...

నేడు సిఎం చేతుల మీదుగా పంపిణీ కానున్న 5 వేల స్టూడెంట్ కిట్లు సిద్ధం...

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యాకానుకలో భాగంగా 8,9,10వ తరగతి గురుకుల విద్యార్థులకు అందజేయనున్న ‘స్టూడెంట్ కిట్ల’ను సిద్ధం చేశారు. హైదరాబాద్ లోని ఎల్.బి. స్టేడియంలో శుక్రవారం సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందజేయనున్న 5వేల స్టూడెంట్ కిట్లను సెర్ప్‌ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాలు సిద్ధం చేశాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు కావాల్సిన యూనిఫాములను సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక బృందాలు సిద్ధం చేస్తున్నాయి. విద్యార్థులకు సకాలంలో యూనిఫాములు అందించేందుకు మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులు అహర్నిశలు కృషి చేస్తున్నారు. మహిళల నైపుణ్యాలను ఉపాధిగా మార్చి, వారి కుటుంబాలకు ఆదాయ వనరులు కల్పించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలను అందించే ఉమ్మడి లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది. 202627 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల మందికి పైగా మహిళా సంఘాల టైలర్లు యూనిఫాంల కుట్టు పనుల్లో పాల్గొంటున్నారు. వీరిలో దాదాపు 15 వేల మందికి ప్రత్యేక శిక్షణ అందించి, ఆధునిక ప్రమాణాలతో యూనిఫాంల తయారీ చేపట్టారు. విద్యార్థుల కొలతలను సేకరించి, వాటి ఆధారంగా యూనిఫాంలను కుట్టడం ద్వారా ప్రతి విద్యార్థికి సరైన కొలతలో దుస్తులు అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

యూనిఫాంల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా ‘మేకర్ అండ్ చెకర్’ విధానాన్ని అమలు చేస్తున్నారు. ప్రతి కేంద్రంలో ప్రత్యేకంగా మహిళా సభ్యులను నాణ్యత పరిశీలకులుగా నియమించి, కుట్టిన ప్రతి యూనిఫాంను తనిఖీ చేస్తున్నారు. అలాగే అవసరమైన మార్పులు, చేర్పులు వెంటనే చేయడానికి గ్రామ స్థాయిలోనే టైలర్లను అందుబాటులో ఉంచుతున్నారు. ప్రస్తుతం మహిళా సంఘాల సభ్యులు ప్రతిరోజూ లక్షకు పైగా యూనిఫాంలను కుట్టి సంబంధిత పాఠశాలలు, గురుకులాలకు సరఫరా చేస్తున్నారు. విద్యార్థులందరికీ యూనిఫాంలు అందేలా వేగంగా పనులు కొనసాగిస్తున్నారు.



**మహిళా సంఘాలు రాష్ట్రాభివృద్ధిలో కీలక భాగస్వాములు....**

మహిళా స్వయం సహాయక బృందాలు కేవలం పొదుపు, రుణాలకే పరిమితం కాకుండా రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా ఎదుగుతున్నాయని మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. సెర్ప్ మహిళలకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వారి ఆర్థిక స్వావలంబనకు బాటలు వేస్తోందని, ఒకవైపు మహిళలకు ఆదాయం, మరోవైపు విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు అందేలా చేస్తున్న ఈ కార్యక్రమం ఆదర్శప్రాయమన్నారు.

## భారత్ ఫ్యూచర్ సిటీ ఆగదు

(మొదటి పేజీ తరువాయి)

సిఎం మండిపడ్డారు. ప్రజలకు ప్రాణాంతకమైన ఫార్మ సిటీని రద్దుచేసి 'కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నాం. నగర అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తుంటే.ఫ్యూచర్ లేని నేతలు ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని చెబుతున్నారు. వాళ్ల ఫ్యూచర్ ను ప్రజలు నిర్ణయిస్తే.. ఒకాయన ఫాంహౌస్‌కు పరిమితమయ్యారు. తాటి చెట్టు అంత ఎదిగిన ఇంకొకాయన ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తానన్న ఆయన ఈసారి సిద్దిపేటలో గెలవరు. కొందరు ఎన్జీటీలో కేసులు వేస్తున్నారు. మూసీలో కాలుష్యం కంటే.. కల్వకుంట్ల వాళ్ల కడుపులో కాలుష్యమే ఎక్కువ. ఎవరు అడ్డుపడినా అంతర్జాతీయస్థాయిలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతాం అని అన్నారు.

కబ్జాలు పెట్టే వారిని వదలం చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను కబ్జాలు పెట్టే ఎంతటి వారైనా వదలమని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. చెరువులు కుంటలు కొంతమంది ఆక్రమిస్తే, వేలాదిమంది వరదల్లో మునిగిపోతున్నారని గతాన్ని గుర్తు చేశారు. ఎవరి స్థలంలో వారు కట్టుకుంటే అలాంటి వారి జోలికి హైడ్రా వెళ్లదని, కబ్జా పెట్టుకునే వారి వీపులకు సున్నం పెడుతుందన్నారు. పాలకులు కాలుష్యాన్ని పట్టించుకోకపోవడం వల్లనే ఢిల్లీ, బెంగుళూరు, ముంబాయి, కలకత్తా, వంటి నగరాలు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నాయని గుర్తు చేశారు. హైదరాబాదులో అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు మూసి పక్షులను చేస్తామంటే అడ్డుపడుతున్నారని, ఆనాడు మూసి పక్షంలో భాగంగానే ఎల్బీనగర్లో నందనవనంను నిర్మించి అక్కడి ప్రజలను తరలించడం జరిగిందన్నారు. ఇప్పుడు ఎవరు ఎమ్మెల్యే కావాలన్నా నందనవనం ప్రజలను దర్శనం చేసుకోవాల్సిందేనని తెలిపారు. ప్రపంచ చిత్రపటంలో శంషాబాద్ ఏర్పడే స్థాయికి వచ్చిందంటే అది అప్పటి మంత్రి దేవేందర్ గౌడ్ కృషి ఎంతో ఉందన్నారు. సద్ది కట్టుకుని



పోయి కూర్చుని శంషాబాద్ ఏర్పాటు నిర్మాణం కు ఆయన కృషి చేశారని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నాడు ఎల్బీనగర్ లోని సిరీస్ కంపెనీ తో త్రిప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితి మరోసారి పునరావృతం కావద్దని ఫార్మాసిటీని రద్దుచేసి ఫ్యూచర్ సిటీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని సిఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు 5 లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని రేవంత్‌రెడ్డి గుర్రంగూడ నుంచి ప్రారంభించారు. ఎల్‌బి నగర్ నియోజకవర్గం అంటే నాకు చాలా ప్రేమభిమానాలు ఉన్నాయన్నారు. నా సొంత ఊరుకు వెళ్లితే ఎలా ఉంటుందో, ఎల్‌బి నగర్‌కు వస్తే అనిపిస్తుందని ఆయన గుర్తు చేశారు. రంగారెడ్డి జిల్లాలో ఇటువైపు ఎల్‌బి నగర్ కోసం ఎన్ని నిధులు మంజూరు చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాన్నారు. అంతర్జాతీయ మార్కెట్ యార్డు తీసుకురావడం జరిగిందని, దాదాపు 240 కోట్ల వ్యయంతో పండ్ల మార్కెట్ అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం టి పి సి సి ప్రచార కమిటీ చైర్మన్, ఎల్బీనగర్ ఇన్చార్జ్ మధుయాస్కీ గౌడ్ , తెలంగాణ అర్బన్ ఇన్ఫాస్ట్ ఎక్రెస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు మల్ రెడ్డి రంగారెడ్డి, కాల్వ సుజాత, జితేందర్ రెడ్డి, టిపిసిసి సభ్యులు దేప దీప భాస్కర్ రెడ్డి,రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిలు డుమ్మా

(మొదటి పేజీ తరువాయి)

ఆ ద్రోహులు భారత వైమానిక దళం రక్షణను కోరాల్సి ఉంటుందని హెచ్చరిస్తూ వారిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రౌత్‌తో పాటు సేన (యుబిటి) ఎంపిలు అరవింద్ సావంత్, అనిల్ దేశాయ్, రాజాభావు వాజే ఈ సమావేశానికి హాజరయ్యారు. మిగిలిన ఆరుగురు లోక్‌సభ ఎంపిలు హాజరుకాకపోవడం పార్టీ పార్లమెంటరీ విభాగంలో దాదాపు చీలిక వచ్చేనట్లేనని అర్థమవుతోంది. సమావేశానికి గైర్హాజరైన ఎంపిల్లో నాగేశ్ అష్టికర్, సంజయ్ దేశ్‌ముఖ్, సంజయ్ జాదవ్, సంజయ్ దినా పాటిల్, ఓంప్రకాష్ రాజెనింబాల్కర్, భాసాహెబ్ వాక్‌చౌరే ఉన్నారు. ఆ ఆరుగురు ఎంపిలకు ‘షోకాజ్ నోటీసులు (వివరణ కోరే నోటీసులు) జారీ చేయనున్నట్లు సావంత్ విలేకరులతో చెప్పారు. ‘ఈ సమావేశానికి సంబంధించి విప్ (పార్టీ ఆదేశం) జారీ చేసినప్పటికీ వారు ఎందుకు హాజరుకాలేదో అడుగుతాము. సమాధానం ఇవ్వడానికి వారికి ఏడు రోజుల సమయం ఇస్తాము; ఒకవేళ వారు స్పందించకపోతే, వారి అనర్హతను కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాస్తాము’ అని శివసేన (యుబిటి) లోక్‌సభ ఫ్లోర్ లీడర్ పేర్కొన్నారు. ఎంపిలు హాజరుకాకపోవడాన్ని పార్టీ విప్ ఉల్లంఘనగా పరిగణిస్తామని, చట్టసభ సభ్యులుగా వారిని అనర్హులుగా ప్రకటించేందుకు చట్టపరమైన చర్యలు చేపడుతున్నామని రౌత్ తెలిపారు. షిండే నేతృత్వంలోని సేనలో విలీనం కావాలని కోరుతూ ఆ ఆరుగురు అసమ్మతి ఎంపిలు ఒక లేఖపై సంతకాలు చేసి, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే, ఈ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని, ధృవీకరణ కోసం కొందరు ఎంపిలు స్వయంగా హాజరుకావాల్సి ఉంటుందని స్పీకర్ కార్యాలయం భావిస్తోందని, ఈ ప్రక్రియ త్వరలో జరిగే అవకాశం ఉందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

ప్రస్తుతం సంతకాల ధృవీకరణ ప్రక్రియ కొనసాగుతోందని ఆ వర్గాలు చెప్పాయి. కాగా, స్పీకర్‌కు రాసిన లేఖ నిజంగా ఉంటే, ఆ అసమ్మతి ఎంపిలు దానిని బహిర్గతం చేయాలని సావంత్ డిమాండ్ చేశారు. బుధవారం కూడా అసమ్మతి నేతలపై దూషణలకు దిగిన రౌత్, ‘ఈసారి వ్యవహారం అంత సులభం కాదు, వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు అని స్పష్టం చేశారు. ‘ద్రోహులు తమ ఇళ్లకు గానీ, నియోజకవర్గాలకు గానీ తిరిగి వెళ్లలేరు. వారికి తగిన గుణపాఠం నేర్పిస్తాం. వారు ఇంటికి చేరుకోవడానికి సైన్యం సహాయం, రక్షణ కోసం భారత వైమానిక దళం సహాయం అవసరమవుతుంది’ అని రౌత్ హెచ్చరించారు. దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితికి సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘమే బాధ్యత వహించాలని ఆయన పేర్కొన్నారు. బుధవారం, శివసేన (యుబిటి) తన ఎంపిలకు పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి హాజరు కావాలని త్రిలైన్ విప్ జారీ చేసింది. లోక్‌సభలో శివసేన (యుబిటి)కి తొమ్మిది మంది ఎంపిలు ఉన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం అనర్హత నుండి తప్పించుకోవాలంటే వారిలో కనీసం ఆరుగురు కలిసి పక్షం మారాల్సి ఉంటుంది.

**శివసేన (యుబిటి) ఎంపిలకు వైప్లస్ సెక్యూరిటీ**

శివసేన (యుబిటి)కు చెందిన ఆరుగురు తిరుగుబాటు ఎంపిలు వేరే పార్టీలోకి మారడానికి ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల నుండి వారికి బెదిరింపులు వస్తున్నందున మహారాష్ట్ర పోలీసులు వారికి ‘వైప్లస్’ భద్రతను కల్పించారు.

ఇంటెలిజెన్స్ కమిషనర్ శిరీష్ జైన్ సంతకం చేసిన లేఖ ప్రకారం, సంజయ్ దినా పాటిల్ (ముంబయి—ఈశాన్య), సంజయ్ దేశ్‌ముఖ్ (యావత్మాల్—వాషిమ్), సంజయ్ జాదవ్ (పర్భానీ), భాసాహెబ్ వాక్‌చౌరే (షిర్డీ), నాగేశ్ పాటిల్‌అష్టికర్ (హింగోలి)ష ఓంప్రకాష్ రాజే నింబాల్కర్ (ఉస్మానాబాద్)లకు ఈ భద్రత కల్పించారు. ఇది తక్షణమే అమల్లోకి వస్తుంది ఆ లేఖలో పేర్కొన్నారు.

## ‘నేషనల్ డిఫెక్టర్స్ అలయన్స్’

(మొదటి పేజీ తరువాయి)

(డీలిమిటేషన్)కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదింపజేయడంలో విఫలమైనప్పుడు, ఈ ఏడాది ఏప్రిల్ 17న లోక్‌సభలో షాకు అవమానం ఎదురైందని, దానికి ప్రతీకారం తీర్చుకునేందుకు ఆయన ఇప్పుడు అత్యంత నీచమైన ఎత్తుగడలకు పాల్పడుతున్నారని రమేశ్ మండిపడ్డారు. షా రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడికి దిగారని ఆయన ఆరోపించారు. ‘ఎన్‌డిఎ (నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్)ను ‘నేషనల్ డిఫెక్టర్స్ అలయన్స్’గా మార్చడానికి అమిత్ షా కృతనిశ్చయంతో ఉన్నారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో ఆయనకు అవమానం జరిగింది. పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందుతుందని ఆయన భావించారు’ అని రమేశ్ పిటిఐతో అన్నారు. ‘ఆయన (షా) ప్రధాన మంత్రి (నరేంద్ర మోదీ)కి హామీ ఇచ్చారు. కానీ ప్రతిపక్షాల ఐక్యత, సంఘీభావం కారణంగా ఆ బిల్లు ఆమోదం పొందలేదు. వారికి కేవలం 298 ఓట్లు మాత్రమే వచ్చాయి, కానీ 543 మంది సభ్యులు ఉండి ఓటింగ్ జరిగిన లెక్క ప్రకారం వారికి 362 ఓట్లు అవసరమయ్యాయి. కాబట్టి వారు మూడింట రెండు వంతుల మెజారిటీకి చాలా దూరంగా ఉండిపోయారు. అది వారికి అవమానకరం, ఎదురు దెబ్బ’ అని రమేష్ పేర్కొన్నారు. హోం మంత్రి దీనిని ఊహించలేదన్నారు. ఏప్రిల్ 17 నాటి ఆ అవమానానికి ప్రతిస్పందనగా హోం మంత్రి ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని కాంగ్రెస్ నేత ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలను అస్థిరపరిచేందుకు షా ఈ భారీ కార్యక్రమాన్ని చేపట్టారని ఆయన ఆరోపించారు. ‘ఒకప్పుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ నిర్వహించిన పదవిలో ఉన్న వ్యక్తి, తనకు ఎదురైన అవమానానికి ప్రతీకారం తీర్చుకోవడానికి ఇలాంటి అత్యంత నీచమైన ఎత్తుగడలకు పాల్పడటం నిజంగా సిగ్గుచేటు’ అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. షా ఆడుతున్నవి అత్యంత నీచమైన ఎత్తుగడలు అని రమేష్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కేవలం చేతులు కట్టుకుని కూర్చోలేదని, తన మిత్రపక్షాలు, ఇతర ప్రతిపక్ష పార్టీలతో సంప్రదింపులు జరుపుతోందని ఆయన స్పష్టం చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com